SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 5
October-2021, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

అక్టోబరు 2021
వెల రూ.5/-
పుటలు - 56



11-10-2021
సోమవారం
రాత్రి:
గరుడవాహనం

తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2021 అక్టోబరు 07 నుండి 15 వరకు



తిరుమల

శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2021 అక్టోబరు 07 నుండి 15 వరకు




07-10-2021
గురువారం
పగలు:
ధ్వజారోహణం



07-10-2021
గురువారం
రాత్రి: పెద్దశేషవాహనం



08-10-2021
శుక్రవారం
పగలు: చిన్నశేషవాహనం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : కృపయా పరయాఽఽవిష్టో విషీద న్నిద మబ్రవీత్ ।**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 28)

**ప్రతిపదార్థం:** పరయా= అధికమైన; కృపయా= కనికరంతో; ఆవిష్టః= కూడినవాడై; విషీదన్= దుఃఖిస్తూ; ఇదం= ఈ చెప్పబోయేవాక్యాన్ని; అబ్రవీత్= పలికాడు.

**భావం:** అర్జునుడు యుద్ధభూమిలో నిలబడి ఉన్న ఆ బంధువులందరినీ బాగా పరికించి దయార్ద్రహృదయుడై, దుఃఖిస్తూ ఇలా పలికాడు.

## గరుడగమన గరుడధ్వజ

గరుడగమన గరుడధ్వజ
నరహరి నమో నమో నమో

కమలాపతి కమలనాభా
కమలజజన్మకారణిక
కమలనయన కమలాప్తకుల
నమో నమో హరి నమో నమో

జలధిబంధన జలధిశయన
జలనిధిమధ్య జంతూకల
జలధిజామాత జలధిగంభీర
హలధర నమో హరి నమో

ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనాఘనకాయవర్ణ
అనఘ శ్రీ వేంకటాధిప తేఽహం
అనుపమ నమో హరి నమో

(అధ్యాత్మసంకీర్తన-391, సంపుటం- 2)



గరుడుడు వాహనంగగలవాడా! గరుడచిహ్నం ధ్వజానకలవాడా! నరసింహావతారా! నీకు నమస్కారం. నమస్కారం. నమస్కారం.

కమలం చేతియందు కలిగింది కమల. ఆమెకు నాథుడా! పద్మం నాభియందు కలవాడా! పద్మంనుంచి పుట్టిన బ్రహ్మజన్మకు కారణమైనవాడా! పద్మంవంటి కనులు కలిగినవాడా! కమలానికి ఇష్టమైన సూర్యవంశంలో రామునిగా పుట్టినవాడా! పాపాలను హరించేవాడా! హరీ! నీకు నమస్కారం. నమస్కారం. నమస్కారం.

రామునిగా సముద్రాన్ని బంధించినవాడా! సముద్రంలో శయనించేవాడా! సముద్రంలో పుట్టిన లక్ష్మిని పెళ్లి చేసుకుని, సముద్రానికి అల్లుడైన వాడా! సముద్రంలా తెలిసికొనుటకు వీలుకానివాడా! నాగలిని ఆయుధంగా ధరించినవాడా! హరీ! నమస్కారం. నమస్కారం.



గొప్పదైన దివ్యస్వరూపం కలవాడా! గొప్పవైన మహిమలే గుర్తుగా కలిగినవాడా! వర్షా కాలంలో ఉండే దట్టమైన నల్లని మేఘంవంటి శరీరకాంతి కలిగినవాడా! పుణ్యాత్మా! శ్రీవేంకటపర్వతానికి అధిపతీ! పోలిక లేనివాడా! నీకు నా నమస్కారం అంటూ అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుణ్ణి వివిధ విశేషణాలతో కీర్తించాడు.

# థర్డ్‌వేవ్‌తో జాగ్రత్త!

## వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ భారతదేశ ప్రజానీకాన్ని హెచ్చరించింది



ఇప్పటిదాకా కోవిడ్-19 వైరస్ మొదటి, రెండు వేవ్‌లను మనం చూచినాం. ఇక రాబోయేది పై రెండింటికన్నా ఎక్కువ ప్రమాదకారి అయిన థర్డ్‌వేవ్. దీన్ని డెల్టా వేరియంట్‌గా శాస్త్రవేత్తలు పరిగణించారు. ఈ ప్రమాదం నుండి మనల్ని మనం కాపాడుకోవాలి.

దీనికి ఒకే ఒక పరిష్కారం మిమ్మల్ని మీరు మాత్రమే రక్షించుకోవడం. కుటుంబ సభ్యులందరూ దయచేసి గమనించండి.

- కడుపులను ఖాళీగా ఉంచకండి. వేళకు ఆహారం తీసుకోండి!
- ఈ సమయంలో ఉపవాసాలు ఆచరించడం సముచితం కాదు.
- రోజూ ఒక గంట సూర్యరశ్మిని తప్పక ఆస్వాదించండి.
- ఏ.సి. ఏ మాత్రం ఉపయోగించవద్దు.
- వెచ్చని నీరు త్రాగండి, గొంతు తడిగా ఉంచండి.
- ముక్కుకు ఆవనూనె రాయండి.
- ఇంట్లో హారతి కర్పూరం కాల్చండి.
- ప్రతి కూరగాయకు అర టీస్పూన్ పొడి అల్లం జోడించండి.
- దాల్చినచెక్క వాడండి.
- రాత్రి కప్పు పాలతో ఒక స్పూన్ పసుపు త్రాగాలి.
- వీలైతే ఒక చెంచా చ్యవన్ ప్రాశ తినండి.
- ఇంటిలో కర్పూరం మరియు లవంగాలతో పొగ వేయండి.
- ఉదయం టీలో లవంగం వేసి మరిగించి తాగండి.
- పండ్లలో ఎక్కువ నారింజ మాత్రమే తినండి.
- పాలలో పసుపు మీ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- రెండు మాస్కులను సక్రమంగా ధరించాలి.
- చేతులను తరచుగా సానిటైజ్ చేసుకోవాలి (లేదా) సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

వీలు అయినంత త్వరగా అందరూ వ్యాక్సిన్ వేయించుకోండి.







మీరు థర్డ్‌వేవ్‌ను ఓడించాలనుకుంటే, దయచేసి ఇవన్నీ చేయండి.

పై వాటిని పాటించడం వ్యక్తిగతమే కాదు, సామాజిక బాధ్యత కూడా!




50 వసంతాల
1970-2020
SAPTHAGIRI
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 అక్టోబరు, 2021 సంచిక : 05


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| తిరుమల వెంకన్నను దర్శిద్దాం! | శ్రీ బి.వి.రమణ | 07 |
| అమ్మలగన్నయమ్మ | శ్రీమతి కె.అరుణావ్యాస్ | 14 |
| పురాణపురుషా! గోవిందా! | డా॥ కె.వి.రాఘవాచార్య | 17 |
| ఈయన ఊరెరిగింపు తర్వాతే... | శ్రీ కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య | 21 |
| సాక్షాత్తు బ్రహ్మ జరిపించిన ఉత్సవాలు | డా॥ వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు | 22 |
| దివ్యప్రబంధ నీరాజనం | డా॥పి.టి.జి.రంగరామానుజాచార్యులు | 25 |
| ఆధునిక ఆళ్వార్ శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 31 |
| తిరుమలలో 'తులాభారం' | ఆచార్య కె. సర్వోత్తమరావు | 38 |
| పరంధాముడికి పద్యనైవేద్యం | ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు | 40 |
| స్టాంపుల్లో శ్రీవారు | శ్రీమతి పుట్టి నాగలక్ష్మి | 45 |
| వాహనమూ, కేతనమూ రెండూ ఆయనే! | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 47 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| సత్యం ప్రకటించిన దైవం | శ్రీమతి పి.స్వరూప | 51 |
| గరుడవాహనం (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు | 52 |
| | చిత్రాలు : శ్రీ తుంబలిశివాజీ | |
| బాలవినోదం | | 54 |


ముఖచిత్రం : గరుడవాహనంపై శ్రీవారు (తిరుమల)
వెనుక చిత్రం : శ్రీవారి చక్రస్నానం (తిరుమల)


సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ.500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# తిరువీథులమెరసీ దేవదేవుడు...

భారతీయ సనాతనధర్మానికి, సంస్కృతికి దేవాలయాలు ప్రతిరూపాలు. దేవాలయాలను సర్వజనసంక్షేమం కోసం, లోకకల్యాణార్థం నిర్మించారు. భగవంతుణ్ణి భక్తితో ఆరాధించడం మనసంస్కృతి. సమస్తపురుషార్థ సాధనకు, జాతిసమైక్యతకు, ఏకోన్ముఖసాధనకు మనదేవాలయాలు ఎంతో దోహదం చేస్తున్నాయి. ముముక్షువుల భక్తిసాధనకు ఎంతో సహాయపడుతున్నాయి. అందువల్లనే పవిత్రక్షేత్రసందర్శనమాత్రాన్నే భక్తజనులు సంతృప్తు లౌతున్నారు.

బ్రహ్మాండాలన్నింటిలో తిరుమలక్షేత్రానికి సమమైన దివ్యస్థలం లేదు. అలాగే ఆ కొండలలో నెలకొన్న కోనేటి రాయడైన శ్రీవేంకటేశ్వరస్వామివారికి సాటిరాగల దేవుడు అటు గడచిన కాలంలోను, ఇటు రాబోయే కాలం లోను లేడు, ఉండబోడు. ఎన్నో వందలాది దివ్యతీర్థాలతోను, ఎన్నో కొండలతోను కూడి ఉన్న ఈ ఏడు కొండలక్షేత్రం ఎప్పుడూ యాత్రికులతో సందడిగా ఉంటుంది. ఈ క్షేత్రంలో ప్రతిరోజూ పండుగే. ప్రతిపూటా పరమాన్నాలే! దివ్యప్రసాదాలే!!

సుప్రభాతం, సహస్రనామార్చన, నిత్యకల్యాణోత్సవం, డోలోత్సవం, సహస్రదీపాలంకరణసేవ, ఏకాంత సేవవంటి నిత్యోత్సవాలతోను, విశేషపూజ, అష్టదళపాదపద్మారాధన, సహస్రకలశాభిషేకం, తిరుప్పావడ, శుక్రవారాభిషేకంవంటి వారోత్సవాలతోను, పుష్పయాగం, పవిత్రోత్సవం, తెప్పోత్సవాలు, జ్యేష్ఠాభిషేకంవంటి సంవత్సరోత్సవాలతోను శ్రీదేవి, భూదేవి ఇరువురు పత్నులతో కూడి ఉన్న శ్రీనివాసుని వైభవం, వైభోగం మాటల్లో వర్ణించడానికి సాధ్యం కాదు. అయితే వీటన్నిటిలో ఏడాదికి ఒకసారి జరిగే పదినాళ్ల బ్రహ్మోత్సవాలు అత్యంతప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.

బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణతో ప్రారంభమై, ధ్వజావరోహణతో సమాప్తం అయ్యే పదినాళ్లవేడుకలు. ధ్వజారో హణకు ముందుగా తిరుమల ఆలయంలో 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం" అనే పేరుతో తిరుమల ఆలయం అంతటా శుద్ధిచేయబడి, శోభాయమానంగా, నయనానందకరంగా అలంకరింపబడుతుంది.

మొదటిదైన ధ్వజారోహణం రోజున వైఖానసాగమ నియమం ప్రకారం అర్చకస్వాములు గరుడుణ్ణి చిత్రించిన కేతనాన్ని శ్రీవారిఆలయంలోని బంగారుధ్వజస్తంభంపై స్థాపిస్తారు. సమస్తలోకాల్లోని దేవతలనందరినీ ఆహ్వానించడ మనే ధ్వజారోహణకార్యక్రమంతో ప్రారంభింపబడ్డ బ్రహ్మోత్సవాలు తొమ్మిదిరోజులపాటు ఘనంగా జరుగుతాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండుపూటలా ఒక్కొక్క వాహనంమీద శ్రీవారిఊరేగింపులు ఉంటాయి.

పదినాళ్లపండుగల్లో తొలినాడు పెద్దశేషవాహనంతో ప్రారంభమైన శ్రీవారిబ్రహ్మోత్సవాలలో ఐదవనాటిరాత్రి జరిగేగరుడోత్సవం, తొమ్మిదవనాటి ఉదయం జరిగేరథోత్సవం అత్యంతదర్శనీయమై ఉంటాయి. లక్షల సంఖ్యలో కూడి ఉన్న భక్తుల కోలాహలంతో, గోవిందఘోషలతో సప్తగిరిసానువులు మార్మోగుతూ– సాక్షాత్తు వైకుంఠాన్ని దర్శింపజేసే విశేషోత్సవాలుగా చరిత్రలో నిలిచిపోతాయి.

ఈ సంవత్సరం అక్టోబరు 7వ తేదీ మొదలై 15వ తేదీ వరకు శ్రీవారిబ్రహ్మోత్సవాలు ఏకాంతంగా జరుగుతాయి. రోజుకొక వైభవంగా, పూట కొక వైభోగంగా పదినాళ్లపాటు సాగే సప్తగిరీశునిబ్రహ్మోత్సవాల వైభవాన్ని చూచిన భక్తజనసందోహం ఒక విచిత్రమైన ఆనందానుభూతితో, శ్రీవారిఆశీస్సులను సంపూర్తిగా పొందుతారు. విశ్వమూర్తికి జరుగుతున్న ఈ ఉత్సవాలను అందరం కనులార దర్శించుకోవాలి. మనసులోకి మలినమైన ఆలోచనలు రాకుండా చూడాలి. ఇలాంటి పవిత్రఉత్సవాలలో పాల్గొంటే చాలు– జన్మ ధన్యమౌతుంది. పదినాళ్లపాటు జరిగే పరంధామునిపండుగల్లో పవిత్రంగా, త్రికరణశుద్ధిగా పాలుపంచుకుందాం. బ్రతుకును సార్థకం చేసుకుందాం.

# తిరుమల వెంకన్నను దర్శిద్దాం!

*తిరుమల అంటేనే దేవదేవుడైన వేంకటవిభుని దివ్యమంగళ సాలగ్రామరూపం మదిలో దర్శనమిస్తుంది. ఆదిశేషుని కొండపై స్వర్గతుల్యమైన ఆలయప్రాంగణం గుర్తుకొస్తుంది. శ్రీశ్రీనివాసుని దివ్యలీలామానుష మూర్తిమత్వం మనలో భక్తిపారవశ్యతను పాదుకొలుపుతుంది. బ్రహ్మోత్సవాలులాంటి పర్వదినాలప్పుడిక చెప్పనక్కరలేదు. బ్రహ్మాది దేవతలందరూ అక్కడే కొలువుదీరుతారు. దేశం నలుమూలల నుంచీ భక్తులు తండోపతండాలుగా వచ్చి, తమ ఇలువేల్పును సేవించుకుంటారు. శేషాచలశిఖరాలన్నీ గోవిందనామ స్మరణతో మార్మోగుతుంటాయి. 'ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా గోవింద! అని భక్తులు స్వామిని తలచుకుంటూ చేసే యాత్రామాలిక ఈ వ్యాసం.*

అదిగో ఎత్తయిన గోపురం. శ్రీవారిఆలయానికి మహాద్వారం తొలిమెట్టు. దీన్ని **పడికావలి గోపురం** అని కూడా అంటారు. క్యూలైన్ ద్వారా లోపలికి అడుగు పెడితే ద్వారానికి ఇరువైపులా ఇద్దరు (చిన్ని మూర్తులు) కావలి ఉంటారు. ఎడమవైపున విగ్రహాన్ని **శంఖనిధి** అంటారు. కుడివైపున విగ్రహాన్ని **పద్మనిధి** అని పిలుస్తారు. మహాద్వారానికి కుడివైపున పదిలపరచబడ్డ **ఆనంతాళ్వారు పలుగు** పరిశీలించవచ్చు.

గోపురంలోనికి ప్రవేశిస్తే వచ్చేదే **ప్రతిమామండపం.** కుడివైపున అటునిటు తన దేవేరులైన **తిరుమలదేవితో, చిన్నాదేవి**తో కూడిన **శ్రీకృష్ణదేవరాయల** తామ్రవిగ్రహాలు ఇక్కడ ప్రతిష్ఠించబడ్డాయి. మనకు ఎడమవైపు ద్వారానికి ఆనుకొని ఉన్న లోహవిగ్రహం వెంకట పతిరాయలది. ఈయనకు దక్షిణంగా ఉన్న శిలామూర్తులు **అచ్యుత దేవరాయలు** ఆయన పట్టపురాణి **వరదాజీ అమ్మవి.** అన్న కృష్ణదేవరాయల వలెనే ఈయనకూడా శ్రీస్వామివారి మహాభక్తుడు. వీరందరివిగ్రహాలు ఈ మండపంలో కొలువై ఉన్నందున దీనికి ప్రతిమా మండపంగా పేరు. కొందరు కృష్ణరాయమండపం అనీ పిలుస్తారు.

ఈ ప్రతిమామండపానికి ఎడమవైపున్న శిలాశిల్పనిర్మాణం- **రంగనాయక మండపం.** ఈ మండపాన్ని ఆనుకుని ఉన్న సమున్నత శిలాస్తంభాల ఆవరణం- **తిరుమలరాయమండపం.**

తిరుమలరాయలు, ఆయనరాణి వెంగళాంబచిత్రాలు ఈ స్తంభాలమీద చెక్కి ఉండడం గమనించవచ్చు. ఆరవీటి రామరాయలు శ్రీకృష్ణదేవ రాయల పెద్దఅల్లుడు. 1565లో జరిగిన తళ్లికోటయుద్ధంలో మరణించాడు. ఆయనతమ్ముడైన తిరుమలరాయలు



– శ్రీ బి.వి.రమణ,
97045 67641

అన్న తదనంతరం రాజ్యాని కొచ్చాడు. రాజధానిని హంపీ నుంచి పెనుగొండకు, అక్కడినుంచి చంద్రగిరికి మార్చి, దేవునికి ఈ మండపసేవ చేయగలిగాడు. ఈ మండపంలో దూరి మెట్లెక్కి పైకిపోతే అది శ్రీవారిపాత **ఊంజలి మండపం.** ఈ మండపాన్ని జీర్ణోద్ధరణం చేసి, దానిని కలుపుకుంటూ తిరుమలరాయలు ఈ మహోన్నతమండపాన్ని నిర్మించాడు. 1561 సం॥ డిసెంబర్ 15నాడు డోలోత్సవనైవేద్యానికి ఏర్పాటు చేశాడు.

ఈ మండపం వాయవ్యమూలన ఒక తిన్నెమీద లాలా ఖమరాం (రాజాతోదరమల్) మాతామోహనాదీ, పితాబీబీల





కుటుంబవిగ్రహాలు కన్పిస్తాయి. దేవునికి మ్రొక్కుతూ నమ్రతగా నిలబడి ఉన్న ఈ విగ్రహాలమీద వారిపేర్లు ఉన్నాయి.

వీటికి ఆనుకొని ఉండేది **ధ్వజస్తంభమండపం.** దాని ముందు ఉండేది **బలిపీఠం.** ధ్వజస్తంభం, బలిపీఠం రెంటికీ బంగారుపూత పూయబడి ఉంది. ఈశాన్యమూలలోని స్తంభానికి ఆనించి ఉన్న శిలను **క్షేత్రపాలకుడు** అంటారు. ఈ మొత్తం ప్రాకారఅంతర్భాగాన్ని **సంపంగిప్రదక్షిణం**గా పిలుస్తారు. పూర్వం ఈ ప్రదక్షిణమార్గంలో సంపెంగవృక్షాలు మిక్కుటం. వాటిల్ని తొలగించి, మహాద్వారప్రాకారం నిర్మించబడింది.



వెండివాకిలికి, మహాద్వారానికి మధ్యగల ప్రదక్షిణ మార్గమే సంపంగిప్రదక్షిణం. వెండిరేకులు తాపడం చేయడం వల్ల వెండివాకిలికి ఆ పేరు వచ్చింది. ఇది శ్రీవారి రెండవగోపుర ద్వారం. ఎడమవైపుద్వారం తలుపుమీద ఒక చక్కటిచిత్రం ఉంది. హాథీరాంబావాజీ శ్రీస్వామివారితో పాచికలాడుతున్న దృశ్యం.



ఆ తర్వాత భక్తులు విమానప్రదక్షిణంలోకి ప్రవేశిస్తారు. ఇది రెండో ప్రాకారం. ఎదురుగా కిటికీలాంటి ఒక జాలీకి **శ్రీరంగనాథస్వామి**లోహావిగ్రహాన్ని గోపురసహితంగా పొందుపరిచారు. అంటే శ్రీరంగంక్షేత్రంకూడ ఇక్కడకు విచ్చేసినట్లే! అలాగే ఎడమవైపు చిన్న గుడిలో **వరదరాజస్వామి**ని, కుడివైపు వరండాతిన్నెల మీద **యోగనరసింహస్వామి**ని ప్రతిష్ఠించడం వల్ల అటు కాంచీపురం (విష్ణుకంచి) ఇటు అహోబిలనారసింహక్షేత్రం కూడ ఇక్కడ ప్రత్యక్షమైనట్లే!



క్యూలైన్లో అలానే కొంచెం ముందుకు సాగితే **మహా మణిమండపం** చేరుకుంటాం. దానికి ఘంటామండపం అని కూడా పేరు. దీన్ని మల్లనమంత్రి అని పిలువబడే చంద్రగిరి మాధవదాసర్ ముక్కోటిప్రదక్షిణంతో బాటు నిర్మించాడు. ఇది పదహారుస్తంభాల మండపం. ఇందులో శ్రీవారివాహనమైన గరుత్మంతుడికి ఒక చిన్నగుడి స్వామి కెదురుగా ఇమిడి ఉంది.



బంగారు వాకిలికి ఈ మండపంనుండే ప్రవేశం. ద్వారానికి ఇరుప్రక్కల **జయవిజయులు** అనే ద్వారపాలకులు కానవస్తారు. **గుడిగంటలు** ఇక్కడ వేలాడదీయబడి ఉంటాయి.




అంతేకాదు శ్రీవారిహుండీకూడా ఈ ఆవరణలోనే ఏర్పాటై ఉంది. ఇక్కడినుంచే యాత్రీకులు దేవుడిదర్శనం చేసుకుంటారు. ఇది **మహాలఘుదర్శనం.** ఇంకో మండపం (స్నపనమండపం) దాటిపోయి దర్శనం చేసుకుంటే **లఘుదర్శనం.** ఇంకా ఒక మండపం (శయనమండపం) దాటి స్వామివారిని దర్శించుకుంటే అది మామూలు దర్శనం. స్వామికి, మనకు మధ్యలో **కులశేఖరపడి.**



ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా! గోవింద! గర్భాలయంలో మూలమూర్తికి కుడివైపు సముచిత స్థానంలో ఉత్సవమూర్తి **శ్రీమలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి** సమేతుడై దర్శనమిస్తారు. ఎడమవైపు **హనుమంత సమేత సీతారామ లక్ష్మణులు** ఒక పీఠం మీద కొలువై కనిపిస్తారు. స్వామికి చేరువగా **భోగశ్రీనివాసమూర్తి,** ఆయన ప్రక్కన **కొలువు శ్రీనివాసమూర్తి,** కొద్దిదూరంలో **ఉగ్రశ్రీనివాసమూర్తి** కనువిందు చేస్తారు. అక్కడే **రుక్మిణీ సమేత నవనీతకృష్ణుడు, చక్రత్తాళ్వార్, విష్వక్సేనులవారు** వేంచేసి ఉంటారు. మూలబేరం సన్నిధిన కొన్ని సాలగ్రామాలు కూడా ఉన్నాయి. సాలగ్రామాలకి, భోగ శ్రీనివాసమూర్తికి నిత్యాభిషేకం జరుగుతుంది.

స్నపనమండపం శయనమండపానికి మధ్యలో **రామార్ మేడై** ఉంది. ఒకప్పుడు అది రాములవారి స్థానం. తరువాత పరివారదేవతలతో ఆ స్థానాన్ని పూరించారు. ఇప్పుడు ఖాళీ తిన్నెలు దర్శనమిస్తాయి. తీర్థం, శఠారి తీసుకోవడానికి వెళుతూ ఎడమవైపు చూస్తే వరదరాజస్వామి దర్శనం.



దణ్ణం పెట్టుకొని కుడివైపు చూస్తే స్వర్ణతాపడపు **బంగారు బావి.** ఒకప్పుడు శ్రీవారి అవసరాలకు ఈ బావి నీరు వాడేవారు. మెట్లెక్కి- ఎడమవైపు లోపలకు పోతే **వకుళమాత** దర్శనం అవుతుంది.




మనం కుడివైపు వసారా ముందుకు సాగితే ఇక్కడ స్వామివారి తీర్థం లభిస్తుంది. అలాగే తలమీద శఠారి కూడ పెడతారు. శఠారి అనేది నమ్మాళ్వారుకు సంకేతం. ఆ ఆళ్వారు పేరుమీద అన్ని వైష్ణవా లయాలలో శఠారులుంటాయి. రాగి లేదా బంగారు తాపడం కలిగిన కిరీటం లాంటి వీటి శిఖరం మీద స్వామి పాదాలుంటాయి. అంటే స్వామి పాదాలు మన తలమీద పెట్టి ఆశీర్వదించడమన్న మాట.

తీర్థం, శఠారి ప్రదానం చేస్తున్న అర్చకుల వెనుకవున్న పరివారదేవతల విగ్రహాలు చూస్తే- చేతులు జోడించి దణ్ణం పెడుతున్న పెద్ద విగ్రహమూర్తి **సుగ్రీవుడు.** చేయి పైకెత్తి నాట్యభంగిమలో తన్మయత్వం పొందినట్టున్న విగ్రహం **అంగదుడు.** నోటికడ్డంగా చేయిపెట్టుకొని వినయంగా నిలుచున్నట్లుండేది **ఆంజనేయస్వామి.** వీరు కాక **ఆదిశేషుడు, విష్వక్సేనుడు, గరుడాళ్వారు** కూడా ఉన్నారు. అవసరాన్ని బట్టి వీరు ఆలయంలోకి పోతూ వస్తూ ఉంటారు. ఈ ఎడమవైపు తాళం వేసి ఉన్న గది స్వామివారికి చెందిన కొన్ని వస్తువులు భద్రపరిచేందుకు ఉద్దేశించింది.


వరండామండపంలోనే పైకి దారితీస్తే ముందున్నది **యాగశాల.** వెనుక పాత **కల్యాణమండపం.** నైఋతి మూల నుంచి వాయువ్యమూల వరకు పశ్చిమ వసారా. దీని లోపల తి.తి.దే. ఉద్యోగులు, భక్తులు **పరకామణి** పనిలో ఉంటారు. పరకామణి ప్రదేశం అంటే శ్రీవారిహుండీ రోజుకు రెండుసార్లు విప్పి యాత్రికులు వేసిన కానుకలను లెక్కించే ఆవరణం.

ఒకసారి అలా తలపైకెత్తి చూస్తే ధగధగాయమానంగా బంగరు కాంతులతో వెలుగులీనే ఆనందనిలయవిమానం. 13వ శతాబ్దంనాటి యాదవరాజుల కాలంనుంచీ పసిడి తళుకులొత్తుకుంది. తొలుత వీరనరసింగదేవ యాదవరాయలు, తదుపరి సాళువ మంగిదేవుడు, ఆ తరువాత మల్లన మంత్రి అనే చంద్రగిరి మాధవదాసర్, శ్రీకృష్ణ దేవరాయలు, కోటి కన్యాదానం తాతాచార్యులు, అధికారి రామలక్కదాస్,



తరువాత రెండుసార్లు తిరుమల తిరుపతి దేవస్థానాలవారిచేత ఇలా వరుసగా ఎనిమిదిసార్లు ఈ ఆనందనిలయ విమానం బంగారుమలాము అద్దుకుంది. ఈ ఆనందనిలయంలోనే శ్రీమహావిష్ణునివాసం. అంటే శ్రీహరినివాసం.

విమానమధ్యభాగంలో దక్షిణముఖంగా వరాహస్వామి, పశ్చిమముఖంగా నరసింహస్వామి, ఉత్తరదిక్కున వైకుంఠమూర్తి, తూర్పున అర్చావతారమూర్తి వెలసి ఉన్నారు. మనం విమానప్రదక్షిణమార్గం పట్టి దక్షిణ, పశ్చిమదిక్కులు పూర్తి చేశాం. ఈ మూల ఉన్నది **చందనపుఅర.** ఇక్కడ శ్రీవారి పూజాపురస్కారాలకు అవసరమైన శ్రీగంధం నూరుతుంటారు. అక్కడినుంచి దిగువకు వచ్చి, వరండా మెట్లపైకెక్కి ఆనంద నిలయవిమానంవైపు చూస్తే, తెల్లని వెండితోరణం నడుమ **విమానవేంకటేశ్వరస్వామి** దర్శనమిస్తారు (బాణం గుర్తు చూడండి).




ఏ కారణం చేతనైనా ఆలయంలో మూలమూర్తి దర్శనం కానివారు, దర్శనం చేయరానివారు ఈ విమాన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అంతే ఫలితం ఉంటుంది. వ్యాసతీర్థులువారు ఈ స్వామి ముందు కూర్చుని ఒక పుష్కర కాలం తపస్సు చేశారట. అందువల్ల ఇప్పటికీ మధ్వమతస్థులు కొందరు ఇక్కడ జప, పఠనాదులు కొనసాగిస్తుంటారు. ఈస్వామి కనబడేటట్టు శ్రీరంగనాథయాదవరాయలు ఉత్తరమాడవీథిలో తన అంతఃపురాన్ని నిర్మించుకున్నాడు.

ఇంకొంచెం ముందుకెళితే ఎడమవైపు (వరండాలోనే) ఉన్న గది **సబేరాగది.** ఒకప్పుడు దీన్ని కైకాలవారు, గమేకార్లు, వగపడివాళ్లు వాడేవారు. స్వామివారికి నిత్యం అవసరమైన వస్త్రాలు, పూజాద్రవ్యాలు, దినుసులు వగైరా ఇక్కడ భద్రపరుస్తారు. దీనికి దిగువ వరండాను మూసివేస్తూ కొంచెం ముందుకు పొడుచుకు వచ్చినట్లున్న నిర్మాణం **తాళ్లపాకవారిఅర** లేదా **సంకీర్తనభాండాగారం.** తాళ్లపాకకవులకీర్తనలన్నీ తామ్రపత్రాల మీద లిఖించి ఇందులో నిక్షిప్తంచేశారు.




దీని కెదురుగా మహామణిమండపపార్శ్వంలో యాత్రికులు కానుకలు చెల్లించడానికి క్యూ కడతారు. అది **కొప్పెర.** శ్రీవారిహుండీ! తమమ్రొక్కుబడులు ఇందులో చెల్లిస్తారు. ఆంగ్లేయులు ఈ హుండీ పద్ధతికి క్రీ.శ. 1821 సం॥లో శ్రీకారం చుట్టారు.

తాళ్లపాకంవారి కొట్టుప్రక్కన మెట్లెక్కి పైకి పోతే **భగవద్రామానుజులవారి సన్నిధి.** శ్రీవారి అనుమతితో అనంతాళ్వారు



క్రీ.శ.1137లో ప్రతిష్ఠించిన విగ్రహం. ఉత్సవ విగ్రహంకూడ ఉంది. ఆలయంలో రామానుజుల వారికి కొన్ని మర్యాదలున్నాయి. ఈ ఉపాలయాన్ని ఆనుకొని ఉన్న చిన్నగదిలో (సభ అర) శ్రీవారి పవళింపుసేవకు వినియోగించే వస్తువు లున్నాయి. రాత్రి ఏకాంతసేవ సమయంలో వీటిని తీసుకు పోయి సుప్రభాతం ముగియగానే తీసుకొని వచ్చి ఇక్కడ చేరుస్తారు. దీని ప్రక్కనున్న గది **యామునోత్తరి.** శ్రీవారివినియోగానికి పూలమాలలు ఈ ఏ.సి. గదిలో భద్రపరచి తోమాలసేవ సమయంలో ఉపయోగిస్తారు.

ఈ కుడిప్రక్కన ఉన్న మందిరం **యోగ నరసింహస్వామి సన్నిధి** అని ఇదివరకే చెప్పు కున్నాం. స్వామికి నమస్కరించి, చుట్టు తిరిగి అటు వైపుకు వస్తే గుండ్రని **సనికల రాయి** కనిపి స్తుంది. శ్రీవారిశుక్రవార అభిషేకానికి వాడే సుగంధద్రవ్యాలను నూరే రాయి ఇది. చేయి పెట్టి





వాసనచూస్తే పరిమళం వాసన. దీనిని కొందరు **పరిమళంగది** అంటారు. ఈ తిన్నెమీద కూర్చుని ఆఖరుసారిగ ఆనంద నిలయ విమానాన్ని వీక్షిద్దాం. ఇది తూర్పు ముఖం. స్వామికూడ తూర్పుముఖంగానే ఉంటారు. ఆలయగర్భ గుడిగోడ ముగిసిన చోట **శ్రీలక్ష్మీదేవి** విగ్రహం బంగారు తాపడంతో తళా తళా మెరుస్తూంటుంది. అందరూ అమ్మవారిని చేతితో తాకి కళ్లకద్దుకుంటారు.

ఆ ప్రక్కనున్న దారి ముక్కోటిప్రదక్షిణం చేయడానికి వైకుంఠ ఏకాదశినాడు తెరుస్తారు. అప్పుడు అక్కడ ఒక మూలఉన్న **విష్వక్సేనుల**వారిని దర్శించవచ్చు. మామూలు సమయాలలో అక్కడికి పోలేం. మనకోరికలు ఆయనకు చెపితే ఆయన శ్రీవారికి నివేదిస్తాడట!

ఇక వెండివాకిలినుంచి బయటకు వస్తే యాత్రికులకు ప్రసాద వినియోగం చేసే చోటు. ఈ ముందున్నది **పడిపోటు.** భారీఎత్తున లడ్లు, ఇతరప్రసాదాలు ఇక్కడ తయారవుతాయి. ఇక్కడ ఎత్తయిన నాలుగుకాళ్ల మండపం ఉంది. ఇవి నాలుగుమూలలా నాలుగు ఉన్నాయి. వీటిని సాళువ నరసింహరాయలు 15వ శతాబ్దంలో నిర్మించాడు. ఇక్కడ వెల్డింగ్‌మెష్‌తో



మూసివేసినబావిని **పూలబావి** అంటారు. ఒకప్పుడు ఇది దిగుడుబావి. శ్రీవారికి వాడిన పూమాలలు ఇందులో వేసేవారు. అందువల్ల ఆ పేరు వచ్చింది. బావిచెంపమీద భూదేవి తాయారు బొమ్మ చెక్కబడి ఉంది.




ఈ బావికి దక్షిణంగా ఉన్న పెద్దమండపం **ఐనా మహల్** అంటే అద్దాలమేడ. అద్దాల మెరుపుల మధ్య మలయప్ప స్వామికి ఉయ్యాలసేవ జరుగుతుంది. అమ్మవార్లు శ్రీదేవీ, భూదేవులు కూర్చుని ఆ సేవను ఆస్వాదిస్తారు.

ప్రసాదం స్వీకరించి, కొళాయిల దగ్గర చేతులు కడుక్కుంటూ ఎడమవైపు చూచామంటే ఆలయఈశాన్యమూలలో చివరగా ఓ గది కనబడుతుంది. ఇది ఒకప్పటి **యామునోత్తరి.** ఈ పూమాలల గదికి తిరుమలనంబి తాత, గురువు యామునాచార్యుల పుష్పకైంకర్యానికి గుర్తుగా ఈ పేరుపెట్టారు. ఇక్కడ నుంచి దక్షిణదిక్కుగా నడిచి ఎడమవైపుకు తిరిగితే తిరిగి పడికావలి గోపురం గుండా బయటకు వస్తాం. ఇంతటితో భక్తుల అలిపిరి నుంచి ఆనందనిలయయాత్ర సంపూర్ణం.


## బ్రహ్మకడిగిన పాదము...

గంగాదేవి దేవతామూర్తిగా హిమవంతుని పెద్ద కుమార్తె. ఆమెను బ్రహ్మదేవుడు దత్తపుత్రికగా స్వీకరించి, బ్రహ్మ (సత్య) లోకంలో శివుని కిచ్చి వివాహం చేశాడు. శివుని వెంట వెళుతున్న గంగను చూచి, బ్రహ్మదేవుడు పుత్రికావాత్సల్యంతో దుఃఖించాడు. అతణ్ణి ఓదార్చిన గంగ జలరూపంలో బ్రహ్మకమండలంలో ఉంటా నని చెప్పి, వనితారూపంతో శివునివెంట వెళ్లింది.

కొంతకాలానికి శ్రీమన్నారాయణుడు వామనుడుగా అవతరించాడు. బలినుండి మూడడుగుల నేలను దాన మడిగి, ముల్లోకాలను ఆక్రమిస్తూ, ఒక పాదంతో సత్యలోకాన్ని ఆక్రమించాడు. అప్పుడు బ్రహ్మదేవుడు ఆ శ్రీహరిపాదాన్ని చూచి, భక్తిపారవశ్యంతో, తన కమండలాంతర్గత గంగాజలంతో కడిగాడు.

పరమపావన విష్ణుపాదాన్ని చేరిన గంగ, అక్కడే సుస్థిరంగా ఉండిపోయింది. అలా విష్ణుపాదాన ఒదిగిన గంగనే భగీరథుడు తపస్సుతో రప్పించాడు. ఆ విధంగా గంగ 'విష్ణుపాదోద్భవ' అయ్యింది. 'బ్రహ్మ కడిగిన పాదము' అనే వాక్యం వెనుకనున్న పురాణ కథ ఇది.

ఈ కథను స్మరింపజేస్తూ, వామనావతార వృత్తాంతాన్ని తెలియజేస్తూ...



"చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలి తల మోపిన పాదము"

- అనే చరణాల మాటలతో స్పష్టపరచాడు అన్నమయ్య. పల్లవిలోని మొదటివాక్యం "బ్రహ్మ కడిగిన పాదము" తొలి చరణంలోని పై రెండు వాక్యాలు కలిపి త్రివిక్రముని త్రిపాదా లనీ తెలియజేస్తున్నాయి. అంతేగాక శ్రీవేంకటేశ్వరునికి తొలిసారిగా ఉత్సవాలు జరిపి పూజించిన వాడు బ్రహ్మదేవుడే.

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

# అమ్మలగన్నయమ్మ

- శ్రీమతి కె. అరుణావ్యాస్, 91009 87767

శివుడూ, శక్తీ- చంద్రుడూ, చంద్రికలాగా ఉన్నారు. శివుడూ శక్తీ కలిసినపుడు శివుడు సదాశివుడై శక్తి మహోన్మణి అవుతోంది. నెమ్మదిగా ఈశ్వరతత్త్వం మొదలౌతుంది. అప్పుడు శక్తి మాయాశక్తి అవుతుంది. అది పృథ్వీతత్త్వానికి దారితీసినపుడు మనసూ, ఇంద్రియాలూ, భౌతికప్రపంచమూ ఏర్పడతాయి.

శంకరభగవత్పాదులు పంచాయతనాలలో దేవీపూజ ప్రముఖంగా చెప్పారు. ఆయన దేవిని సాక్షాత్తు బ్రహ్మస్వరూపమే అంటారు. బ్రహ్మ, ఇంద్రుడూ మొదలగువారు లయం చెందినా ఈశ్వరుడు 'విగతజీవుడు' కాకపోవటానికి కారణం ఆవిడ చెవులకున్న తాటంక మహిమేనట!

'శ'కారం అంటే సుఖం, ఆనందం. 'ఇ' అంటే ప్రకృతిని గలవాడు పురుషుడు. "శక్తి" పదం స్త్రీ దేవతాసంకేతం. అంటే ఆనందప్రకృతిని గల పురుషుడని అర్థం. "శ్+ఇ=శి"+వ చేరి శివ శక్తులకు ప్రతీక అయ్యింది. 'వ' అమృతబీజం.

'దివ్' ధాతువు భావార్థ విశేషం "దివ్యం", దివ్యత్వ స్వరూపం దేవి. దేదీప్యమానంగా వెలిగేది, 'అవిద్యా' రూపం ప్రకృతి. బాహ్యరూపం మాయారూపం. సంసారాన్ని కలిగిస్తుంది. 'విద్య' శక్తిస్వరూపం. అంతర రూపం. బ్రహ్మజ్ఞానం కలిగిస్తుంది. వాక్ శక్తి స్తుతి, స్తుతి స్తోత్రం. కాంతి లక్షణం వాక్కు. కాంతి స్తుతి. స్తుతి దేవి.

ఓంకార రూపం అ+ఉ+అ(మ్)' శివశక్తిరూపం. ఓం లో "ఉమ" ఉంది. హరి, హర, బ్రహ్మస్వరూపం దేవి స్వరూపమే. మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి ఆమే! సత్త్వ, రజ, స్తమోగుణాలూ ఆమే. తేజస్సులలో అగ్ని, వాయువు, సూర్యుడు, రంగులలో ఎరుపూ, తెలుపూ, నలుపూ, అవస్థలలో జాగృత్, స్వప్న, సుషుప్తి, లోకాలలో భూమి, అంతరిక్షమూ, స్వర్గమూ, వేదస్వరాలలో ఉదాత్త, అనుదాత్త, స్వరితలూ, వేదాలు- ఋక్, యజుస్, సామలూ, అగ్నులు- గార్హపత్య, ఆహవనీయ, దాక్షిణలూ, కాలాలు- ప్రాతః, మధ్యాహ్న, అప రాహ్ణ కాలాలు. ఇవన్నీ ఆమే!

ప్రతి కార్యానికి, నిమిత్తమూ, ఉపాదానమూ అని రెండు కారణాలుంటాయి. ఈ జగత్తుకు నిమిత్తమూ, ఉపాదానమూ ఒకటే. అది దేవియే. ఆవిడ "పుష్టీ, తుష్టీ" కూడా!

ఈ లోకంలోని ఇంద్రియసుఖాలూ, స్వర్గాది దివ్య సుఖాలు కలిపినా తుష్టి కల్పించే ఆనందంలో పదహారవవంతు కూడా కల్పించవు. అలాంటి తుష్టి ఆవిడ. మనస్సు ఎలాంటి కల్లోలం లేకుండా ప్రశాంతంగా ప్రవహించే శాంతి ఆవిడ.

సురథు డనే రాజు రాజ్యభ్రష్టుడై అరణ్యంలో సుమేథ సుడనే ముని దగ్గర దేవీమాహాత్మ్యం వింటాడు. ధనవంతుడైన సమాధి అనే వైశ్యుణ్ణి భార్యాబిడ్డలు ధనలోభం చేత తరిమేస్తారు. అతనూ అడవికి వస్తాడు. దారీతెన్నూ కానక అశాంతితో గిలగిలలాడే వారికి మునులూ, ఋషులూ ఇలాంటి కథలు చెప్పి Psychological counselling ఇచ్చేవారు. ఆ విధంగా ఆ రాజులలో ఆత్మవిశ్వాసం, ధైర్యం నూరిపోసేవారు. తర్వాత ఉమ్మడికుటుంబాలలో పెద్దలే Counsellors అయ్యారు. "పెద్దలమాట చద్దిఅన్నం మూట" అనే సామెత ఊరకే పుట్ట లేదు. దేవి ఆవిర్భావం ఎలా అయ్యిందో చెప్తాడు.

మహిషుడు దేవతలతో యుద్ధం చేసి వారందరినీ, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కూడా ఓడిస్తాడు. అప్పుడు జగన్మాతలోనిశక్తులే దేవతలలోని శక్తులుగా బయటపడ్డాయి. ఒక్కొక్క దేవతా ఒక్కొక్క శక్తి నిచ్చారు.

శివుడు త్రిశూలం నుంచి శూలం ఆమెకు ఇచ్చాడు. విష్ణువు సుదర్శనచక్రం నుండి చక్రం తీసి ఇచ్చాడు. అది వెయ్యి అంచులతో ఉంది. వరుణుడు శంఖాన్నిచ్చాడు.

'అగ్ని శక్తి అనే ఆయుధం ఇచ్చాడు. వాయువు బాణాలతో నిండిన రెండు అమ్ములపొదులనీ, ధనుస్సునీ ఇచ్చాడు. ఇంద్రుడు వజ్రాయుధం నుంచి వజ్రం తీసి ఇచ్చాడు. ఐరావతంనుంచి ఘంటను ఇచ్చాడు. యముడు కాలదండం నుంచి దండం ఇచ్చాడు. వరుణుడు పాశం ఇచ్చాడు. దక్షాది ప్రజాపతులలో ఒకడు అక్షమాల ఇచ్చాడు. బ్రహ్మ కమండలం

ఇచ్చాడు. సూర్యుడు తన కాంతికిరణాలు ఇచ్చాడు. అంటే 32కోట్ల కిరణాలు ఇచ్చాడు. మృత్యుదేవత ఖడ్గాన్నీ, డాలునూ ఇచ్చాడు.

క్షీరసముద్రుడు ఎర్రని ఎరుపురంగువస్త్రాలను ఇచ్చాడు. హారాన్ని ఇచ్చాడు. కోటిసూర్యుల కాంతిగల చూడామణినీ, కుండలాలనూ, గాజులను, నిర్మలమైన అర్ధచంద్రమనే శిరోభూష ణాన్నీ, అన్ని చేతులకు భుజకీర్తులనూ ఇచ్చాడు. విశ్వకర్మ నానారత్న విభూషితాలైన కేయూరకంకణాలు ఇచ్చాడు. త్వష్ట సుస్వరంగా, సుమధురంగా ధ్వనించే గజ్జెలను ఇచ్చాడు. మహా సముద్రుడు కంఠాభరణాన్నీ, ఉంగరాలనూ ఇచ్చాడు. విశ్వకర్మ గండ్రగొడ్డలినీ, అనేకఅస్త్రాలనూ, కవచాన్నికూడా ఇచ్చాడు. వరుణుడు వాడని పద్మాలతో కూడిన వైజయంతీమాలను, ఒకటి తలపైకి, ఒక సుందరమైనపద్మం చేతిలోకి ఇచ్చాడు.

హిమవంతుడు వివిధరత్నాలను, బంగారుకాంతులీను తున్న సింహాసనాన్ని ఇచ్చాడు. కుబేరుడు సుధాపాత్రఇచ్చాడు. శేషుడుమణులతో కూడిన "నాగహారాన్ని" ఇచ్చాడు.



ఆవిడ చాలాసార్లు అట్టహాసంగా, భీకరంగా నాదం చేసింది. ఆకాశంనుంచి ఆ అద్భుతనాదానికి ప్రతిధ్వని కలి గింది. సమస్తభువనాలూ కంపించాయి. సముద్రాలు అల్ల కల్లోలమయ్యాయి. ఒక భారతీయ మేధావి ఇలా వ్యాఖ్యానిం చారు. "చిన్నచిన్నరాక్షసులను చంపవలసినప్పుడు శివుణ్ణి, విష్ణువును ప్రార్థిస్తారు. పెద్దపెద్ద రాక్షసులను చంపవలసినప్పుడు దేవీసహాయం కావలసివస్తోంది. ఈ లెక్కన Indian Defence స్త్రీలపరం అవుతుందేమో భావిలో" అని.

మహిషాసురుడికీ, దేవికీ యుద్ధం మొదలైంది. ఇరువైపులా ఇద్దరూ అనేకఅస్త్రాలు, శస్త్రాలూ ఉపయోగించు కున్నారు. కంటికి కనబడే లక్ష్యం ఛేదించేది శస్త్రం. gun వంటిది. కంటికి కనపడని లక్ష్యాన్ని ఛేదించేది అస్త్రం క్షిపణి వంటిది. మహిషాసురుని సేనానాయకుడు చిక్షురుడు, చతురంగబలాలతో యుద్ధం చేశాడు. చతురంగబలాలంటే రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతులతో కూడినసైన్యం. తర్వాత చాలామంది రాక్షసులు కొన్నికోట్లరథాలతో, లక్షల కాల్బలంతో, వేలాదిఏనుగులతో యుద్ధం చేశారు. బిడాలుడు అనే రాక్షసుడు 500 కోట్ల రథాలతో యుద్ధం చేశాడు. ఇంత సైన్యం సాధ్యమా అని మనం ఆశ్చర్యపడనక్కర లేదు. ఇది అనంతమైన విశ్వంలో జరిగిన మహా సంగ్రామం. మన భౌతికమైన కొలతలూ, లెక్కలూ పనికిరావు.

ఆ రాక్షసులు, "తోమరము", "భిన్దిపాలము", "శక్తి", "ముసలము", "ఖడ్గము", "పరశువు", "పట్టిసము" అనే ఆయుధాలతో యుద్ధం చేశారు. దూరంగా ఉన్న రాక్షసులు ఆయుధాలు విసిరారు. దీన్ని "ప్రక్షేపము" అంటారు. దగ్గరగా ఉన్న రాక్షసులు దేవిని ఆయుధాలతో హింసించడానికి సిద్ధ పడ్డారు. దీన్ని ప్రహారము అంటారు. దేవి తనశస్త్రఅస్త్రాలతో వాటిల్ని ఛేదించింది. "కనకదుర్గా చండసింహం జూలు విదిల్చి" భీకరంగా సమరాంగ ణాన ఉరికింది. దొరికిన రాక్షసులను మట్టుబెట్టింది. మహిషుడు పులిలాగా, ఖడ్గమృగంలాగా, పందిలాగా, సింహంలాగా, పురుషుడిలాగా, ఏనుగులాగా, రకరకాల రూపాలు ధరించాడు. దేవి ఎగిరి ఆ రాక్షసుడిపైకి ఉరికి, వాడిని పాదంతో తొక్కిపట్టి కంఠంలో శూలంతో గుచ్చింది. తన చేతిలోని కత్తితో వాడి శిరస్సును నరికివేసింది.

అన్ని ప్రాణులయందు దేవి తల్లిరూపంలో ఉంది. నన్నయ్యగారు "శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో" అంటూ తన కావ్యారంభాన్ని ముగురమ్మల పేరున మొదలు పెట్టారు. తిక్కన గారు "శ్రీయన గౌరినాఁబరగు చెల్వకుఁ జిత్తము పల్లవింప" అని శ్రీకీ, గౌరికీ సారూప్యం చూపించారు. తన కావ్యారంభంలో ఎఱ్ఱాప్రెగడ లక్ష్మీదేవినీ, భారతీదేవినీ ప్రార్థించారు. శ్రీనాథుడు కాళికారామ కల్పవృక్షములనీడ కుడపవేళ నాకొన్నవారి కమృత దివ్యాన్నమిడు విశాలాక్షి గౌరి"ని భజించాడు. "మొలక చందురు దాలుచు ముద్దరాలు" భారతీదేవిని స్తుతించాడు. "యమ్మహాదేవి కామాక్షి, యఖిలవంద్య దేవతాదిమశక్తి సందీప్త మూర్తి" కామాక్షిని ప్రార్థించాడు. బమ్మెరపోతన "అంబ న వాంబుజోజ్వల కరాంబుజ శారదచంద్రచంద్రికాడంబర చారు మూర్తి" అని భారతిని కీర్తించాడు.

**"అమ్మలగన్నయమ్మ ముగురమ్మలమూలపుటమ్మ చాలఁబె ద్దమ్మ సురారులమ్మకడుపాఱడిఁ బుచ్చిన యమ్మ తన్నులో నమ్మినవేల్పుటమ్మలమనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా యమ్మ కృపాబ్ధియావుత మహత్త్వ, కవిత్వ పటుత్వ సంపదల్"**

శుంభ నిశుంభులను మట్టుపెట్టడానికి దేవి పూను కుంటుంది. అతని అనుచరులు చండముండులను వధించి చాముండ అవుతుంది. దేవి, రాక్షస సేనాపతి ధూమ్రలోచనుణ్ణి భస్మం చేస్తుంది. దేవీ తేజస్సు అనేకవిధాలుగా వస్తుంది. విష్ణువు తేజస్సు "వైష్ణవి" గరుత్మంతుడి పైన శంఖం, చక్రం, గదా, శార్‌ఙ్గం, ధనుస్సు, ఖడ్గం చేతబట్టి వచ్చింది. "వారాహి" సాటిలేని యజ్ఞరూపమైన వరాహరూపం ధరించింది. నృసింహ రూపం దాల్చిన "నారసింహి" జూలు విదిలిస్తే నక్షత్రసము దాయం చెల్లాచెదురైపోతుంది. బ్రహ్మతేజం "బ్రాహ్మణి", అక్ష సూత్రం, కమండలువు, హంసలతో వచ్చింది. మహేశ్వరునిశక్తి "మాహేశ్వరి" త్రిశూలం ధరించి, శేష, వాసుకి, తక్షకులను కంకణాలుగా ధరించి, చంద్రరేఖను తలలో ధరించింది. కుమార స్వామితేజం "కౌమారి", శక్తి అనే ఆయుధంతో నెమిలి మీద వచ్చింది. ఇంద్రునిశక్తి "ఐంద్రి" వజ్రాన్ని చేతబట్టి ఐరావతాన్ని అధిరోహించింది. ఆమెకూ ఇంద్రుడిలాగే వెయ్యికళ్లున్నాయి. శివుడు దేవితో "త్వరగా రాక్షసులను చంపేసేయ్" అంటాడు. అప్పుడు దేవీ శరీరం నుంచి అతిఘోరమైన, భయంకరమైన "చండిక" అనే శక్తి ఒకటి వస్తుంది. ఆ చండిక శివుణ్ణి, శుంభనిశుంభుల దగ్గరకు దూతగా పంపుతుంది. శివుడు శుంభనిశుంభులతో ఇంద్రపదవిని ఇంద్రుని కియ్యమనీ, దేవతలకి హవిర్భాగమియ్య మనీ చెప్తాడు. వాళ్లను పాతాళానికి వెళ్ళమంటాడు. చండిక శివుణ్ణి దూతకార్యానికి వినియోగించి నందువల్ల "శివదూతీ" అయ్యింది. కాళినుంచి శివదూతివరకూ కాళి, బ్రహ్మణీ, మహేశ్వరి, వైష్ణవి, కౌమారి, ఐంద్రి, నారసింహి, వారాహి, శివదూతికలకు "మాతృగణ"మని పేరు. కొన్నిసార్లు కాళినీ, శివదూతినీ తొలగించి ఏడుగురినీ "సప్తమాతృకలు అంటారు.

మాతృకాగణాలన్నీ దేవీ విభూతులే. మహామాయా ప్రభావంతో దేవికంటే భిన్నంగా ప్రకటితమైన ఈ విభూతులు తాము వచ్చిన పని ముగించుకొని, తమ అసలు రూపంలో విలీనమౌతున్నాయి. శుంభుడి మధ్య, దేవి మధ్య ఎప్పుడూ ఎక్కడా జరగని, జరగబోని రీతిలో వేయి దివ్యసంవత్సరాలు యుద్ధం జరుగుతుంది. వందలకొలది దివ్యాస్త్రాలు ఇరువైపులా ప్రయోగించారు. ఆగ్నేయాస్త్రానికి ప్రతీకార అస్త్రం "పర్జన్య అస్త్రం", పర్జన్యాస్త్రానికి వాయవ్యం, వాయవ్యానికి పార్వతం, పార్వతఅస్త్రానికి ప్రతీకారం వజ్రం. దేవి దివ్యాస్త్రాలు ప్రయోగి స్తుంటే శుంభుడు ప్రతీకారాలు ప్రయోగిస్తున్నాడు. శుంభుడు దివ్యాస్త్రాలు ప్రయోగిస్తే దేవి "హుంకారం" ఉచ్చరించి అవ లీలగా వాటిని ఛేదించేస్తోంది. ఆకాశంలో శుంభుడితో బాహా బాహీ పోరాడుతోంది దేవి. అలా పోరాడి శుంభుణ్ణి నేల మీదకు పడేస్తుంది. పిడికిలి బిగించి మీదకు వస్తున్న శుంభుణ్ణి శూలంతో చంపుతుంది.

శుంభుడిమరణంతో ప్రకృతి తనపూర్వస్థితిని పొందింది. మేఘాలు రక్తాన్ని వర్షించడం మానాయి. నదులు మామూలుగా ప్రవహిస్తున్నాయి. సూర్యుడు తేజోవంతుడయ్యాడు. గాలి చల్లగా, సుఖంగా వీస్తోంది.

స్త్రీలు కోపిస్తే దేవతలు కోపగించుకుంటారు. స్త్రీలు సంతోషిస్తే దేవతలు సంతోషిస్తారు. ఆనందించే మహిళలతో కులం అభివృద్ధి చెందుతుంది. మహిళలు అవమానం చెందితే కులం నాశనం అవుతుంది.

"శక్తి అంటేనే స్త్రీ. స్త్రీ అంటేనే శక్తి. గ్రామాల్లో ఈ శక్తే గ్రామదేవతలా వెలసి, గ్రామీణుల పూజలందుకుంటోంది. ఆ శక్తిరూపాలే గంగమ్మ, పోలేరమ్మ, సమ్మక్క సారక్క మావూళ్ళమ్మ, మైసమ్మ వగైరాలు. "నృణాం ఏకో గమ్యః త్వం అసి పయసాం అర్ణవ ఇవ" నీవు నదులకి సముద్రం అయి నట్లు, మనిషికి ఉన్న "ఒకే ఒక గమ్యానివి"అవిడే జగన్మాత.

# పురాణపురుషా! గోవిందా!

- డా॥ కె.వి. రాఘవాచార్య



పురాణాలు లోకంలో ధర్మాసక్తిని, ఆస్తిక్యబుద్ధిని పోషిస్తున్నాయి. పురాణాలలో సర్వవిధచిత్తవృత్తులకు ఆనందాన్ని కలిగించే కథలు అనేకం ఉన్నాయి. అందుచేతనే పురాణాలు ఉత్తమసాహిత్యగౌరవాన్ని పొంది, కావ్యనాటకాది వివిధసాహిత్య ప్రక్రియలకు వస్తుదానాన్ని, అర్థదానాన్ని ప్రసాదిస్తున్నాయి.

అష్టాదశమహాపురాణాలలోని ఎనిమిది మహాపురాణాలలో, మూడు ఉపపురాణాలలో, భారతానికి శేషభాగమైన హరివంశంలో వేంకటాద్రిక్షేత్ర, తీర్థ, దైవతాల మాహాత్మ్యాలను వర్ణించిన అధ్యాయాలున్నాయి.

క్రీ.శ.15వ శతాబ్దములో పసిండి వేంకటత్తురైవర్ (జీయరు రామానుజయర్) అనే తిరుమల శ్రీవేంకటేశ్వరుని అర్చకస్వామి పై పన్నెండుపురాణాలలో గల వేంకటాద్రి క్షేత్ర తీర్థ దైవతాల మహిమలను, వైభవాన్ని వర్షించిన 157 అధ్యాయాలను సంపాదించి, ఒక గ్రంథంగా సంకలనంచేసి శ్రీవేంకటాచలమాహాత్మ్యం (తిరువేంకటమాహాత్మ్యం) అని నామకరణం చేశాడు. అంతేగాక, పసిండి వేంకటత్తురైవర్ వేంకటాద్రి స్థలపురాణమనదగ్గ శ్రీవేంకటాచల మాహాత్మ్య గ్రంథాన్ని శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో దేవతాప్రీతికోసం నిత్యం 'తిరువోలక్కం' (ఆస్థానం) సమయంలో శ్రీవారిసన్నిధిలో పారాయణం చేయుటకు శ్రీభండారంలో 2000 నార్పణాలు చెల్లించి, ఏర్పాటుచేసి తేది: 27-6-1491న శాసనం వేయించాడు. (శాసన సంఖ్య: 95, సంపుటం-2, తి.తి.దే. శాసనాలు, 1998). స్వయంవ్యక్తమైన శ్రీవేంకటేశ్వర (శ్రీనివాస) అర్చావతారానికి పౌరాణిక మూలాన్ని కల్పించుటకొరకు పసిండి వేంకటత్తురైవర్ శ్రీవేంకటాచలమాహాత్మ్యమును సంకలనం చేసి ఉంటాడు. తత్ప్రచారంకోసం నిత్యపారాయణకార్యక్రమాన్ని ఏర్పాటు చేసినాడు.

ప్రస్తుతం లభించి ప్రచారములో ఉన్న స్కందమహాపురాణంలో రెండవదగు వైష్ణవఖండంలో శ్రీవేంకటాచలమాహాత్మ్యం 40 అధ్యాయాలలో 2,476 శ్లోకాలలో వర్ణింపబడి ఉంది. మహాభారతంలో- హరివంశంలో- ఆశ్చర్యపర్వంలో ఉన్న శేషధర్మనిలో 48 అధ్యాయాలలో 57 శ్లోకాలలో శ్రీవేంకటాచలమాహాత్మ్య కథనం గలదు. పసిండి వేంకటత్తురైవర్ సంకలనం చేసిన పురాణభాగాలుగాక ప్రస్తుతం లభించి ప్రచారంలో ఉన్న మహాభాగవత, దశమస్కంధంలోని 89వ అధ్యాయంలో కలియుగంలో శ్రీనివాసావతారానికి కారణమైన భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించినవృత్తాంతం గలదు. మహాభారతంలోనే బలరామునితీర్థయాత్రవర్ణనలో బలరాముడు వేంకటాద్రిని, వేంకటేశ్వరుని సందర్శించినట్లు దశమస్కంధంలో 79వ అధ్యాయం 13వ శ్లోకంలో చెప్పబడింది. భృగుమహర్షి వృత్తాంతం పద్మపురాణంలో ఉత్తరఖండంలో 60వ అధ్యాయంలో గలదు. పసిండి వేంకటత్తు రైవరుకు సమకాలికుడైన తాళ్లపాక అన్నమాచార్యులు (క్రీ.శ. 1408-1503) సంస్కృతభాషలో వేంకటాద్రిమాహాత్మ్యమును రచించినట్లు అన్నమయ్య మనుమడు చిన్నన్న (చినతిరువేంగళనాథుడు) "అన్నమాచార్యచరిత్రము" అనే ద్విపదకావ్యంలో చెప్పియున్నాడు. అన్నమాచార్యులు రచించిన వేంకటాద్రిమాహాత్మ్యం లభించలేదు. అన్నమాచార్యులు ఒక సంకీర్తనలో భాగవతం, బ్రహ్మాండపురాణం, వామనపురాణములలో వేంకటాద్రిమాహాత్మ్యానికి సంబంధించిన కథలున్నట్లు తెలిపియున్నాడు.

శ్రీవేంకటేశుడు శ్రీపతియు నితడే
పావనపు వైకుంఠ పతియును నితడే

భాగవతములో జెప్పె బలరాము తీర్థయాత్ర
నాగమోక్తమైన దైవ మాత డీతడే
బాగుగా బ్రహ్మాండపురాణపద్ధతి యాత డీతడే
యోగమై వామనపురాణోక్తదైవ మీతడే

వెలయు సప్తఋషులు వెదకి ప్రదక్షిణము
లలర జేసిన దేవు డాత డీతడే
నెలవై కోనేటిపొంత నిత్యము గుమారస్వామి
కలిమి దపము సేసి కన్న దేవు డీతడే

యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు
తక్కక కొలిచియున్న తత్త్వ మీతడే
చక్క నారదాదుల సంకీర్తనకు జొక్కి
నిక్కిన శ్రీవేంకటాద్రినిలయుడు నీతడే

– అన్నమయ్య ఆధ్యాత్మికకీర్తనలు
(సంపుటం-1 సంకీర్తన 425).

## 'ప్రపత్తి' (ప్రపద్యే) అంటే ...

'ప్రపద్యే' అనే మాటకు "వేడుకుంటున్నాను" "ఆశ్రయిస్తున్నాను" అని అర్థం. శరణాగతి, ప్రపత్తి- ఈ రెండూ భగవంతునికృపను అందించే సాధనలు. "శరణ మహం ప్రపద్యే", "సర్వస్వమూ పరమేశ్వరుడే" అని శరణువేడి ఆశ్రయించడం ఈ మాటలో అర్థం. ఆశ్రయభావం ప్రపత్తి.

ఈ ప్రపత్తి సిద్ధాంతంప్రకారం- ఆచార్యకృత్యం, పురుషకారకృత్యం, ఉపాయకృత్యం- ఈ మూడింటినీ భగవదర్పణం చేయాలి. గురువై గతి చూపించేదీ, ప్రయత్నాన్ని చేయించేదీ, మోక్షానికి ఉపాయాన్ని (సాధన) చూపించేదీ సర్వమూ నీవే నని పూర్తిగా శరణువేడడమే ప్రపత్తి. భగవంతుడు ప్రపత్తి మార్గసులభుడు. సర్వకర్మలను ఈశ్వరార్పణబుద్ధితో చేస్తూ, అహంకారాదులను త్యాగం చేయడమే అసలైన ప్రపత్తి. ఇలా ప్రపత్తిని చేసేవానిని 'ప్రపన్నుడు' అంటారు. భక్తునికి ఉండవలసింది 'ప్రపన్నత', దైవానికి ఉన్నది 'ప్రసన్నత'.

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

శ్రీభాగవత మహాపురాణంలో బలరాముని తీర్థయాత్రా సందర్భంలో బలరాముడు శ్రీశైలమల్లికార్జునుని దర్శించిన పిమ్మట ద్రవిడదేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేంకటాద్రిని, శ్రీవేంకటేశుని దర్శించినట్లు వర్ణించబడింది. (దశమస్కంధం, అధ్యా. 79- శ్లో. 13). బ్రహ్మాండపురాణంలో విష్ణుదేవుని క్రీడాద్రి యగు వేంకటమునకు శేషాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, అంజనాద్రి అను పేర్లు గలుగుటకు కారణాలైన వృత్తాంతాలు, తొండమాన్‌రాజు వృత్తాంతం వర్ణింపబడియున్నవి. సప్తఋషులు భగవంతుణ్ణి దర్శించడానికి వేంకటాద్రికి వచ్చి నలుదిక్కుల వెదకుచు గిరిప్రదక్షిణం చేసి, భగవంతుని దర్శించుట అనే వృత్తాంతాలు వామనపురాణంలో వర్ణింపబడినవి. (25-34 అధ్యాయాలు). తారకాసురవధవలన గల్గిన బ్రహ్మహత్యాపాతకాన్ని పోగొట్టుకోవడానికి కుమారస్వామి వేంకటాద్రికి వచ్చి, కుమారధారసమీపంలో తపస్సుచేయుట, శ్రీవేంకటేశుడు ప్రత్యక్షమై కుమారస్వామికి కోరినవరము నిచ్చి, బ్రహ్మహత్యా పాపాన్ని నశింపజేయుట, వామన, మార్కండేయ పురాణాలలో వర్ణింపబడినవి.

అన్నమాచార్యులు రచించిన "శ్రీనివాస! జగదేకనాయక! ఆశ్రితకల్పతరువ" ఇత్యాది సంకీర్తనలోని –

తొండమాన్ చక్రవర్తిపై సేసినదయ సేయు మయ్య
కురువనంబిగారిమీద నుంచిన కూర్మి నాపై నుంచు మయ్య

అనే పంక్తులు వేంకటాచలమాహాత్మ్యంలోని కథాంశాలను పేర్కొంటున్నాయి.

పై ఉదాహరణములనుబట్టి తాళ్లపాక అన్నమాచార్యులు బ్రహ్మాండ, భాగవత, వరాహ, వామన, మార్కండేయాది పురాణాలలోని, వేంకటాచల ఇతిహాసమాలలోని వేంకటాచల క్షేత్ర, తీర్థ, దైవత మాహాత్మ్యములను ప్రకటించు వృత్తాంతాలను గ్రహించి, సమన్వయించి, సంస్కృతంలో వేంకటాద్రిమాహాత్మ్యకావ్యాన్ని రచించినట్లు నిశ్చయింపవచ్చు.

ఈ వేంకటాచలమాహాత్మ్య సంబంధికథాంశాలు శ్రీవేంకటేశసుప్రభాత, స్తోత్ర, ప్రపత్తి, మంగళాశాసనాల రచయితయగు ప్రతివాదిభయంకర అణ్ణన్‌కాలం (క్రీ.శ. 1361-1453) నాటికే ప్రచారంలో నున్నట్లు విశదమౌతోంది. కంచినగరంలో నివసిస్తున్న ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి తన గురువైన అళఘియ మణవాళమహాముని వెంట

తిరుమలకు యాత్రగా వచ్చినపుడు, మణవాళమహాముని ఆజ్ఞానుసారం శ్రీవేంకటేశసుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళా శాసనాలను రచించాడు.

**బ్రహ్మాదయ స్సురవరా స్సమహర్షయ స్తే**
**సంత స్సనందనముఖా స్త్వథ యోగివర్యాః ।**
**ధామాంతికే తవ హి మంగళవస్తుహస్తాః**
**శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥ 27**

“బ్రహ్మాది దేవతలు, ఋషీశ్వరులు, సనందనుడు మొదలగు యోగీశ్వరులు మంగళకరమైన వస్తువులను చేతబట్టి, నీ ఆలయంఎదుట వేచియున్నారు. శ్రీవేంకటాచలపతీ! నీకు సుప్రభాతమగు గాక!”

ఈ శ్లోకభావము వేంకటాచలమాహాత్మ్యగ్రంథంలోని వరాహపురాణ ప్రథమభాగంలోని 47వ అధ్యాయంలోని “బ్రహ్మాది దేవతలు భగవ న్మందిరమున ప్రవేశించుట” అనే కథాంశాన్ని సూచిస్తోంది.

**ఆరాధ్యః సర్వదేవానాం మాధవో భక్తవత్సలః ।**
**విహాయ స్వం పరంధామ రమతే రమయా సహ ॥**
**- బ్రహ్మాండపురాణం, 1-20**

సర్వదేవతలకు పూజనీయుడు, భక్తులయందు వాత్సల్యం గలవాడు అగు శ్రీమన్నారాయణుడు తన వైకుంఠాన్ని వీడి శ్రీదేవితో వేంకటాద్రి పై విహరించుచున్నాడు.

శ్రీవేంకటాచలమాహాత్మ్యగ్రంథంలో శ్రీమన్నారాయణునికి భూలోకమున నివాసమగు సువర్ణముఖీనదికి సమీపంలో ఉన్న క్రీడాచలానికి వివిధకారణాలచేత, యుగభేదాలచేత ఏర్పడ్డ నామాంతరాలు, వాటికి సంబంధించిన ఇతిహాసాలు వర్ణింపబడ్డాయి. సుప్రభాతశ్లోకంలో వేంకటాద్రికి గల వింశతి (20) నామాలలో ముఖ్యమైన సప్తగిరులు స్తుతింపబడ్డాయి.

శ్రీ వేంకటేశస్తోత్రంలో చివర గల

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।**
**హరే వేంకటేశ ప్రసీద ప్రసీద**
**ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥ 9**

**అహం దూరత స్తే పదాంభోజ యుగ్మ**
**ప్రణామేచ్ఛయాఽఽగత్య సేవాం కరోమి ।**
**సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం**
**ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ ॥ 10**

**అజ్ఞానినా మయా దోషా నశేషాన్ విహితాన్ హరే ।**
**క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైలశిఖామణే ॥ 11**

శ్రీవేంకటేశ్వరుడు తప్ప వేరు ప్రభువు లేడు. ఎల్లప్పుడు వేంకటేశునే ధ్యానింతును. శ్రీహరీ! వేంకటేశా! అనుగ్రహింపుము. నాకు అభీష్టమును దయచేయుము. శ్రీవేంకటేశా! నీ పాదపద్మములకు నమస్కరింపవలెనను కోరికతో దూరము నుండి వచ్చి మీసేవ చేయుచున్నాను. వేంకటేశప్రభూ! ఈ ఒక్కమారు చేయు నీసేవచేత నాకు నిత్యము సేవించు ఫలమును అనుగ్రహింపుము. శేషశైలేశా! శ్రీహరీ! అజ్ఞానంచే నేను చేసిన అపరాధముల నన్నింటిని క్షమింపుము. క్షమింపుము.

పై మూడుశ్లోకాలను సుప్రభాతకర్త వేంకటాచల మాహాత్మ్యగ్రంథంలో నున్న మార్కండేయపురాణవిభాగం (2-19, 20, 21) నుండి గ్రహించి, వేంకటేశస్తోత్రంలో చేర్చుకున్నాడు. మార్కండేయపురాణంలో మార్కండేయ మహర్షి వేంకటాచలానికి యాత్రగా వచ్చి, శ్రీవేంకటేశుని దర్శించి, స్వామిని స్తుతించిన సందర్భములో ఈ శ్లోకాలు (2-16-21) గలవు. వీటన్నింటినిబట్టి వేంకటాచలక్షేత్రమహిమను చాటే పౌరాణికగాథలు, దేశీయగాథలు శ్రీవేంకటేశసుప్రభాతరచనకు ముందే ప్రచారంలో ఉండె నని స్పష్టమౌతోంది.


భక్తజనవత్సలుడు శ్రీవేంకటేశ్వరుడు తిరుమలనంబిని తాత అని పిలిచిన వృత్తాంతం తిరుమలై ఒళగు (తిరుమల సమయాచారములు), శ్రీవేంకటాచల ఇతిహాసమాలలో గలదు. తిరుమలనంబి (క్రీ.శ.11 శతాబ్దం) శ్రీరామానుజాచార్యులకు గురువు, మేనమామ. కురవనంబి- కుమ్మరిభీమునికథ- తిరుమలై ఒళగులో, వేంకటాచల ఇతిహాసమాలలో వేంకటాచల మాహాత్మ్యగ్రంథంలోని వరాహపురాణభాగం ద్వితీయభాగం, 10వ అధ్యాయంలోను, భవిష్యోత్తరపురాణభాగం 14వ అధ్యాయంలోను, స్కాందమహాపురాణం, వైష్ణవఖండం శ్రీవేంకటాచల క్షేత్రమాహాత్మ్యంలో 10వ అధ్యాయంలోను గలదు. అనంతాళ్వారు కథ వేంకటాచలఇతిహాసమాలలో గలదు. ఈ గ్రంథకర్త అనంతాచార్యుడే (1053-1140). తొండమాన్ చక్రవర్తి కథ వరాహపురాణం- భాగం 9, 10 అధ్యాయాలలో, బ్రహ్మ

పురాణం 7వ అధ్యాయంలో, బ్రహ్మాండపురాణం 8, 9 అధ్యాయాలలో, భవిష్యోత్తరపురాణం 14వ అధ్యాయంలో, స్కందపురాణం 9, 10 అధ్యాయాలలో గలదు. వసు వనేనిషాదునికథ వరాహ పురాణం- 2వ భాగం 9వ అధ్యాయంలో, బ్రహ్మపురాణం 8వ అధ్యాయంలో, బ్రహ్మాండపురాణం 8వ అధ్యాయంలో, స్కందపురాణం 9వ అధ్యాయంలో గలదు. సంపంగిమాకులు నడచిన కథ వేంకటాచల ఇతిహాసమాల 6వ స్తబకంలో ఉంది. వేంకటాచలపతి తన తపఃఫలంగా లభించిన అలమేల్మంగను ఎదనుంచుకొని, శ్రీనివాసు డనేసార్థకనామధేయం పొందినకథ పద్మపురాణం 34వ అధ్యాయంలో వర్ణించబడింది. మిగిలిన సంఘటనలు- కాసు కొక్క వరమిచ్చుట, దాసు తిమ్మన్న మోక్షం, పరుసవారికి తోడుగానుండుట- అన్నమాచార్యుల సమకాలమున జరిగినట్లున్నాయి. ఇవి వేంకటాచలమాహాత్మ్యంలో వర్ణింపబడ లేదు. దేశి యక్షగాన నాటకలక్షణాలైన కొరవంజి, చిలుక రాయబారాలు, పద్మావతీశ్రీనివాసకల్యాణకథలో శ్రీనివాసుడు ఎరుకత (కొరవంజి) వేషంలో వచ్చి ఎరుక చెప్పడం, పద్మావతి మనోఽభీష్టాన్ని చిలుకద్వారా రాయబారమంపి శ్రీనివాసునికి తెలియజేయడం మున్నగు సన్నివేశాలలో కనబడుతున్నాయి. ఈ దేశి యక్షగాననాటకలక్షణాలు గల సన్నివేశం వేంకటాచల మాహాత్మ్యంలోని భవిష్యోత్తరపురాణంలోని 8వ అధ్యాయంలో, వరాహపురాణం 2వ భాగం 7వ అధ్యాయంలో, స్కాంద పురాణంలోని 7వ అధ్యాయంలో వర్ణించబడింది.

శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని పునర్నిర్మాణం చేయించి, తాళ్లపాక చినతిరుమలాచార్యులు (క్రీ.శ.1485-1550) వేయించిన 22-03-1540నాటి తెలుగు శాసనంలో 'స్కాందపురాణోక్త మైన శ్రీవేంకటేశమాహాత్మ్య' ప్రస్తావన గలదు. (సంపుటం: 4, సంఖ్య: 144, తి.తి.దే. శాసనాలు, 1998)

ఇట్లు క్రీ.శ.15 శతాబ్దానికి పూర్వమే శ్రీవేంకటేశ్వరుని మహిమలను చాటేపురాణకథలు, దేశీయగాథలు ప్రచారంలో ఉన్నట్లు నిరూపించిన సాహిత్య, శాసనాధారాలు లభించాయి.

## వేంకటేశ్వర నామం ఎప్పుడు ఏర్పడింది... 'గోవింద' స్మరణ జరపడానికి మూలం...



'శ్రీనివాస', 'గోవింద' నామాలు విష్ణువునకు సహజనామాలు. 'వేంకటేశ' నామం క్షేత్రదైవంగా వచ్చిన నామం. లక్ష్మీదేవి(శ్రీ) ఎల్లప్పుడు నారాయణుని ఆశ్రయించుకుని ఉండడంచేత ఆయనను 'శ్రీనివాస' అన్నారు. 'గో' అంటే వేదవాక్యాలు, 'భూమి' అని రెండర్థాలు. 'గోవిందుడు' అంటే 'వేదాలచే నుతింపబడే పరతత్త్వం', 'వేదాలద్వారా తెలియబడే పరబ్రహ్మ' అని అర్థంతో పాటు 'భూమిని గ్రహించి, ప్రళయజలాలనుండి ఉద్ధరించిన ఆదివరాహస్వామి' అని కూడా అర్థం ఉంది. ఇంక కృష్ణుడు గోపాలకుడు కనుక 'గోవిందుడు'- ఇలా మూడు అర్థాలలోనూ నారాయణుడు తెలియబడుతున్నాడు.

కృతయుగంలోనే భూదేవి ప్రార్థనమేరకు, బ్రహ్మాదులకోరిక మేరకు నారాయణుడు పృథ్విపై తన విభూతులతో విహరించదలచుకున్నాడు. ఆయన విహారంకోసం ఆదిశేషుడే పర్వతంగా వెలశాడు. అందుకే అది శేషాద్రి. ఆదివరాహస్వామి (భూమిని ఉద్ధరించిన గోవిందుడు) రూపంలో అక్కడ మొదటిసారిగా విహరించాడు - శ్రీహరి. శ్రీహరి విహారంచేత ఆ పర్వతం పరమపావనమై దర్శించినవారిపాపాలను నశింపజేసేశక్తిమంత క్షేత్రమైంది. 'వేం' అంటే 'పాపాలను', 'కట' అంటే సంహరించునది' అని అర్థం.

"వేంకట - పాపసంహారకం" ఆ పర్వతంపై వెలసి, భక్తులను పావనులను చేసేస్వామి కనుక శ్రీవేంకటేశ్వరుడు. మరొక అర్థంలో "వేం" అమృతబీజం, "కట" ఐశ్వర్యవాచకం. అమృతం(ఆనందం), ఐశ్వర్యం అందించే విష్ణుపరత్వం వేంకటాచలం. కలియుగారంభంలో మరొక రూపంలో స్వామి ఈ పర్వతానికి వచ్చి శ్రీలక్ష్మి అవతారమైన పద్మావతిని వివాహమాడి, తన ఆదిరూపమైన వరాహస్వామి అనుమతితో ఇక్కడ వెలశాడని పురాణకథ.

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

# ఈయన ఊరేరిగింపు తర్వాతే...

- శ్రీ కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య, 94914 11090

శైవసంప్రదాయంలో గణపతిని తలుచుకున్నట్లుగానే వైష్ణవులు తొలుతగా విష్వక్సేనుని స్మరిస్తారు. ఏ పని తలపెట్టినా ఆయననే ముందుగా పూజిస్తారు. ఈయన విష్ణుగణాలకు అధిపతి. వైకుంఠసేనాని. సాక్షాత్తు విష్ణువులాగే చతుర్భుజాలతో ఉంటాడు. వైష్ణవులు స్మరించే గురుపరంపరలో ఈయనస్థానం మూడవది. మొదట విష్ణువు, రెండు లక్ష్మీదేవి.

విష్వక్సేనులవారు భాద్రపదమాసంలో పూర్వాషాఢ నక్షత్రంలో ఆవిర్భవించారు. ఈయనజననానికి సంబంధించిన పురాణకథ– పూర్వం దుర్వాసమహర్షితపస్సును భగ్నం చేయమని ఇంద్రుడు కుంతల అనే అప్సరసను పంపిస్తాడు. ఇది తెలుసుకున్న దుర్వాసమహర్షి ఆమెను అరణ్యాలలో పడి తిరగమని శపిస్తాడు. ఆమె వీరబాహు అనే కిరాతుడికూతురుగా జన్మిస్తుంది. ఆమెపేరు సువర్చల. ధీరోదాత్తుడైన గుణాలతో కూడిన కుమారుడు కావాలని ఈమె వరుణుడిని కోరింది. విష్వక్సేనుడు బంగారుశరీరవర్ణంతో, విశాలమైన కనులతో పుట్టుకతోనే దేహంపై శంఖం, ఖడ్గం మరియు ధనుస్సు చిహ్నాలతో సేనాపతి అవుతాడనే సంకేతంగా పుడతాడు. ఇతడిని కశ్యప మహర్షి పెంచి వేదాన్ని, మంత్రశాస్త్రాలను నేర్పిస్తాడు. తరువాత వృషభాద్రిపై పన్నెండు సంవత్సరాలపాటు కఠోరతపస్సు చేసి శ్రీనివాసునిఅనుగ్రహంతో సేనాపతిగా అవతరిస్తాడు.

తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఈశాన్యభాగంలో విష్వక్సేనులవారిసన్నిధి ఉంది. స్వామి వారిఆలయానికి చుట్టూ ముక్కోటిప్రదక్షిణమార్గంలో ఈ సన్నిధి కనిపిస్తుంది. అయితే సంవత్సరానికోసారి వైకుంఠఏకాదశి, వైకుంఠద్వాదశి పర్వదినాలలో మాత్రమే ఈ ముక్కోటి ప్రదక్షిణప్రాంతాన్ని తెరిచి ఉంచుతారు. అప్పుడుకూడా భక్తులరద్దీవల్ల ఈ సన్నిధిదగ్గరికి వెళ్ల డానికి అందరికీ అవకాశం ఉండదు. ఇక్కడ విష్వక్సేనులవారు కుడిచేతిలో అభయముద్రతో ఎడమ చేయి కటివద్ద ఉంచుకుని, పర(వెనుక) హస్తాలలో శంఖ చక్రాలను ధరించి కనిపిస్తారు. తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలలో ముందుగా సేనాపతి ఉత్సవం జరుగుతుంది. ఈయన నాలుగుమాడవీథులలో ఊరేరి గింపుగా వచ్చిన తరువాతనే శ్రీవేంకటేశ్వరస్వామివారు వాహనంపై వేంచేస్తారు.

### విష్వక్సేన ధ్యానం

విష్వక్సేనం సకలవిబుధప్రౌఢసైన్యాధినాథం
ముద్రాచక్రే కరతలయుగే శంఖదండే దధానం ।
మేఘశ్యామం సుమణిమకుటం పీతవస్త్రం శుభాంగం
ధ్యాయేత్ దేవం విజితదనుజం సూత్రవత్యాసమేతమ్ ॥

### విజ్ఞానాన్నిచ్చే విష్వక్సేన రూపం

విష్వక్సేనుడు జ్ఞానప్రదాయకుడు. ఈయన నాలుగుచేతులతో పద్మపీఠంపై ఆసీనుడై నిజహస్తాలతో కుడిచేత అభయ ముద్ర, సూచీహస్తం లేక పుష్పాన్ని, కొన్నిచోట్ల దండాన్ని ధరించి కూడా కనిపిస్తాడు. ఎడమచేత కటిముద్రను / గదను, పర హస్తాలలో శంఖ, చక్రాలను ధరిస్తాడు. విష్ణుస్వరూపానికి ఈయనకు ఒకటే తేడా. మహావిష్ణువుకు శ్రీవత్సం, బ్రహ్మ సూత్రం ఉంటాయి. విష్వక్సేనుడికి అవి ఉండవు. ఈ స్వామి ముక్తిని, జ్ఞానాన్ని ప్రసాదిస్తా డని పరాశరసంహిత చెప్పింది.



# సాక్షాత్తు బ్రహ్మ జరిపించిన ఉత్సవాలు

- డా॥ వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు, 94907 41414



వైష్ణవాలయాలలో ప్రపంచప్రఖ్యాతిగాంచి అనుదినం అభివృద్ధి చెందుతూ వైదిక కార్యక్రమాలతో మారుమ్రోగుతూ పవిత్రఆలయంగా ప్రసిద్ధికెక్కింది తిరుమల శ్రీశ్రీనివాసుని దివ్యఆలయం.

మహిమాన్వితమైన ఈయన నిలయాన్ని దివ్యఆనందనిలయ మని అంటారు. ఈ ఆనందనిలయదివ్యవిమానం రెండుగోపురాలతో మూడుప్రాకారాలతో సప్తద్వారాలతో కూడుకొని ఉంటుంది. విమానాంతర్గతుడైన ఆ భగవంతుని శ్రీమన్నారాయణుడని, వైకుంఠవాసుడని, ఆపదమ్రొక్కులవాడని, అనాథరక్షకుడని, ఆపద్బాంధవుడని, వడ్డికాసుల వాడని, వేంకటేశుడని భక్తులు వారివారిమనోవృత్తినిబట్టి పిలుస్తూ ఉంటారు.

వేంకటాద్రివాసునికి జరుగు అర్చనావిధానమంతా దివ్యవైఖానసఆగమశాస్త్రోక్తంగా జరుపబడుతుంది. ఈ ఆగమం ఈ శ్రీనివాసుణ్ణి అర్చించటానికే వైదికపద్ధతిలో ఆవిర్భవించింది. మాసపూజలు, వారపూజలు, నిత్యపూజలు, నైమిత్తిక పూజలు అన్నీ ఆ ఆగమవిధానంతోనే జరుగుతాయి. ఈ అన్నిపూజలలోనూ ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది- బ్రహ్మోత్సవం. దీనిని శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో చెప్పబడ్డరోజునే ప్రధానంగా జరుపుతారు. రవి కన్యామాసంలో ప్రవేశించిన తరువాత వచ్చే శ్రవణనక్షత్రం రోజున అవభృథమనే కార్యక్రమాన్ని ప్రధానంగా నిర్ణయించుకుని, దానికి తొమ్మిదిరోజులు నవాహ్నికంగా బ్రహ్మోత్సవాలు చేయబడుతాయి.

బ్రహ్మోత్సవం జరిగే తొమ్మిదిరోజులకు ముందు వైఖానసాగమోక్తంగా యజమానునిచే నిర్ణయింపబడ్డ ఆచార్యుడు అంకురార్పణ జరుపుతాడు. అంకురార్పణ అంటే అంకురాలను అర్పణ చేయటం. భూమిపై ఆవిర్భవించిన ధాన్యపుగింజలను అన్నింటినీ తీసుకొనివచ్చి ఒకచోట ఉంచి, ఆనందనిలయ దివ్యవిమానానికి నైఋతిభాగంలో ఉండే వసంతమంటపంవద్దకు ఆచార్య స్వామి ఋత్విక్కులతో మేళతాళాలతో, బాజాభజంత్రీలతో వెళ్లి, అచ్చట క్రియా పరిసమాప్తికి విష్వక్సేనుని పూజించి పుణ్యాహవాచన మనే కార్యక్రమంతో ఆ ప్రదేశాన్ని శుద్ధిచేసి, భూదేవతను ఆహ్వానించి, ధూప దీప నైవేద్యాద్యుపచారాలతో అర్చించి, మట్టిని గ్రహించి, గ్రామప్రదక్షిణంగా ఆలయంలోనికి వెళ్లి అనంత, గరుడ, విష్వక్సేన దేవతలను యథాశాస్త్రంగ పూజించి ఈశాన, పర్జన్య, జయంత, మాహేంద్ర మొదలగు దేవతలను, ఇంద్ర, అగ్ని, యమాది అష్ట దిక్పాలురను, అప్సరసలను ఆహ్వానించి, పూజించి వీరికి మధ్యన బ్రహ్మను

ఆరాధించి, పాలికాదులలో మట్టిని వేసి, అందులో ధాన్యపు గింజలను ఓషధీసూక్తులతో వేసి, అభిమంత్రించడం అంకురార్పణ. ఇది చేయబోవు కార్యక్రమానికి శుభసూచకం. ఇది తొమ్మిదిరోజులు జరిగే కార్యక్రమానికి ముందురోజు ఆచరింపబడుతుంది. ఆ తరువాతది ధ్వజారోహణ.

## మొదటిరోజు కార్యక్రమం

ఆలయంలో నిత్యపూజలైన తరువాత ఆచార్యుడు అగ్నిని ప్రతిష్ఠించి, అందు ధ్వజపటవాస్తుశుద్ధికై వాస్తుహోమం జరిపి ధ్వజపటాన్ని ప్రతిష్ఠించి, ఆ ధ్వజపటంలోకి గరుడుని ఆహ్వానిస్తాడు. ఉభయనాంచారులతో గ్రామోత్సవానికి సిద్ధంగా ఉన్న ఉత్సవమూర్తులకు కంకణధారణ, ఆచార్యునికి కంకణధారణ జరిపి, ఆయా దేవతలను ఆహ్వానార్థం వాద్య భేరిని పూజించి ఆచార్యుడు తాడన జరుపుతాడు. "పారశవుడు" 'అనేవాద్యవేత్త బ్రహ్మోత్సవం తొమ్మిదిరోజులు గ్రామోత్సవంలో ముందు నడుస్తాడు. ఆ తరువాత ఆలయాంతర్గతులైన ద్వారదేవ, ద్వారపాల, లోకపాల, విమానపాలురకు బలిని వేసి, బ్రహ్మను ఆహ్వానించేందుకు గ్రామోత్సవానికి అందరూ బయలుదేరుతారు.

## గ్రామోత్సవం - దేవతాహ్వానం

ఆచార్యుడు పట్టువస్త్రోత్తరీయుడై ద్వారదేవ, ద్వారపాలురను ఆలయాంతర్గతదేవతలకు వైఖానసాగమశాస్త్రంలో చెప్పిన విధంగా పుష్పం, తోయం, బలిం, తోయం అనే నాలుగు ఉపచారాలు సమర్పిస్తాడు. ఈ కార్యక్రమానంతరం విశేషంగా ఆచార్యుడు బ్రహ్మస్థానంవద్ద ప్రోక్షణ చేసి, ఈ ఉత్సవం దిగ్విజయంగా పరిసమాప్తి కావాలని స్తోత్ర, గద్య, పద్య, మంత్ర తంత్రయుక్తంగా ఆహ్వానిస్తాడు. ఆ తరువాత అష్టదిక్పాలురను ఆహ్వానిస్తాడు.

బ్రహ్మోత్సవంలో ఈ దిగ్దేవతలను ఆహ్వానించటం ఒక ప్రత్యేకత. ఇంద్ర, అగ్ని, యమ, నిరృతి, వరుణ, వాయు, కుబేర, ఈశాన దేవతలు దిక్పాలురు, ఈ దిక్పాలురే ప్రజాజీవనానికి సహకారులు. అందుకే వీరిని ఆలయానికి నలువైపులా ఉన్న నాలుగుమాడవీథుల సందులలో మంత్ర తంత్ర గద్య పద్య సమాయుక్తంగా ఆహ్వానిస్తారు. వీరు వేంకటాద్రివాసుని అనుగ్రహంతో ప్రజలకు వారి వారి ఆధిపత్యంలోని శక్తియుక్తులను అందిస్తారు.

**ఇంద్రుడు** : జీవరాశులకు కోరిన కోరికలను ఇస్తాడు.

**అగ్ని** : చరాచరప్రాణికోటికి తగినంత వేడిని ప్రసాదిస్తాడు.

**యముడు** : జీవులకు ఆయుస్సును అనుగ్రహిస్తాడు.

**నిరృతి** : దైనందినకార్యక్రమాలు జరుపుకోవడానికి తగినంత శక్తిని ప్రసాదిస్తాడు.

**వరుణుడు** : నీటిని అనుగ్రహిస్తాడు.

**వాయువు** : గాలిని అనుగ్రహిస్తాడు.

**కుబేరుడు** : ధనాన్ని ప్రసాదిస్తాడు.

**ఈశానుడు**: లయకారకుడైన ఈశ్వరుడు.

వీరిని రప్పించి, వీరిసమక్షంలో బ్రహ్మోత్సవం జరుపుతారు. అష్టదిక్పాలురను ఆహ్వానించిన తర్వాత ఆచార్యుడు ధ్వజస్తంభం వద్దకు వచ్చి శ్రీశ్రీనివాసుని ధ్వజచిహ్నమైన గరుడుని చిత్రాన్ని సర్వదేవతాఆహ్వానార్థం సర్వదేవతాగద్యం చెప్పి, గరుడుని స్తోత్ర, గద్య, పద్య, మంత్ర, తంత్ర సమాయుక్తంగా సుముహూర్తంలో ఆకాశంలోకి పంపుతారు. దీన్నే ధ్వజారోహణ అంటారు. కార్యాంతంలో ధ్వజాన్ని భూమిపైకి అవరోహణ చేస్తారు.

మొదటిరోజు రాత్రి పెద్దశేషవాహనంపై శ్రీభూదేవీ సహిత మలయప్పస్వామిని తిరుమాడవీథులలో ఊరేగిస్తారు.

తనకు పాన్పుగా ఏర్పడిన శేషు దంటే శ్రీనివాసునికి ఎంతో ఇష్టమట! అందుకే మొదటిరోజు శేషవాహనంపై ఊరేగింపు జరుగుతుంది.

వాహనాలను పరిశీలిస్తే రెండవరోజు ఉదయం చిన్న శేషవాహనం. రాత్రికి హంసవాహనం ఊరేగింపబడతాయి. హంసవాహనం బ్రహ్మకు ప్రతిరూపం. అహంకారహింసాభావ నాశనాలకు చల్లనిచూపుల భాగ్యసంతతికి మూడవరోజున జరుపబడే సింహ, ముత్యపుపందిరివాహనాలు ప్రతీకలు.

నాల్గవరోజు వాహనాలు కల్పవృక్ష, సర్వభూపాలాలు. ఇవి ఇంద్రునిచేతిలో ఉంటాయి. కోరినకోరికలు తీర్చేది కల్పవృక్షం. భూమండలాన్ని పాలించేఅర్హత ఇంద్రునకు కలదు. ఇంద్రుడుకూడా విష్ణువే అని సూచిస్తాయి ఈ వాహనాలు. సముద్రమథనం చేసిన తరువాత పుట్టింది అమృతం. ఈ అమృతం రాక్షసులు తాగితే లోకనాశనం తప్పదు. దేవతలే తాగాలి. అమృతం సద్వినియోగం కావాలి అని, శ్రీమహావిష్ణువు మోహినీవేషం ధరించి పాంచభౌతికమైన దేవతా శరీరాన్ని స్థాపించదలచినదానికి ప్రతీకగా ఐదవరోజున

మోహినీవేషధారణ జరుగుతుంది. అదే రోజురాత్రి గరుడుడిపై ఊరేగుతాడు- స్వామి.

వాహనాలలో గరుడవాహనంపై ఉన్నస్వామికి ప్రత్యేక స్థానం ఉంది. గరుడవాహనంపై గల స్వామిని దర్శిస్తే వైకుంఠంలో ఉన్న స్వామిని దర్శించినంత ఫలం. గరుడోత్సవం రోజున శ్రీవిల్లిపుత్తూరునుండి శ్వేతచ్ఛత్రాలు అంటే తెల్లని గొడుగులు స్వామివారికి కానుకగా వస్తాయి. వాటిని ధరించి స్వామి ఊరేగుతాడు. ఆ రోజున మూలమూర్తికి ధరింపజేసే మకరకంఠలక్ష్మీహారాన్ని ధరించి, ఉత్సవమూర్తి తిరుమల కొండపై ఊరేగుతాడు.

ఆరవరోజున ఉదయం హనుమంతవాహనం. రాత్రికి గజవాహనంపై ఊరేగుతాడు. కార్యసాధనకు హనుమంతుడు ప్రతీక. దర్పానికి, గంభీరానికి చిహ్నం గజం. స్వామి కార్య సాధనాపరులకు కార్యసాధకుడుగా, ఆపదలను వినిపించే భక్తుల పాలిట గంభీర స్వరూపంగా ఉంటూ రక్షకుడుగా వెలుగొందటానికి చిహ్నమే ఈ వాహనాల ప్రాముఖ్యత.

ఆరవరోజున మధ్యాహ్నం వసంతోత్సవ క్రియ జరుగుతుంది. ఇది శైత్యోపచారక్రియ. అంటే మంగళస్నానమన్నమాట! ఏడవరోజున ఉదయం సూర్యప్రభ, రాత్రికి చంద్రప్రభ వాహనాలపై స్వామి ఊరేగుతాడు. ఎనిమిదవరోజున ఉదయం రథోత్సవం జరుపబడుతుంది.

అన్ని వాహనాలలో కెల్లా రథోత్సవానికి ఒక ప్రాశస్త్యం ఉంది. అష్టదిక్పాలకులకు అధిపతిని నేను అని సూచించడానికి రథోత్సవం ఎనిమిదవరోజు జరుగుతుంది.

ఎనిమిదవరోజు రాత్రి అశ్వవాహనం ఉంటుంది. కల్కి అవతారంతో స్వామి ఆవిర్భావం చెందుతా డనే విషయాన్ని తెలియచేస్తూ అశ్వవాహనం ఊరేగింపబడుతుంది.

తొమ్మిదవ రోజున ఉదయం చక్రస్నానం జరుగుతుంది. స్నానం చేయించటానికి స్వామిని ముందు చూర్ణంతో అభిషేకిస్తారు. స్వామిపుష్కరిణీప్రాంతంలోనికి స్వామిని తీసుకొని వచ్చి, పంచామృతంతో అభిషేకించి, విష్ణువుకు ప్రతిరూపంగా ఉన్న సుదర్శనచక్రాన్ని పుష్కరిణిలో నిమజ్జనం చేస్తారు. ఆ సమయంలో భక్తులు స్నానంచేస్తే విశేషపుణ్యఫలితం వస్తుంది. సర్వతీర్థాల సంగమం- స్వామిపుష్కరిణి. వైకుంఠంలో ఉండే క్రీడాసరస్సు స్వామిపుష్కరిణిగా ఏర్పడింది. అందుకే స్వామిపుష్కరిణికి అంత ప్రాధాన్యం ఏర్పడింది.

ఈ చక్రస్నానం పూర్తి అయితే బ్రహ్మోత్సవం పూర్తి అయినట్లే, అదే రోజు రాత్రి దేవతలనందరినీ వారి వారి ఇండ్లకు పంపుటకు వీధిఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవంలో అందరినీ ఆచార్యుడు యథాస్థానానికి పంపుతాడు. బ్రహ్మ, ఇంద్ర, అగ్ని, మున్నగు దేవతలు స్వస్థానాలకు వెళతారు. ఇదే ధ్వజావరోహణ. ఆ తరువాత కుంభశక్తిని ధ్రువమూర్తిలోనికి ప్రవేశింప చేసి విశేషనివేదనాదులు జరుపుతారు. దీంతో బ్రహ్మోత్సవం పూర్తవుతుంది.

లోకసంక్షేమానికి, సర్వజనసుభిక్షతకు కారణభూతమైన ఈ బ్రహ్మోత్సవం విశ్వశాంతికి, ఆధారభూతమై, ఉపద్రవ నివారణ కల్గించి ప్రజలందరి సన్మార్గవర్తనకు దోహదం కావాలని ఆకాంక్ష!



## కౌసల్యాసుప్రజారామా! పూర్వాసంధ్యా ప్రవర్తతే...

**శ్రీవేంకటేశ్వరుడు శ్రీమహావిష్ణు స్వరూపుడు. ఆ నారాయణుడే రాముడు. ఇద్దరికీ భేదం లేదు. శ్రీవేంకటేశ్వరుడు సనాతనదైవం. సాక్షాద్విష్ణువే. ఆయనకు తల్లి లేదు. 'వకుళ' పెంచినతల్లిమాత్రమే. పైగా వేదసమమైన ఆదికావ్యం వాల్మీకి రామాయణం లోని శ్లోక మిది. గాయత్రీ మంత్రద్రష్ట అయిన విశ్వా మిత్ర మహర్షి పరాత్పరుడై అవతారపురుషుడైన శ్రీరామ చంద్రమూర్తికి కర్తవ్యప్రబోధం చేసే ఈ శ్లోకం- 'లోక కల్యాణానికి సమాయత్తం కమ్మని' దేవదేవుని వేడుకోవడమే! మహర్షి నుండి ఆ శ్లోకంలో దివ్యార్థాలు దాగి ఉండి వేదసమానమైంది. ఆ రాముడే ఈ వేంకటేశుడు. ఆర్షమైన (ఋషిప్రోక్తమైన) ప్రబోధశ్లోకంతో ప్రారంభించడంవల్ల లౌకిక వాఙ్మయమైన సుప్రభాతానికి ఋషిశక్తి సమకూరుతుంది.**

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

# దివ్యప్రబంధ నీరాజనం

– డా॥ పి.టి.జి. రంగరామానుజాచార్యులు

ఆళ్వార్లు దివ్యానుభూతితో కీర్తించిన దివ్యదేశాల్లో అత్యంతప్రసిద్ధి పొందినక్షేత్రాలు ప్రధానంగా మూడు. మొదటిది కోయిల్ అని జగత్ప్రసిద్ధి గావించిన శ్రీరంగం. రెండవది తిరువేంగడమలైయని ప్రసిద్ధి పొందిన తిరుమల దివ్యక్షేత్రం. మూడవది పెరియకోయిల్‌గా ప్రసిద్ధి గాంచిన కాంచీపురం. ఈ మూడు క్షేత్రాల్లో తలమానికమైన పుణ్యక్షేత్రం తిరుమల. ఇక్కడ సాక్షాత్కరించినస్వామి సాక్షాత్తుగ శ్రీవేంకటేశ్వరుడుగా కీర్తింపబడేమూర్తి శ్రీమన్నారాయణుడే. ఈ స్వామికి తమిళంలో తిరువేంగడముడైయాన్, తిరుమాల్ అని పేర్లున్నాయి. వేదేతిహాసాలు, పురాణాలు శ్రీపాంచరాత్ర వైఖానసాగమాల్లో ఈ క్షేత్రప్రశస్తి వర్ణింపబడింది. ఇక్కడ నిత్య నైమిత్తికోత్సవాలు, శ్రీ వైఖానసాగమప్రకారం జరుగుతున్నాయి. అంతేకాకుండ ఈ క్షేత్రంలో భగవద్రామానుజాచార్యుల వారు శ్రీవైష్ణవసంప్రదాయాలను యథావిధిగ నిర్వర్తించేటట్లు నియమం చేశారు. శ్రీ వైష్ణవసంప్రదాయంలో దివ్యప్రబంధా ధ్యయనం ముఖ్యమైన అంశం. తిరుమలదివ్యక్షేత్రంలో నాలాయిర దివ్యప్రబంధాధ్యయనం ఉదయం సుప్రభాతసేవనుంచీ రాత్రి ఏకాంతసేవ పర్యంతం విభిన్నసమయాలలో శ్రీభాష్యకారులు ప్రవర్తింపజేశారు. ఈ దివ్యప్రబంధాధ్యయనంవల్ల శ్రీవారి ఆలయంలో జరిగే ఉత్సవాలకు నిండుదనం సమకూరుతుంది.

## శ్రీవారి ఆలయంలో దివ్యప్రబంధ పారాయణం

తిరుమలలోని శ్రీవారిఆలయమందు ప్రాతఃకాలంలో గర్భగుడితలుపులు తెరువగానే ముందుగ తొండరడిప్పొడి యాళ్వార్ల తిరుప్పళ్ళియొజుచ్చి ప్రబంధం గానం ఏడాది పొడు గునా జరుగుతుంది. అయితే శ్రీమణవాళ మహామునులు ధనుర్మాసంలోమాత్రం తిరుప్పళ్ళియొళిచ్చి జరపా లని మిగిలిన సంవత్సరమంతా ప్రతివాదిభయంకర అణ్ణన్‌స్వామిచే చేయబడిన శ్రీవేంకటేశ్వరసుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనాలు గానం చేయాల్సిందిగా నియమించిరి. అటుపై నిత్యతోమాల సేవయందు శ్రీనివాసునిసన్నిధిలో తొండరడిప్పొడియాళ్వార్ల తిరుప్పళ్ళియొజుచ్చి మరియు ఆండాళ్ తిరుప్పావై చేసి, నైవేద్యం తర్వాత తిరుప్పావై శాత్తుమురై నిర్వహిస్తారు. అట్లే సాయంకాల తోమాలసేవలో పెరియాళ్వార్ల తిరుప్పల్లాండు, పూచ్చుదల్, కాప్పిడల్, శెన్నియోంగు పాశురాలు, తిరుమంగై ఆళ్వార్ల తాయేతందై, వాడమరుదిడై, ఏళైఏతలన్, ఆండాళ్‌చే రచింప బడిన విణ్ణీలమేలాప్పు, నమ్మాళ్వారుల ఒళివిల్ కాలమెల్లామ్, ఉలగముండ పెరువాయా, కంగుం పగలుం, అళియోజ పాశు రాలను, తిరుప్పాణ్ ఆళ్వార్ల అమలనాది పిరాన్, మధురకవి ఆళ్వార్ల కణ్ణినుణ్‌శిరుత్తాంబు మొదలగు 15 దశకాలు గానం చేయబడుతాయి.

ఇవేగాక ప్రధానమగు వార్షికబ్రహ్మోత్సవాలలో అంత కంటే ప్రధానమైన అధ్యయనోత్సవాల్లో ప్రబంధాధ్యయనమే సింహభాగాన్ని పోషిస్తోంది. వీనిలో వార్షికబ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం, సాయంకాలం జరిగే శ్రీస్వామివారి వాహనసేవల్లో అనుసంధింపబడే దివ్యప్రబంధక్రమాన్ని క్రింద పరిశీలిద్దాం.





## బ్రహ్మోత్సవాలు - అనుసంధింపబడే ప్రబంధం

| రోజు | సమయం | వాహనసేవ | అనుసంధింపబడే ప్రబంధం |
|---|---|---|---|
| మొదటిరోజు | సాయంత్రం | పెద్దశేషవాహనం | ముదల్ తిరువన్దాది |
| రెండవరోజు | ఉదయం | చిన్నశేషవాహనం | ఇరండాం తిరువన్దాది |
| రెండవరోజు | సాయంత్రం | హంసవాహనం | ఇరండాం తిరువన్దాది |
| మూడవరోజు | ఉదయం | సింహవాహనం | మూన్డ్రాం తిరువన్దాది |
| మూడవరోజు | సాయంత్రం | ముత్యపుపందిరి | మూన్డ్రాం తిరువన్దాది |
| నాల్గవరోజు | ఉదయం | కల్పవృక్షవాహనం | నాన్ముగం తిరువన్దాది |
| నాల్గవరోజు | సాయంత్రం | సర్వభూపాలవాహనం | నాన్ముగం తిరువన్దాది |
| ఐదవరోజు | ఉదయం | మోహినీఅవతారం | తిరువిరుత్తము |
| ఐదవరోజు | సాయంత్రం | గరుడవాహనం | తిరువిరుత్తము |
| ఆరవరోజు | ఉదయం | హనుమంత వాహనం | పెరియ తిరువన్దాది |
| ఆరవరోజు | సాయంత్రం | గజవాహనం | పెరియ తిరువన్దాది |
| ఏడవరోజు | ఉదయం | సూర్యప్రభవాహనం | పెరియ తిరుమొళి |
| ఏడవరోజు | సాయంత్రం | చంద్రప్రభవాహనం | పెరియ తిరుమొళి |
| ఎనిమిదవరోజు | ఉదయం | రథోత్సవం | పెరియ తిరుమొళి |
| ఎనిమిదవరోజు | సాయంత్రం | అశ్వవాహనం | నాచ్చియార్ తిరుమొళి |
| తొమ్మిదవరోజు | ఉదయం | పల్లకీసేవ | పెరుమాళ్ తిరుమొళి |

అంతేగాక మొదటిరోజునుండి ఆరవరోజువరకు పైన తెల్పిన ప్రబంధాలను పఠిస్తూ పెరియాళ్వార్ అనుగ్రహించిన ప్రబంధపారాయణంకూడ జరుపబడును. ఎనిమిదో రోజు ఉదయం రథోత్సవంలో రథసమీపమందు శాత్తుముఱైని నిర్వహించి, తిరుమంగైయాళ్వార్లప్రబంధాన్నికూడ అధ్యయనం చేస్తారు. అదేవిధంగా పెరియతిరుమడల్, శిఱియతిరుమడల్ ప్రబంధాలనుకూడ గానం చేస్తారు. తొమ్మిదవరోజు చూర్ణాభిషేకసందర్భంలో తిరుమొళిశైయాళ్వార్ల తిరుచ్చంద విరుత్తం, కణ్ణినుణ్ శిరుత్తాంబు పాశురాలనుకూడ పఠిస్తారు.

**శ్రీనివాసకల్యాణం పద్మావతీదేవితో జరిగినట్లు పురాణ కథనం. మరి తిరుమలలో జరిపే కల్యాణం శ్రీదేవి, భూదేవులతో ఉంటుంది. ప్రవరలో శ్రీనివాసుని విష్ణుమూర్తి పౌత్రుడుగా చెబుతారు. ఈ వైరుధ్యాలకు పొంతన ఏమిటి?**



**పురాణకథ ఎలా ఉన్నా, పద్మావతి మహాలక్ష్మి స్వరూపం. విశ్వవ్యాపకమైన విష్ణుని విభూతి(ఐశ్వర్య), శ్రీదేవి. భూమిగా ఉన్న లక్ష్మి భూదేవి. ఈ రెండూ ఒకే తల్లి రూపాలు. వృష్టి చైతన్యానికీ, విశ్వచైతన్యానికీ ఈశ్వరుడు (ప్రభువు) శ్రీహరి. ఈ తాత్త్వికభావనే ఉభయదేవేరుల వివాహంలో గ్రహించాలి. ఆగమసంప్రదాయానుసారం ఉభయదేవేరులకే పెళ్లి జరిపిస్తారు. దేవతల విషయంలో పుత్రపౌత్రాది బంధాలు మానవులవంటివికావు. నారాయణుడే అవతారక్రమంలో శ్రీవేంకటేశునిగా అర్చావతారంగా వెలశాడు. అనాదియైన శ్రీమహావిష్ణువు ఒక కాలంలో ఇలా వెలయడం చేత ఈ రూపం పౌత్రునిగా కల్యాణసంప్రదాయంలో ప్రస్తావించబడింది.**

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ



తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2021 అక్టోబరు 07 నుండి 15 వరకు



08-10-2021
శుక్రవారం
రాత్రి: హంసవాహనం



09-10-2021
శనివారం
పగలు: సింహవాహనం



09-10-2021 శనివారం
రాత్రి: ముత్యపుపందిరివాహనం



10-10-2021 ఆదివారం
పగలు: కల్పవృక్షవాహనం



తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2021 అక్టోబరు 07 నుండి 15 వరకు



10-10-2021
ఆదివారం
రాత్రి:
సర్వభూపాలవాహనం

11-10-2021
సోమవారం
పగలు: పల్లకీలో
మోహినీఅవతారోత్సవం





తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2021 అక్టోబరు 07 నుండి 15 వరకు



**12-10-2021**
**మంగళవారం**
**పగలు:**
**హనుమద్వాహనం**



**12-10-2021**
**మంగళవారం**
**రాత్రి:**
**గజవాహనం**



తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2021 అక్టోబరు 07 నుండి 15 వరకు



**13-10-2021**
**బుధవారం**
**రాత్రి:**
**చంద్రప్రభవాహనం**

**13-10-2021**
**బుధవారం**
**పగలు:**
**సూర్యప్రభవాహనం**






# ఆధునిక ఆళ్వార్.. శ్రీవేంకటేశ్వరభక్తిఛానల్

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

ఇప్పుడున్న పరిస్థితులలో ప్రసారసాధనాలలో టెలివిజన్‌లకున్న ప్రాచుర్యం, ప్రాభవం ఇతర ఏ ప్రసార సాధనాలకు లేవనడం అందరూ అంగీకరించిన సత్యం. టెలివిజన్‌లు బహుళప్రయోజనాత్మకాలు. చిరుప్రాయంవారి నుండి శతాధికవృద్ధుల వరకు టి.వి.లు, ఆయావ్యక్తుల అభిరుచుల కనుగుణంగా ఆనందాన్ని, జ్ఞానాన్ని, అనేకాంశాల పట్ల అవగాహనను కలిగిస్తున్నాయనడంకూడా నిజమే! టి.వి.లు కొన్నిప్రభుత్వాధీనాలు. కొన్నిసంపాదనకారకాలు. కొన్ని వ్యాపార ప్రచారాలకు కేంద్రాలు.

ఇలా గాక, ఒక ఆధ్యాత్మికసంస్థ నిర్వహిస్తున్న ఒకే ఒక టీ.వీ.ఛానెల్ **శ్రీవేంకటేశ్వరభక్తి ఛానల్.** తిరుమలతిరుపతి దేవస్థానం పాలకమండలి, ప్రభుత్వానుమతితో స్థాపితమైన ఛానల్ ఇది. ప్రారంభమైననాటినుండీ "ఇంతింతైవటుడింతయై అన్నట్లు బ్రహ్మాండాంతసంవర్ధిగా" వర్ధిల్లుతున్న ఛానల్ ఇది. ఏడుకొండల స్వామి పిలిస్తే పలికేదైవం. గోవిందా! అంటూ గొంతెత్తి పిలిస్తే చాలు!! తనభక్తులబాధలు తీర్చటానికి స్వయంగా ఏడుకొండలు దిగివస్తాడు. అంతటి ఆర్తత్రాణపరాయణుడు శ్రీవేంకటేశ్వరుడు. ఆ స్వామి లీలలు అనంతం. ఆ స్వామివైభవం అమోఘం.

ఇంతటి సమున్నతమైన స్వామివైభవాన్ని చూడటానికి వెయ్యికళ్ళున్నా ఇంకా ఏదో అసంతృప్తి మిగులుతూనే ఉంటుంది. కోటిసూర్యుల వెలుగులతో, బ్రహ్మాండమంతా నిండినతేజస్సుతో చూడగానే ఇట్టే ఆకర్షించే సమ్మోహనశక్తితో ఆనందనిలయంలో కొలువైనస్వామిని ఎన్నిసార్లు చూచినా, ఎంతసేపు చూచినా తనివితీరదు. ఇంకాఇంకా ఆ ముగ్ధమనోహరస్వామిని చూస్తూనే ఉండా లనిపిస్తుంది. శతకోటిమన్మథాకారుడైన స్వామిని కళ్లలో బంధించి, గుండెల్లో కొలువు కట్టి శాశ్వతంగా తనవాడిని చేసుకోవాలని ప్రతిభక్తుడూ కోరుకుంటాడు. బంగారువాకిలి ముందు అలాగే నిలిచి ఉండి, స్వామిని కన్నులారాచూస్తూ రోజంతా కాదు కాదు.. జీవితమంతా గడిపేయా లని ఉంటుంది.

శ్రీవారిభక్తులకు ఇది సర్వసాధారణమైన కోరికే. కానీ వాస్తవంలో ఇది సాధ్యమా? కోట్లాదిభక్తులు తిరుమలగిరులకు చేరుకుంటూ, "ఏడుకొండల వాడా! వేంకటరమణా! గోవిందా!" అంటూ శ్రీవారినామస్మరణ చేస్తూ స్వామిదర్శనంకోసం నిరీక్షిస్తుంటారు. ప్రతిభక్తుడూ స్వామిని చూస్తూ అలాగే నిలబడి ఉండా లని కోరుకుంటాడు. మరోపక్క స్వామిని దర్శించు కోవాలనే కోరిక క్షణం నిలబడకుండా చేస్తున్నా, అనారోగ్య కారణాలవల్లనో, మరే ఇతరకారణాలవల్లనో

గడపదాటి కొండకు రాలేని పరిస్థితుల్లో లక్షలాదిభక్తులు స్వామి నామాన్నే జపిస్తూ, స్వామిలీలల్ని తలచుకుంటూ ఉంటారు. ఇన్ని కోట్లమందికి శ్రీవారిదర్శనం అదికూడా తనివితీరేదాకా. జగన్మోహనాకారుడైన స్వామిని ఎంతసేపు చూస్తే తనివితీరు తుంది? కానీ భక్తులకోణంలో ఇది చాలా సమంజసమైనకోరిక.

మరోకోణంలో తిరుపతియాత్ర కేవలం స్వామిదర్శనం కోసమేనా... అంటే పూర్తిగా అదీ కాదు. అత్యంతప్రధానమైన స్వామిదర్శనంతో పాటు అనేకఅద్భుతాలకు నెలవైన తిరుమల తిరుపతి ప్రాంతంలోని అణువణువునీ దర్శించుకుంటూ, స్వామి స్పర్శతో ధన్యత పొందిన ప్రతిప్రాంతాన్నీ శ్రీవారిరూపంగా చూచు కుంటూ ఆ మహనీయమధురభావాలను గుండెల్లో పదిలం చేసుకోవాలనికూడా భక్తులు ఉవ్విళ్లూరుతుంటారు. భక్తుల కోణంలో ఇదీ సమంజసమైన అంశమే!

కానీ... తి.తి.దేవస్థానం ఇన్నికోట్లమందిభక్తులకు అన్నిసౌకర్యాలు కల్పిస్తూ, వారికి సంతృప్తి కలిగేలా శ్రీవారి దర్శనంతో పాటు పరిసరపుణ్యక్షేత్రాలనుకూడా దర్శనం చేయించడమంటే... మాటల్లో చెప్పినంత తేలిక కాదు. కానీ, ఇదంతా దేవస్థానానికి ప్రాథమికబాధ్యత.

***తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎంతకష్టమైనా, నష్టమైనా శ్రీవారిభక్తులసేవ తప్ప దేవస్థానానికి మరొక ధ్యాస ఉండదు.***

నేరుగా కొండకు చేరుకున్న భక్తులు ఏదోవిధంగా స్వామిని దర్శించుకుని యాత్ర పూర్తి చేసుకుంటారు. కానీ, నేరుగా కొండకు రాలేని భక్తుల పరిస్థితి ఏమిటన్న ఆలోచన తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలివర్గంలో తీవ్రమైన ఆలోచన రేకెత్తించింది.

కొండకు వచ్చినా, రాకపోయినా ప్రతి భక్తుడికీ స్వామి దివ్యవైభవాన్ని అందించాలనే సంకల్పం ధర్మకర్తలలో, అధి కారుల్లో కలిగింది.

ఈ ఆలోచనల సాగరమథనఫలితమే శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్‌కు అంకురార్పణ చేసింది. యుద్ధప్రాతిపదికమీద కార్యక్రమాలు పూర్తి చేసుకొని 07-04-2008న సర్వధారి ఉగాదినాడు శ్రీవారిఆలయం ఎదుట ఉదయం 11.45 గంటలకు గోవిందనామస్మరణలనడుమ పూజలు నిర్వహించి ఎస్వీబీసీ పరీక్షా ప్రసారం సిగ్నల్ ప్రసారానికి శ్రీకారం చుట్టారు.



శ్రీరంగరామానుజ పెద్దజియ్యర్ స్వామివారు దీన్ని ప్రారంభిం చారు. ప్రపంచం నలుమూలల్లోని శ్రీవారిభక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూచిన క్షణం అపూర్వమై శ్రీవారిఆశీర్వాదమై సాక్షాత్కరించింది.

నాటి ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖరరెడ్డి తి.తి.దే. భక్తి ఛానల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, అప్పటి తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులుగా ఉన్న సమయంలో 07-07-2008న అప్పటి రాష్ట్రపతి ప్రతిభాదేవిసింగ్ పాటిల్ ఎస్వీబీసీని ప్రారంభించారు.



సరిగ్గా 13 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎస్వీబీసీని శ్రీవారి వైభవాన్ని ప్రతి గుండెకు, ప్రతి గడపకూ చేర్చటానికి దిగివచ్చిన ఆధునిక ఆళ్వార్‌గా అభివర్ణించవచ్చు. ఎస్.వి.బి.సి. ఛానల్‌గా సంక్షిప్తరూపంలో అందరికీ సుపరిచితమైన శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ ఇప్పుడు తెలుగుబుల్లితెరకార్యక్రమాల్లో ఓ ప్రభంజనం సృష్టించింది. ఆధ్యాత్మికప్రసారాల విభాగంలో నవశకానికి నాంది పలికింది.

తిరుమలగిరిపై స్వామికి నిత్యం పదులసంఖ్యలో కైంకర్యాలు జరుగుతుంటాయి. సుప్రభాతసేవ మొదలు పవళింపుసేవ వరకు ఎన్నో సేవలు. ప్రత్యేకతిథులు, పండుగలు, బ్రహ్మోత్సవాలు తదితరరోజుల్లో మరిన్ని ప్రత్యేకపూజలు, సేవలు. ఇవన్నీ వేటికవే ప్రత్యేకం. నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలు ఈ స్వామి అమృతవైభవానికి నిదర్శనాలు. కలియుగ వైకుంఠంగా తిరుమలను నిలిపిన వైభవదీపికలు.

శ్రీవారిఆలయం ఆనందనిలయంలో జరిగే ప్రతి సేవనూ భక్తులకు చేరువచేయాలనే సంకల్పంతో ఎస్వీబిసిలో స్వామివారి నిత్యార్చనలతో సహా ప్రతి ప్రత్యేక అర్చనను ప్రసారం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆగమనియమాలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా నమూనాఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించి, అందులో కొండమీద శ్రీవారిమూల మూర్తికి జరిగే అర్చనలన్నిటినీ జరిపించి, వాటిని చిత్రీకరించి ప్రసారం చేశారు. నిజంగా ఇదొక అద్భుతం!





శ్రీవారిపూజల పేర్లు వినటమే తప్ప అన్నిపూజల్లో పాల్గొన్న లేదా చూచే అవకాశం భక్తులందరికీ రాదు. ఎస్వీబీసీ పుణ్యమా అని శ్రీవారికి జరిగే ప్రతిసేవనూ తనివితీరా చూచే అవకాశం భక్తప్రేక్షకులకు కలిగింది. కేవలం పూజల దృశ్యాలను ప్రసారం చేయటమే కాకుండా ఆయా అర్చనల్లోని విశేషాలను అర్చకస్వాములు, ఇతర ఆగమపండితులచేత వివరింపజేయిస్తూ చేసిన ప్రసారం శ్రీవారిభక్తులకు నిజంగా ఓ అపురూపవరమనే చెప్పాలి. అర్చనల్లోని అంతరార్థాన్ని తెలుసుకుని మరీ వాటిని నేరుగా చూచిన కళ్లదే కదా భాగ్యమంటే!

ఎస్వీబీసీ చేసిన అనేక వినూత్నప్రయోగాల్లో **శతమానం భవతి** కార్యక్రమం విశేషంగా భక్తుల్ని ఆకట్టుకుంది. పుట్టినరోజు, వివాహదినోత్సవం తదితరశుభకార్యక్రమాల్లో ప్రేక్షకులకు శ్రీవారిఆస్థానపండితులచేత ఆశీర్వచనాలు అందజేస్తూ, శ్రీవారి ప్రసాదాన్ని తపాలాద్వారా ప్రేక్షకులకు పంపించటం ఎస్వీబిసి సాధించిన అపూర్వవిజయం. లక్షలాదిప్రజలు తమ పుట్టిన రోజు, పెళ్లిరోజు తదితర సందర్భాల్లో శ్రీవారిఆశీస్సులు అందుకుని ఎంతగానో మురిసిపోతుంటారు.


తిరుమలస్వామి కల్యాణమూర్తి. నిత్యకల్యాణం పచ్చతోరణం అనే నానుడికి తిరుమలస్వామికోవెల ప్రత్యక్ష (ప్రతి అక్షర) నిదర్శనం. కొండలరాయడికి నిత్యం కల్యాణోత్సవం జరుగుతుంది. ఉభయదేవేరులతో స్వామి జరుపుకునే ఈ కల్యాణోత్సవం భక్తుల నయనోత్సవంగా సాగుతుంది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబిసి ప్రత్యక్షప్రసారం చేయటంతో పులకించని భక్తుల హృదయం లేదు. తమ ఇంట్లోనే స్వామికల్యాణం జరుగుతోందన్నంత సంతృప్తిని ఎంతోమంది భక్తులు వ్యక్తం












చేశారంటే ఈ కార్యక్రమం పొందిన ప్రజాదరణ ఏమిటో మనం అర్థం చేసుకోవచ్చు.

శ్రీవేంకటేశ్వరునివైభవం వర్ణించటానికి నాలుగుముఖా లున్న బ్రహ్మకుసైతం సాధ్యం కాదంటారు. అర్చనలతో పాటు కళానీరాజనాలు అందుకోవటం తిరుమలస్వామిప్రత్యేకత. ఇందుకోసం ఎస్వీబిసి ప్రత్యేకంగా రూపొందించిన కార్య క్రమం నాదనీరాజనం. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధకళా కారులు తమ సంగీత, నృత్య, భజన, సంకీర్తనకార్యక్రమా లతో స్వామికి అర్చన చేసే కళానివేదనకు వేదిక ఈ కార్య క్రమం. నాదనీరాజనం పేరుతో ప్రత్యేకంగా ఓ వేదిక నిర్మించి, దానిమీద నిత్యం సాయంకాలంవేళ కార్యక్రమాలు నిర్వహిస్తూ, వాటిని ప్రత్యక్ష ప్రసారం చేయటం ఈ కార్యక్రమవిశేషం.



అంతర్జాతీయవేదికలమీద ప్రదర్శన ఇచ్చిన కళా కారులుకూడా తిరుమల నాదనీరాజనం వేదికమీద ప్రదర్శన ఇవ్వటానికి అవకాశం వస్తే ఎంతో గొప్పగా చెప్పుకుంటారు. ఆనందంతో పొంగిపోతారు. నెలలతరబడి ఈ అవకాశం కోసం ఎదురుచూస్తుంటారు. ఇక, ఇళ్లల్లో అయితే కేవలం నాద నీరాజనంకోసమే ఆ సమయంలో అన్నిపనులు మానుకుని టీవీల ముందు కూర్చునే అభిమానప్రేక్షకులు వేలాదిగా ఉన్నారు. ఎస్వీబిసి సాధించిన విజయాలపరంపరలో ఈ కార్యక్రమం కూడా ఒకటి. నాదనీరాజనం స్ఫూర్తితో దాదాపు ఇదే తరహా కార్యక్రమాలు రూపొందించి, ఇతరఛానళ్లు ప్రసారం చేశాయంటే ఈ కార్యక్రమం సృష్టించిన ప్రభంజనం ఎటువంటిదో మనం తేలికగా అర్థం చేసుకోవచ్చు.

ఇంకా ఇతరదేవాలయాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్య క్రమాలతో కూడిన కార్యక్రమాలు, పురాణప్రవచనాలు, కావ్య ప్రబంధాల నేపథ్యంలో సాగే ధారావాహికలు... ఒకటా రెండా పదుల సంఖ్యలో కార్యక్రమాలు ఈ ఛానల్ద్వారా ప్రసారమై భక్తులు ధర్మమార్గంలో నడిచేందుకు దోహదం చేశాయి. వారి హృదయాల్లో ఆధ్యాత్మికవెలుగులు నింపాయి.

సనాతనకార్యక్రమాలు, శ్రీవారిఅర్చనలతో పాటు ఇతరదేవస్థానాల బాధ్యత కూడా తి.తి.దే తీసుకుంది. ఇతర దేవాలయాల్లో జరిగే పూజాకార్యక్రమాలు, ప్రత్యేకఉత్సవాలు, యాగాలు, కంచి, కుర్తాళం తదితరపీఠాధిపతులతో ముఖా ముఖి, ధర్మసందేహాలు మొదలైనవాటినికూడా ఎస్వీబీసీ ప్రచారం చేసింది. ప్రతి కార్యక్రమం దేని కదే భిన్నంగా, వైవిధ్యభరితంగా సాగుతూ ప్రేక్షకుల ఆదరణ పొందింది.

మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు నిత్యనూతనకార్యక్రమాలు తయారుచేయటం ఎస్వీబీసీ ఛానల్ ప్రత్యేకత. ప్రేక్షకుల ఆదరణ పొందటంమాత్రమే కాదు... వారిని జాగృతపర చటంకూడా తన బాధ్యతగా గుర్తించింది. ఇందుకోసమే కరోనాసమయంలో భక్తులందరికీ దైవశక్తి మరింతగా అందాలనే ఆశయంతో, విశ్వశ్రేయస్సు అనే సంకల్పంతో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారంచుట్టింది.

కరోనా మహమ్మారిప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా మీడియారంగం తీవ్రసంక్షోభంలోకి వెళ్తే... శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్మాత్రం ఆర్థికపరిపుష్టితో పాటు విస్తృతమైన రేటింగ్ పెంచుకుంది. భక్తిఛానళ్లలో నంబర్వన్గా కొనసాగు తోంది.



## సుందరకాండ పారాయణం

రామాయణం ఆదికావ్యం. రాముని అవతారం మానవ జాతికి అత్యంత సన్నిహితమైంది. ఒక్కొక్క గ్రంథంలో కొన్నికొన్ని భాగాలు మహాశక్తిమంతమై జాతిని సుఖసంతోషాలతో ప్రశాంతంగా జీవింపజేస్తాయి. ఈ కోణంలో రామాయణంలో సుందరకాండ, భారతంలో విరాటపర్వం, భాగవతంలో దశమ స్కంధం, భగవద్గీతలో పురుషోత్తమప్రాప్తియోగం మొదలైనవి ప్రసిద్ధికెక్కాయి. సుందరకాండవిషయంగా ఆలోచిస్తే మానవులు సుఖదుఃఖాలను, సంయోగవియోగాలను సమానంగా భావిస్తూ ఉత్తమభావాలతో పవిత్రఆశయాలతో ద్వంద్వాలను జయించి వాటికి అతీతంగా ప్రశాంతంగా జీవించడానికి కావాల్సిన ఉత్తమసాధనసంపద సుందరకాండలో పుష్కలంగా ఉంది.

దీన్ని దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయవిపత్తుగా మారి సర్వమానవాళినీ కబళిస్తున్న కరోనా మహమ్మారి మొదలైన భయంకరవ్యాధులనుండి మానవులు బయటపడడానికి ధైర్యమొక్కటే మహావైద్యం.



ఆ వైద్యాన్ని హనుమంతుడు సీతకు ప్రబోధించాడు. అతడు గురుస్థానీయుడు. మహాధైర్యవంతుడు. కనుకనే రాక్షసజాతితో పోరాడి స్వార్థానికి, స్వసుఖాలకు బానిస అయిన రావణుడికి బుద్ధిచెప్పి, అతణ్ణి సంహరించడానికి కావాల్సిన మార్గాలన్నీ చక్కగా ఏర్పాటు చేసి వచ్చాడు. ఇక్కడ సీత ప్రధానపాత్ర. ఆమె ధైర్యమే ఆమెను రక్షించింది. కనుక మానవులుకూడా కష్టసుఖాల్ని ధైర్యంతో ఎదిరించి, భక్తిప్రపత్తులతో భగవంతుణ్ణి ప్రార్థిస్తే బాధలన్నీ తొలగి దేశమూ, స్వరజీవులూ సుఖశాంతులతో ఉంటారు. ఇది మన సనాతనసంప్రదాయం. ప్రత్యేకించి ఇందులోని ఒక్కొక్క సర్గకూడా మానవజాతికి ఎలా రక్షణ కవచమౌతుందో పెద్దలు సూచించి ఉన్నారు. కనుక ప్రతిసర్గ మానవుణ్ణి ఉన్నతదశకు చేర్చేదే!




పేరునుబట్టి ఇది హనుమంతుడి దనుకుంటాం. సత్యం శివం సుందరం అని పరమాత్మునిగూర్చి చెప్పారు గనుక పరమాత్మతత్త్వాన్నికూడా చక్కగా వివరించేందుకు సుందరకాండ అనుసంధానంగా ఉంటుంది.

కరోనా సమయంలో ప్రధానంగా సుందరకాండ పారాయణ చేపట్టి, ప్రజలం దరిలో ఉన్న అభద్రతాభావాన్ని తొలగించేందుకు నడుంబిగించింది. 'బుద్ధి ర్బలం యశో




చిత్తంబు రంజిల్ల శ్రీవారిసేవల
కనులార చూడంగ కలుగు టెట్లు?
వీనులవిందుగా వేదమంత్రంబులు
విశదమౌ రీతిలో వినుట యెట్లు?
నాదనీరాజన నవ్యవేదికమీద
కళలవిన్యాసాలు గాంచు టెట్లు?
తిరుమల కొండల తీర్థరాజంబుల
సుందరదృశ్యాలు చూచు టెట్లు?

సప్తగిరులపై సౌకర్య సరణి లెట్లు?
వేంకటేశ్వరు దర్శించు విధ మదెట్లు?
అనుచు ప్రశ్నించుభక్తుల ఆర్తి,
సకలసందేహములు తీర్చు సాధనంబు
ఎస్వీబీసీని చూడరే ఎలమితోడ.

ఆర్థికసంపత్తితో నిమిత్తం లేకుండా భక్తులందరికీ శ్రీవారి సేవలను దర్శించా లని ఉంటుంది. శ్రీవారి మ్రోల భక్తితో మోకరిల్లా లని ఉంటుంది. అయితే అనేక కారణాల వల్ల అందరికీ అది సాధ్యం కాకపోవచ్చు.

కాలు కదపకుండా, నయాపైసా కూడా ఖర్చులేకుండా ప్రతిభక్తుడు తన ఇంట్లో కూర్చుని, శ్రీవారికల్యాణం. డోలోత్సవం తదితర ఉత్సవాల ప్రత్యక్షప్రసారం తిలకించవచ్చు. తిరుమలలో జరిగే ఉత్సవం నేరుగా మన ఇంటికి వస్తుంది. శ్రీవారి ఆశీస్సులు తెస్తుంది. శ్రీవారి సుప్రభాతంనుండి, ఏకాంతసేవవరకు అన్ని ఉత్సవాలను ప్రత్యేకమైన ఆలయపు సెట్లువేసి గర్భాలయంలో జరిగే విధంగా యథాతథంగా చిత్రీకరించి ప్రేక్షకులకు అందిస్తున్న అపురూపఛానల్ '**శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్**'.

శ్రీవారి భక్తుల చరిత్రలు, తిరుమల చరిత్ర, తిరుమల విశేషాలు, భక్తులకు కావలసిన సమాచారం ఇలా సమస్తం మన ఇంట్లో కూర్చుని మనం తెలుసుకునే వీలు ఈ ఛానల్ వల్ల కలిగింది.

ధైర్యం నిర్భయత్వం అరోగతా...'– హనుమంతుణ్ణి స్మరిస్తేనే ఇన్నిశక్తులు కలుగుతా యని శాస్త్రాలు చెబుతున్నాయి. అలాంటిది పూర్తిగా హనుమత్‌శక్తి సంపన్నమైన సుందరకాండను పండితులచేత పారాయణం చేయించి, నేరుగా భక్తులతోనూ పారాయణం చేయిస్తూ, ఆయా శ్లోకాల వెనుక ఉన్న భావాన్ని, భావనాబలాన్ని వివరంగా విశ్లేషణ చేయిస్తూ సాగిన ఈ కార్యక్రమం ఓ ప్రభంజనం సృష్టించింది.

ఎప్పటికప్పుడు ఎస్వీబిసి సరికొత్తగా, వినూత్నంగా అందిస్తున్న కార్యక్రమాలనూ యావత్ ప్రపంచమూ చూడ్డం, వినడం ద్వారా ఎంతోమంది ఆధ్యాత్మిక అనుభూతిని పొంది, మానసికస్థైర్యాన్ని సాధించుకుంటున్నారు. ఇది నిస్సందేహంగా ఎస్వీబీసీ ఘనత!

సుందరకాండ సంపూర్ణ అఖండ పారాయణదీక్షకు వీక్షకులు, భక్తులనుంచి విపరీతమైన స్పందన వచ్చింది. యూట్యూబ్ లైవ్‌లో 10 వేలమందికి తగ్గకుండా ఈ కార్యక్రమానికి వ్యూయర్‌షిప్ పరంగా తెలుగు భక్తిఛానల్లలో ఎస్వీబిసి మొదటి స్థానానికి చేరుకుంది. ఆయా కార్యక్రమాలు చూచి, అనేకమంది భక్తులు ఛానెల్‌ను ఆర్థికపరిపుష్టి వైపు పరుగులు తీయించాలనే ఆలోచనతో తి.తి.దే. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఉత్తమకార్యక్రమాలు చేపట్టి మానవజాతికి ధార్మిక, ఆధ్యాత్మికశక్తిని ప్రసాదించడంలో, ప్రబోధించడంలో ఉత్తమపాత్ర పోషిస్తుం దని ఆశిద్దాం!

ఇంకా భగవద్గీత, రామాయణం, యోగవాశిష్ఠం పారాయణం, ప్రవచన శ్రావ్య దృశ్య కార్యక్రమాలు కూడా కోవిడ్ సమయంలో భక్తులకు ఆధ్యాత్మికశక్తిని అందించి, వారిలో మనోధైర్యాన్ని ఇనుమడింపజేశాయి. మొత్తంగా ఎస్వీబిసి ఛానల్ ఆధ్యాత్మిక టెలివిజన్ రంగంలో ఓ ధ్రువతారగా వెలుగుతోం దని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఎస్వీబిసి ముఖ్యోద్దేశం సనాతనధర్మాన్ని విభిన్న రీతులలో జనరంజకంగా, ఆకర్షణీయంగా, అన్వర్థకంగా, లాభాపేక్ష లేకుండా హైందవులకు అందించడం– ఈ ఛానల్ ముఖ్యోద్దేశం.

ఈ ఛానల్ కార్యక్రమాలు ఆకర్షకం కావడం వల్లనే సంపన్నులు, వదాన్యులు, సంగీత సాహిత్యప్రియులు, ఉదయించే సూర్యుడివంటి యువకులతో పాటు, ప్రాయపు ప్రొద్దు పడమరకు తిరిగిన వారు ఈ ఛానల్ కార్యక్రమాలకు ఆకర్షితులై లక్షలు, కోట్లు తమ వంతుగా విరాళాలుగా పంపడం ఇటీవలి కాలంలో ప్రత్యేకించి కరోనాకాలంలో అందరూ ముక్కున









వేలేసుకుని ఆశ్చర్యపడే అంశం. ఇందుకు తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి చొరవ, చిత్తశుద్ధి చాలావరకు కారణ మనక తప్పదు.




ఎంత ఆనందం, ఎంత అదృష్టం, శ్రీవారిఉత్సవాలు నేరుగా మనఇంటికి రావడంకన్నా మహాభాగ్యం మరేముం టుంది? కరుణాసముద్రుడు, కోర్కెలు తీర్చే కోనేటిరాయడు, ఆపదమ్రొక్కులవాడు. కలియుగంలోని జనుల్ని కరుణించడానికి ఎస్.వి.బి.సి. రూపంలో వచ్చాడు. ప్రతిఇంటిని దేవాలయం చేస్తున్నాడు. తిరుమలను మనముందు ఆవిష్కరిస్తున్నాడు.




ఇప్పటికే దేశవిదేశాలలోని వేలాదిమందిభక్తులు శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రసారాలనాణ్యతగురించి ప్రసంశలు కురిపిస్తున్నారు. ఇంత మంచికార్యక్రమాలను రూపుదిద్దిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

దీపాలు అనేకరకాలు. కొన్నిదీపాలు చేతపట్టుకునేవారికి మాత్రమే వెలుగునిస్తాయి. గదిలోని దీపం గదిలోనివారికిమాత్రమే వెలుగునిస్తుంది. వీధిదీపాలు వీధివరకే వెలుగు నిస్తాయి. కానీ, 'శ్రీవేంకటేశ్వరదీపం' సర్వలోకాలనూ, సర్వజనులనూ సంరక్షిస్తుంది. ఆ దీపంలోని ప్రధానకళిక ఎస్వీబీసి. ఈ దీపకళికలు స్వామిగర్భాలయంలో వెలిగే దీపాల్లాగా ఎప్పుడూ వెలిగేవి!



శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ వీక్షించండి. శ్రీవారి వైభవం నేరుగా దర్శించండి. మీ ఇంటిని ఆలయంగా, మీ హృదయాన్ని శ్రీవారిసింహాసనంగా చేసి, కొండలరాయని కొలవండి. అడగకుండానే అన్నివరాలు ఇచ్చే స్వామికి చెందిన అన్ని ఉత్సవాలను సంవత్సరం పొడుగునా దర్శించి తరించండి.

వైకుంఠంమీద విరక్తి చెంది వేంకటాద్రి చేరిన గోవిందుణ్ణి మనమంతా ఎలా–ఎంత తన్మయంగా కొలచు కోవాలంటే– ఆయన మనమనస్సులో నివాసం ఉండాలి. అందుకు మార్గం ఈ *శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్.*



# తిరుమలలో 'తులాభారం'

– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

కలియుగప్రత్యక్షదైవమైన తిరుమలేశునికరుణా కటాక్షాలకోసం భక్తులు అనాదికాలంనుండి ఎన్నో కైంకర్యాలు చేయడం, మొక్కులు తీర్చుకోవడం, ముడుపులు చెల్లించడం, నిలువుదోపిడుల రూపాన సర్వస్వం హుండీలో సమర్పించడం, తలనీలాలు సమర్పించడం, అంగప్రదక్షిణలు చేయడం మనలో చాలామందికి తెలిసిన అంశాలు. వీటితో బాటు 'తులాభారం' సమర్పించడంకూడా ఒకటి. ఇటీవల బాగా ప్రచారమైన మొక్కులలో ఇదొకటి.

కొలమానాలలో 'త్రాసు' ఒకటి. త్రాసు శబ్దానికి పర్యాయపదాలుగా ఏషణి, కాటా, కుడుక, తక్కెడ, తరాజు, తునికోల, తుల, ద్రవయం, ధటకం, ధటం, మాయ్యం లాంటివి ఉన్నాయి. వీటిలో త్రాసు, తక్కెడ, తరాజులకు వ్యాప్తి ఎక్కువ.

తుల శబ్దానికి తూచడ మని ఒక అర్థం. ఈ శబ్దవ్యాప్తి భారతంలోను, గ్రామనామాలలోను లేకపోలేదు. 'తూచడం' అనే అంశం ఆళ్వారులలో తిరుమళిశై ఆళ్వార్ చరిత్రలో కన్పిస్తుంది. సప్తర్షులు బ్రహ్మదేవునిదగ్గరికి వెళ్లి, తపస్సు చేసుకోవడానికి అనువైనస్థలం సూచించమన్నారట! బ్రహ్మ ఒక త్రాసును తెప్పించి, సమస్తభూమండలాన్ని ఒక వైపు. విదేహప్రాంతాన్ని ఒకవైపు ఉంచి తూచాడట. త్రాసుముల్లు 'విదేహప్రాంతానికి' మొగ్గు చూపిందట! అదే మహీసారపురం. చెన్నై దగ్గరలోని 'తిరుమళిశై' గ్రామం.

పౌరాణిక కథలను పరిశీలిస్తే సామాన్య జనులకు 'శిబి చక్రవర్తి' త్రాసులో తూగడం తెలిసిన అంశం. శిబి శరణాగత పాలకుడు. అతణ్ణి పరీక్షించాలని ఇంద్ర, అగ్నిదేవతలు అనుకున్నారు. ఇంద్రుడు డేగ అయ్యాడు. అగ్ని పావురమయ్యాడు. డేగ పావురాన్ని తరిమేలా వచ్చారు. డేగ శిబితో 'నా ఆహారం పావురం. వదలిపెట్టు' అని వాదులాడింది. శిబి నా శరణార్థిని వదలనన్నాడు. వేరే మరేదయినా కోరుకో అన్నాడు. పావురం బరువుతో సమానమైన నీ ఒడలి మాంసం ఇస్తే చాలన్నది. శిబి సరేనన్నాడు. త్రాసు తెప్పించాడు. తన ఒడలి మాంసం కోసి తక్కెడలో పెట్టాడు. కానీ సరిపోలేదు. చివరకు తానే కూర్చొన్నాడు. శిబిచక్రవర్తి కూర్చొన్న తట్టకు 'సిబ్బె' అనే పేరు స్థిరపడింది. శిబి ప్రజల నోట చిరంజీవి అయ్యాడు. ఈ కథలో ఆత్మార్పణం, శరణాగతరక్షణ ప్రధానాంశాలు.

భారతీయుల 'కాలగణన' చాల చిత్రమైంది. పాశ్చాత్యులు మెచ్చుకున్న అంశాలలో ఒకటి. సంవత్సరంలోని మాసాలలో తులామాసం ఒకటి. రాశులలో తులారాశి, అలాగే లగ్నాలలో తులాలగ్నం. ఆలయకైంకర్యాలలో వీటికి ప్రాధాన్యం. దక్షిణభారతదేశంలో 'కుంభకోణం' ఆలయాలకు ప్రసిద్ధి. అలాగే అక్కడున్న ఇరవై ఎకరాల పెద్ద తటాకం, నగరం మధ్యలోని విశిష్టతటాకం. ఈ తటాకం చుట్టూ పదహారు మండపాలున్నాయి.

తిరుక్కుడందైలో 'తులాపురుషదానం' ప్రసిద్ధం. శ్రీకృష్ణదేవరాయలు, అలాగే నాయకరాజులు ఈ వైభవోత్సవంలో పాల్గొని, నిలువెత్తు స్వర్ణమణిమయ దానాదులు ఆలయాభివృద్ధికోసం చేశారు. రాయలు తిరుమల ఐదవ యాత్రలో కొండవీడు విజయానంతరం అమరేశ్వరం దర్శించి తులాపురుషాదిదానాదులు చేశాడు. ఆ సందర్భంలో రాయల దేవేరులుకూడా పాల్గొని, దానాదులు చేసినట్లు ఆధారాలున్నాయి.

## మన భద్రతే సామాజిక భద్రత!

**తిరుమల క్షేత్రానికి వచ్చే భక్తులు ఈ క్రింది జాగ్రత్తలను తీసుకోవడం మంచిది.**

- **దర్శన సమయానికి మూడురోజుల ముందు కోవిడ్-19 పరీక్షలు చేయించుకోండి.**
- **అందులో నెగిటివ్ వస్తేనే ప్రయాణం చేయండి. ఇది మన భద్రతే కాక, సామాజిక భద్రత కూడా!**
- **తిరుమలకు వచ్చేటప్పుడు నెగిటివ్ సర్టిఫికేట్ తీసుకు రావడం శ్రేయస్కరం.**
- **వ్యాక్సిన్ వేయించుకుని ఉంటే ఆ ధృవీకరణ పత్రాలు కూడా వెంట తీసుకురండి.**

కాలక్రమేణ ఆలయాలలో, అంతఃపురాదులలోనూ 'తులాభారాదులు' జరిగే వని చెప్పవచ్చు. ఇందుకు ఉదాహరణం శ్రీకృష్ణ



తులాభారం. కృష్ణుణ్ణి నారదునికి దానం చేయదంలాంటిది. ఆంధ్రులకు చాల ఇష్టమైన సన్నివేశ మిది.

ఇవే తరువాతి కాలంలో పరమేశ్వరార్పితంగా, ఒక మొక్కుబడిగా మారిం దని కొందరితలంపు. ఈ తులాభారం వైష్ణవాలయాలలో నేడు విస్తరించింది. ప్రధానంగా సంతానాపేక్షులు మొక్కుకొని, సంతానం బరువుకు తగ్గట్టు 'నాణేలు' అర్పించడం ఒక రకమైతే, తిరుమలకు విచ్చేసి తులాభారంలో బిడ్డను ఒకవైపు ఉంచి అందుకు తగిన నాణేలు తూచి, స్వామికి సమర్పించి ఈనాటి నుండి నా బిడ్డదని స్వీకరించడం విశేషం. కొందరు వస్తువిశేషాలనుకూడా తూకానికి సమర్పిస్తే చాలనే వారున్నారు. తులాభారంమొక్కులో భక్తి, కృతజ్ఞత, ఆనందం ఉన్నాయనడం వాస్తవం. తిరుమలలో గరుడకంభం, తీర్థస్థలం, ప్రసాదస్థలంలాంటివి మారినట్లే, తులాభారస్థానంకూడా భక్తజనుల సౌకర్యార్థం మారింది. తి.తి.దే. భక్తులకు తగినట్లు తులాభారసౌకర్యాలు సమకూర్చడం ప్రశంసార్హమయిన అంశం. తలనీలాలు సమర్పించడంలోనూ, తులాభారంలోనూ విశేషార్థా లున్నాయి. మంచీ చెడు ఆలోచనలకు తల కేంద్రం. ఈ కేంద్రంగా మంచిచెడులు ఉద్భవిస్తాయి. చెడును క్షాళితం చేసుకోవడం తలనీలాల సమర్పణలో ఆంతర్యభావం. తలవంచి నమస్కరించడంలో శరణాగతి. ఇకపై మంచి ఆలోచనలతో జీవిస్తా నని చెప్పక చెప్పడం తులాభారం ఆంతర్యం. అలాగే ఆలయ ప్రవేశార్హతను వ్యక్తులు బేరీజు చేసుకోవడానికి, ఒకవేళ పాపిష్ఠి ఆలోచనలుంటే అటువైపు మొగ్గకుండా మంచి ఆలోచలను మళ్లేలా మానసికంగా సిద్ధం కావడమూ కావచ్చు.



తిరుమలలో రోజూ తులాభారాలకు అవకాశం ఉంది. భక్తులు ధనం, కలకండ, బెల్లం, కర్పూరం లాంటివి సమర్పణ గతంలో ఎక్కువ. ప్రస్తుతం ధనాదుల సమర్పణకే భక్తులు సిద్ధపడడం ఒక ప్రత్యేకత. ఏది ఏమైనా సర్వం నీవే అనే శరణాగతిని పెంచేది 'తులాభారం'.

**శ్రీపద్మావతీఅమ్మవారు కొలువైయున్న తిరుచానూరులో కూడా 20-08-2021న ఈ తులాభార మొక్కును ప్రవేశపెట్టారు. భక్తులు ఈ క్షేత్రంలో కూడా తమ మొక్కులు చెల్లించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందవచ్చు.**



# పరంధాముడికి పద్యనైవేద్యమ్

– ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు,
78939 82500



శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద' పీఠికలో శ్రీవేంకటేశ్వరుణ్ణి ఇలా స్తుతించాడు.

ఉ॥ శ్రీకమనీయహారమణిఁజెన్నుగఁ దానును, గౌస్తుభంబునం
దాకమలావధూటియు నుదారతఁ దోపఁ, బరస్పరాత్మలం
దాకలితంబులైన తమ యాకృతు లచ్ఛతఁ బైకిందోప, న
స్తోకత నందుఁ దోఁచె నన, శోభిలు వేంకటభర్తఁ గొల్చెదన్(1-1)

**తాత్పర్యం**

శ్రీమహాలక్ష్మి ధరించిన హారమణిలో శ్రీవేంకటేశ్వరుని మూర్తి, శ్రీవేంకటేశ్వరుని కౌస్తుభమందు శ్రీలక్ష్మీదేవిమూర్తి కనిపిస్తున్నాయి. పరస్పరప్రేమానురాగాలతో వారిరూపాలు అట్లా ప్రతిఫలిస్తున్నట్లుగా ఉంది. అటువంటి శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవిస్తున్నాను అని అంటున్నాడు శ్రీకృష్ణదేవరాయలు.

**విశేషాలు**

ఈ పద్యంలో ఆదిదంపతుల నిద్దరినీ సేవిస్తున్నాను అనకుండా కేవలం శ్రీవేంకటేశ్వరస్వామిని పేర్కొనడంలో తాత్పర్యమేమంటే లక్ష్మి స్వామిశక్తి. ఆమె ఆయనలో అంతర్గతంగా ఉంది. ఆయనను విడిచి ఆమె, ఆమెను విడిచి ఆయన లేరు. ఆయన శ్రీవేంకటేశ్వరుడు. శ్రీతో కూడుకొని ఉన్నవాడు. శ్రీవైష్ణవం తప్ప శ్రీదేవీరహితవైష్ణవం కాదు. రాయలవారిమతం శ్రీవైష్ణవం. అవతారికలో పన్నెండవపద్యంలో విష్ణుమూర్తి "లేము లుడిపెదు లేఁజూపు లేమతోడ"నే ప్రత్యక్షమైనాడు. ఈ సర్వసృష్టి సంహారాదులు ఆమెసంతోషం కోసం ఆయన చేస్తున్నా డని వేదాంతదేశికులు శ్రీస్తవంలో అన్నారు. లక్ష్మిద్వారా భక్తుడు భగవంతుడైన శ్రీమన్నారాయణుణ్ణి దర్శిస్తున్నాడు. కనుక పద్యం "శ్రీ"తో ప్రారంభమైంది. లక్ష్మితో ప్రారంభమైన పద్యం వేంకటేశ్వరస్వామితో అంతం కావడంలోని విశేషమిదే! కనుక "వేంకటభర్తఁ గొల్చెదన్".

"లక్ష్మీనారాయణులు, పార్వతీపరమేశ్వరులు, సీతారాములు, రుక్మిణీశ్రీకృష్ణులు–వీరిని నిత్యదంపతులు, ఆది దంపతు లని పిలుస్తారు. 'నిత్య' మంటే 'ఎల్లప్పుడు' అని అర్థం! 'ఆది' అంటే 'సృష్టిప్రారంభదశనుండి' అని అర్థాలు!

లక్ష్మీనారాయణులు ఆదిదంపతులు, అనడంచేత లక్ష్మిని విడిచి నారాయణుడు, నారాయణుణ్ణి విడిచి లక్ష్మి ఉండరు. ఉండజాలరు. వీరిద్దరిని ఎవరూ విడదీయలేరు. విడదీయడానికి వీలులేని తత్త్వభూమికలో వారున్నారు. దీనినే "అద్వైతస్థితి" అంటారు. అంటే న+ద్వైతమ్= అద్వైతమ్. రెండు కానిది. ఒకటిగానున్న ఏకతత్త్వము. ఇదే 'అద్వైతస్థితి'. దీనినే శ్రీవైష్ణవ సంప్రదాయంలో 'అనపాయినీత్వము', 'అనపాయినిస్థితి' అంటారు. అంటే విడదీయడానికి వీలులేని, వీలుకాని, ఏకస్థితి.

భగవంతుడగు నారాయణునికి ఇష్టమైనదీ, తగినదీ, అయిన స్వరూపం, రూపం, గుణాలు, విభవం, ఐశ్వర్యం, శీలం మొదలైన అపారమైన గొప్పతనంతో కూడిన లెక్కలేని మంగళ గుణగణాలు కలదీ, పద్మవనంలో నివసించేదీ, జ్ఞానం, శక్తి, బలం, ఐశ్వర్యం, వీర్యం, తేజస్సు అనే ఆరుగుణాలు కలది కావటంచే 'భగవతి' అని, నిత్యప్రకాశశీలం గలదీ, నారాయణుణ్ణి ఎల్లప్పుడూ ఎంతమాత్రము ఎడబాయనిదీ (అనపాయినీ) ఎలాంటి దోషాలు లేనిదీ, బ్రహ్మాదిదేవతలందరికీ దేవుడైన నారాయణుని దివ్యమహిషియు (పత్నియు) ఎల్లలోకా

లకు తల్లి! మాకు తల్లి! నిరాశ్రయులకు ఆశ్రయమైనదీ, అయిన 'మహాలక్ష్మి'ని వేరే ఆశ్రయములేని నేను శరణాగతి పొందు చున్నాను! అని రామానుజులవారిశరణాగతిగద్యలోని 'అన పాయినీతత్త్వా'న్నే రాయలు మొదటిపద్యంలో అభివర్ణించాడు. శ్రీవేంకటేశ్వరప్రపత్తిలోని 'ఈశానాం జగతో౽స్య వేంకటపతేః'– అనే శ్లోకంలో వర్ణింపబడిన "తద్వక్షస్థల నిత్యవాసరసికాం" అనే సమాసం రాయలకు స్ఫూర్తి కావచ్చు.

శా॥ బాలార్కాంశువిజృంభితామలశరత్పద్మాక్ష! పద్మా క్షమా
నీళా జాంబవతీశ! యీశబలభిన్నీరేరుహోద్భూత ది
క్పాలామూల్యశిరోమణిద్యుతికనత్పాదాబ్జ! పాదాబ్జఫా
లాలంకారకచావలీమకరదీప్యత్కుండలాంచన్ముఖా! (1–86)

**తాత్పర్యం**

లేతసూర్యుని కిరణాలతో వికసించిన శరత్కాలమందలి పద్మాలవంటినేత్రాలు కలిగినవాడా! శ్రీమహాలక్ష్మి, భూదేవి, నీళా, జాంబవంతులకు భర్తయైనవాడా; రుద్ర, బ్రహ్మ, ఇంద్రాది దేవతల, దిక్పాలకుల కిరీటకాంతులతో ప్రకాశించే పాదపద్మాలు కలిగినవాడా! చవితిచంద్రునివంటి ఫాలభాగాన చక్కని ముంగురులు కలిగినవాడా! మకరకుండలాలతో శోభించే చెవులు కలిగినముఖం కలిగినవాడా!

**విశేషాలు**

ఈ పద్యంలో శ్రీవేంకటేశ్వరునిస్తుతి ఉంది. అయితే అన్నీ సంబోధనలే. శరత్ కాలమందు పద్మంలో ఎర్రనిరేఖలు ఉంటాయి. అట్లే స్వామివారు నేత్రాలయందు ఎర్రని జీరలు కలిగి ఉన్నాడు. ఇంద్రాది దేవతలు, దిక్పాలకులు నిత్యం తమ శిరస్సులను వంచి, శ్రీవారిపాదాలకు నమస్కరిస్తూ ఉంటే వారి కిరీటాలయందుండే రత్నకాంతులతో స్వామివారిపాదాలు ప్రకాశిస్తున్నాయి అని చెప్పడం స్వామివారిమహత్తును చెప్పకయే చెప్పినట్లయ్యింది.

క॥ జలచర, కిటి, హరి, వటు, భృగు–
కుల, రఘుకుల, సీరి, బుద్ధ, ఘోటి, ప్రముఖో
జ్జ్వల జనికృత జనరక్షా!
యలమేల్మంగాభిధేందిరాలయవక్షా! (1–87)

**తాత్పర్యం**

దశావతారాలు ధరించి శిష్టులను రక్షించినవాడు. కలియుగంలో అలమేల్మంగను (శ్రీమహాలక్ష్మిని) వక్షఃస్థలమందు నిలుపుకొన్నవాడు – శ్రీవేంకటేశ్వరుడు.

**విశేషాలు**

ప్రధానంగా దశావతారాల్లో శ్రీకృష్ణావతారం చెప్పబడు తుంది. కొందరు బలరాముణ్ణీ, మరికొందరు పరశురాముణ్ణీ దశావతారాలలో వదలివేస్తారు. అయితే శ్రీకృష్ణదేవరాయలు శ్రీకృష్ణావతారాన్ని సంపూర్ణావతారంగా ఆదినారాయణుని యొక్క సంపూర్ణత్వం శ్రీకృష్ణునిలో ఉందని, భావించియుండవచ్చు. తన కాలమందలి కవులు తనను శ్రీకృష్ణునిఅవతారంగా చెప్పి యుండడం కూడ శ్రీకృష్ణావతారాన్ని చెప్పకపోవడానికి కారణం కావచ్చు.

"అలివేలుమంగ" అన్నది అరవపదం. అలరు+మేలు; అలరు=పద్మం, మేలు=శ్రేష్ఠమైన–అనగా శ్రేష్ఠమైన పద్మం పైనున్న మంగ– అలమేల్మంగ అనగా పద్మాలయ అని భావం.

కం॥ శ్రీనయనకువలయుగళా
నూన జ్యోత్స్నాయితస్మితోజ్జ్వలముఖ! దై
త్యానీత సురశ్రీ పున
రానయనక్రమణ! వేంకటాచలరమణా! (2–1)

**తాత్పర్యం**

శ్రీమహాలక్ష్మి కనులు అనే కలువపూలకు, వెన్నెల వలె లేత నవ్వుతో ప్రకాశించే ముఖం కలవాడు. రాక్షసులు తీసుకొని



పోయిన దేవతల సంపదలను తిరిగి తీసుకొని రాగలగిన పరాక్రమాదులు కలిగినవాడు- శ్రీవేంకటాద్రినివాసుడు.

### విశేషాలు

శ్రీవేంకటేశ్వరునిముఖం ఎపుడూ చిరునవ్వుతో ప్రకాశిస్తూ ఉంటుంది. అందుకే "చెక్కిళ్ళ చిరునవ్వు చిందు లొల్కెడువాడు" అని శ్రీవేంకటేశ్వరుని గూర్చి కవులు వర్ణించారు. "నవ్వుదళుకుపసలువాడు" అనికూడా కవులు అన్నారు. ఆ చిరునవ్వు వెన్నెలవలె ఉంటుంది. చంద్రకాంతికి వికసించే కలువలవలె అమ్మవారికన్నులు ఉన్నాయట. అమ్మవారివిక సించిన నేత్రాలకాంతి, స్వామివారిచిరునవ్వు కలగలసి ఒక వింత కాంతిని ప్రకాశింపజేస్తున్నాయి. ఈ పద్యంలో "క్రమణ" శబ్దం గమనింపదగిఉంది. క్రమణ శబ్దానికి 'నడక' అని అర్థం. అయితే ఇక్కడ అసురులు తీసుకెళ్ళిన సురలసంపదను తిరిగి తీసుకొని రావడానికి తగిన పరాక్రమం కలవాడు అని గ్రహిస్తే అర్థం చక్కగా కుదురుతుంది.

చ॥ యమ నియమాది లభ్య, ద్రుహిణాది జరన్మరుదిభ్య, సంసృతి
శ్రమహరనామకీర్తన, మురప్రవికర్తన, పాతకావలీ
దమన, రమాంగనాకమన, తామరసాయతనేత్ర, భక్త హృ
ద్భ్రమ తృణదాత్ర, భూయువతి రంజన, వర్ణజితాభ్రభంజనా!
(2-98)

### తాత్పర్యం

అంతరింద్రియ, బహిరింద్రియాది నిగ్రహయోగంతో మాత్రమే దర్శింపడానికి వీలైనవాడా, బ్రహ్మాదిదేవతలకు ప్రభువైనవాడా; నామసంకీర్తనతో సంసారబంధాన్ని పోగొట్టే వాడా; మురాసురుని ఖండించినవాడా; పాపసముహాన్ని నాశనం చేయగలిగినవాడా; లక్ష్మి భర్తయైన వాడా; విశాలనేత్రాలు గల వాడా; భక్తుల అజ్ఞానాన్ని తొలగించ గలిగినవాడా; భూదేవి వల్లభా; నల్లనిశరీరవర్ణం కలవాడా!

### విశేషాలు

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధి - అనే ఎనిమిది యోగాంగాలు. ఈ అష్టాంగయోగంతో సాధ్యమయ్యేవాడు భగవంతుడు. ఈ రహస్యం ఈ పద్యంలో చెప్పబడింది.

మాలిని॥ ద్రుహిణజ ముఖమౌనిస్తోమనిస్తంద్ర భాస్వ
ద్ధహర విహరమాణాతామ్రపాదాంబుజాతా!
బహిర బహిరపారప్రాణికోటిప్రపూర్ణా!
మహిమ వినుత వాణీ మాధురీ వేద్యపర్ణా! (2-100)

### తాత్పర్యం

నారదాదిమహామునులు ఎవనిపాదపద్మాలను నిత్య జాగరూకులై హృదయాకాశంలో దర్శిస్తున్నారో, సకలజీవరాశికి బయటా లోపల ఎవడు నిండియున్నాడో, ఎవని మహిమను సరస్వతి గానం చేస్తుంటే, పార్వతి సంతోషిస్తున్నదో, అటువంటి శ్రీవేంకటేశ్వరుడు -

### విశేషాలు

లక్ష్మి హృదయంలో ఉంటే, సరస్వతిగానం చేస్తుంటే, ఆ గానమాధుర్యానికి పార్వతి ఆనందపడుతుంటే- అనే అంశాలు ముగురమ్మల మూలపుటమ్మను గుర్తుచేస్తున్నాయి. పోతనగారు అనిన "మహత్త్వ, కవిత్వ, పటుత్వ సంపదల్ అనే అంశం గుర్తుకు వస్తుంది.

కం॥ శ్రీ క్షితి నీళావర! దను, జోక్ష ప్రాణహర! దంష్ట్రి కోత్కృత్త హిర
ణ్యాక్ష క్షపాచర! కృపా, వీక్షాదృత బాహులేయ! వేంకటరాయా!
(3-1)

### తాత్పర్యం

లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవులకు భర్తయైనవాడు, ఎద్దు రూపమెత్తిన రాక్షసుని సంహరించినవాడు, వరాహరూపమెత్తి కోరలతో హిరణ్యాక్షుని సంహరించినవాడు, దయాదృష్టితో కుమారస్వామిని ఆదరించినవాడు అని నాలుగువిశేషణాలు ఈ పద్యంలో శ్రీవేంకటేశ్వరునికి చెప్పబడినాయి.

### విశేషాలు

లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవులకు భర్త అనే అంశం పురాణ, ఇతిహాసాలలో బాగా చెప్పబడినదే! ఎద్దురూప మెత్తిన రాక్షసుని సంహరించినవాడు-అనే విశేషణం భాగవతంలో ప్రసిద్ధమయ్యింది. కుంభుకు దనువాని కూతురు నీలాదేవి. కొందరు రాక్షసులు ఆబోతు రూపాలు దాల్చి గొల్లపల్లె వాసుల్ని బాధిస్తుంటారు. అపుడు కుంభుడు ఆ రాక్షసుల్ని చంపినవానికి తనకూతుర్ని ఇచ్చి వివాహం చేస్తా నని ప్రకటిస్తాడు. శ్రీకృష్ణుడు ఆ రాక్షసుల్ని సంహరించి, నీలాదేవిని వివాహమాడుతాడు. మూడవవిశేషం వరాహావతారకథ. ఇక నాల్గవవిశేషణం- తిరుమల పైనున్న కొలనుపేరు. "స్వామిపుష్కరిణి"-స్వామి అంటే కుమారస్వామి అని అర్థం. స్వామి అంటే పరమాత్మ అని


దైవకృప గలిగితే తన కర్మ లడ్డమా

గ్రహించినపుడు శ్రీవేంకటేశ్వరుడు అని భావించవచ్చు. అయితే ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసాంతపద్యాలలో 'స్కందసరస్తతటీ రమణ" అని చెప్పబడి ఉంది. అక్కడ కుమారస్వామిపుష్కరిణి అనే అర్థమే వస్తుంది.

తృతీయాశ్వాసాంతపద్యాలలో ఒకటి శ్రీకృష్ణుని, నరసింహస్వామిని స్తుతించిన పద్యంకాగా మరొకటి త్రివిక్రమ రూపుని గూర్చిన పద్యం.

కం॥ శ్రీమందిర భుజమధ్యమ
గోమండలకర్షి వేణుగుంభన, దృప్య
ద్భౌమాహృత సురజనయి-
త్రీ మణితాటంక! వృషగిరిస్థ! ఖగాంకా! (4-1)

**తాత్పర్యం**

లక్ష్మికి నివాసమైన వక్షస్థలం కలవాడా! మురళి పాటతో ఆవులమందను ఆనందింపజేసినవాడా! భూదేవి కుమారుడైన నరకాసురుణ్ణి చంపి, అదితికి చెవికమ్మలు తిరిగి ఇచ్చినవాడా! వృషాచలమందు నివాసముండేవాడా! గరుడ ధ్వజం కలవాడా!

**విశేషాలు**

ఈ పద్యంలో స్వామికి ఐదువిశేషణాలు చెప్పబడినాయి. అవి అన్నీ కూడ లోక ప్రసిద్ధిచెందిన అంశాలే. మొదటి విశేషణం శ్రీమహావిష్ణువును, రెండు, మూడువిశేషణాలు శ్రీకృష్ణుణ్ణి సూచిస్తున్నాయి. వృషాచలనివాసా! అనేది శ్రీవేంకటేశ్వరుణ్ణి సూచిస్తుంది. 'గరుడధ్వజ' (ఖగాంకా) అనేది శ్రీమహావిష్ణువునుండి శ్రీవేంకటేశ్వరునివరకు సూచించినదిగా ఉంది.

కం॥ కరధృత దరారివితరణ
పరిపాలిత తొండమాన్నృపాలక, పునరు
త్తరిత నరనప్తృ బాలక,
శరణాగతసేవధీ, భుజంగాశరథీ. (4-287)

**తాత్పర్యం**

చేతులలో ధరింపబడిన శంఖ, చక్రాలను దానం చేయడంవల్ల భక్తుడైన తొండమాన్ చక్రవర్తిని కాపాడినవాడా! ఉత్తరగర్భంలోనున్న పరీక్షిత్తును కాపాడినవాడా! శరణన్నవారికి కొంగుబంగారమైన వాడా! పాములను ఆహారంగా కలిగిన గరుత్మంతుణ్ణి రథిగా కలగినవాడా!

**విశేషాలు**

ఈ పద్యంలో శ్రీవేంకటేశ్వరునికి నాలుగువిశేషణాలు చెప్పబడినాయి. అందు మొదటివిశేషణానికి సంబంధించిన కథ ఏమంటే సుధర్ము డనే రాజుకు ఆకాశరాజు; తొండమానుడు అనేవారు కొడుకులు అందు ఆకాశరాజుకు కూతురు పద్మావతి, కొడుకు వసుధాముడు. పద్మావతిని శ్రీవేంకటేశ్వరుడు వివాహ మాడినాడు. ఆకాశరాజు తరువాత వసుధామునికి తొండమానునికి వైరం సంభవించింది. అపుడు భక్తుడైన తొండమానునికి స్వామివారి, శంఖచక్రాలు సాయంచేశాయి అనేది ఐతిహ్యం. రెండవవిశేషణం అర్జునుడి మనుమడు, అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్తు ఉత్తరగర్భంలో ఉండగా అశ్వత్థామ చంప తలపెట్టినపుడు, స్వామివారిచక్రం ఆమె గర్భంలో ప్రవేశించి ఆ బిడ్డను కాపాడింది. అతడే పరీక్షిత్తు. మూడవవిశేషణం శరణు అన్న వారికి కొంగుబంగారమైనవాడు. నాల్గవవిశేషణం గరుత్మంతుణ్ణి రథిగా కలిగినవాడు అని చెప్పబడింది.


చిత్రకారుడు: వజ్రగిరి జస్టిస్

కంII శ్రీ నీళా జాంబవతీ
మానస తామరస విహరమాణ మిళిందా!
భాసద్యుదయ కళిందా!
నానాంఘ్రిశిరోஉక్ష శేషనగ హర్యక్షా! (5-1)

**తాత్పర్యం**

లక్ష్మీదేవి, నీళాదేవి, జాంబవతీదేవుల మనస్సులనే తామరపూవులలో విహరించే తుమ్మెదా! నల్లని శరీరకాంతివంటి యమునానది పుట్టుకకు ఆధారమైన కళిందపర్వతంవంటి దేహం కలవాడా! అనేకాలైన పాదాలు, తలలు, కన్నులు గలిగిన విశ్వమూర్తీ! శేషపర్వతం మీద విహరించే సింహంవంటివాడా!

**విశేషాలు**

ఈ పద్యంలో స్వామికి నాలుగు విశేషణాలు చెప్పబడినాయి. అందు మొదటిది అమ్మవార్లమనస్సు పద్మాలతోను స్వామిని అందులో విహరించే తుమ్మెదగాను చెప్పబడింది. రెండవవిశేషణంలో స్వామివారిశరీరవర్ణం చెప్పబడింది. యమునానదినీరు నల్లగా ఉంటాయని ప్రసిద్ధి. ఆ యమునా నది నల్లగా దట్టంగా ఉన్న కళిందపర్వతంనుండి ఉద్భవిస్తుంది. కళిందపర్వతంవలె శ్రీస్వామి నీలవర్ణుడు అని చెప్పబడింది. మూడవవిశేషణం స్వామివారివిశ్వరూపచిహ్నం. నాల్గవ విశేషణం స్వామి శేషాచలంలో విహరించే సింగంతో పోల్చబడినాడు.

కంII శ్రీకారి కృపార్ద్రేక్షణ!
వైకుంఠ! యకుంఠ భక్తవరద! పదాబ్జా
స్తోక మరందాయిత గం
గా! కాకోదర నగోదయస్థపతంగా! (6-1)

**తాత్పర్యం**

సిరులను అనుగ్రహించే దయగలవాడా! వికుంఠ తనయా; ఎడతెరిపి లేకుండా భక్తులకు వరాలనిచ్చేవాడా! పాద పద్మాలలో గంగాదేవి కలవాడా! శేషాచలమనే పేరుగల ఉదయ పర్వతంపైన పొడిచిన సూర్యుడా!

**విశేషాలు**

ఈ పద్యంలో స్వామి దయాదృష్టి గలవాడని, కోరిన వరాలిచ్చేవాడని, పాదాలయందు గంగను కలిగినవాడని, శేషాచలంలో ఉదయించే సూర్యునివంటివా దని వర్ణింపబడింది.

ఉII స్కంద సరస్వతీరమణ కందర చందన కుంద వాటికా
మంద సమీరలోల వనమాలిక నిర్మల దివ్య విగ్రహా
స్పంద విభాధరీకృత నభస్స్ఫుట కాళిక, వల్లవాంగనా
బృంద మనోஉభిమాన ధృతి భేదన, పేశల వంశవాదనా!
(7-136)

**తాత్పర్యం**

కోనేటి ఒడ్డున గల గుహల యందలి చందనపు చెట్ల గాలిచే కదిలే తులసిమాలను ధరించినవాడు. స్వచ్ఛమైన నీల మేఘశ్యామకాంతితో ఆకాశం యొక్క కాంతిని తక్కువ చేయగల శరీరం కలవాడు. గోపికల మనస్సు భేదించేటట్లు పిల్లనగ్రోవిని వాయించేవాడు.

**విశేషాలు**

ఈ పద్యంలో స్వామి తులసీదళాన్ని ధరించినా డని, నీలమేఘశ్యాము డని, వేణునాదంతో గోపికల మనస్సును రంజింపజేయగలవా డని వర్ణింపబడింది.

సప్తగిరీశుడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి సప్తపర్యాయాలు తన దేవేరులతో సహా సందర్శించి భక్తి ప్రపత్తులతో సపర్యలు చేసి, ఎన్నో కానుకలు సమర్పించి, సాహితీకైంకర్యం చేసి, తన ప్రతి విజయానికి వెనుక భగవంతుని కరుణాకాటాక్షప్రసారం ఉన్న దని గాఢంగా విశ్వసించిన వైష్ణవభక్తాగ్రేసరుడైన మన శ్రీకృష్ణదేవ రాయల జీవితం ముమ్మాటికి ధన్యం.

## వైకుంఠపాళి

**:: 69 - సమాధానాలు ::**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వ | | 2 శ్రీ | | 3 వృ | | 4 కా | | 5 ప |
| రా | | | 6 ని | ష | ఘు | డు | | ద్మా |
| 7 హ | రి | | | భా | | | 8 కో | వ |
| స్వా | | 9 సు | | ద్రి | | 10 శు | | తి |
| మి | | 11 కే | శి | | 12 వ | కు | ళ | |
| | | శి | | 13 బృ | | డు | | |
| 14 ద | మ | | 15 మ | హ | తి | | 16 ని | 17 మి |
| ము | | 18 ల | | స్ప | | 19 పం | | త్ర |
| డు | | డ్డు | | 20 తి | రు | ప | తి | |

# స్టాంపుల్లో



# శ్రీవారు


- శ్రీమతి పుట్టి నాగలక్ష్మి,
98494 54660


'వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన'
అని తెలియని దెవరికి?!
'వేంకటేశసమోదేవో న భూతో న భవిష్యతి'
అని కైమోడ్చని వారెవరున్నారు??!!
'హరిముద్ర ధరించక అర్చించఁ బాత్రుఁడు గాఁడు/
వెరవుగా సోదించి వినుకొండో...'

అని తాళ్లపాక వాగ్గేయకారుల పిలుపు ఆలకించారు, అవధరించారు గనుకనే భారత తపాలాశాఖవారుకూడా తన వంతు స్టాంపు ముద్రణలతో కైమోడ్పులు చెల్లించుకున్నారు - శ్రీవారికి, పలు సందర్భాల్లో!

## ఆనంద నిలయం

తిరుమల శ్రీనివాసుడు నెలకొన్న గర్భగుడిపైగోపురానికి 'ఆనంద నిలయ'మని పేరు.




'ఆనందం' అనేకరకాలు. వాటిలో బ్రహ్మానందమే సర్వ శ్రేష్ఠం. చూడ చక్కనిది. బంగారుపూత కలది. ఆనందం భౌతికం కాదు. అనిర్వచనీయ మైన ఆనందం. అన్నమయ్య తన పాటలలో "అదె చూడు దదెమొక్కు దానంద మయ"మని భక్తులకు పరిచయం చేశాడు.

ఇలాంటి ఆనందనిలయ చిహ్నాన్ని 11-10-2002 రూ.15/- విలువలో స్టాంపుగా భారతప్రభుత్వం ప్రకటించింది. బంగారుతాపడం చేసిన గోపురం పసుపుపచ్చగా మిలమిల మెరిసిపోతూ కనువిందు చేస్తుంది. కాన్సిలేషన్ కూడా గోపురం కావడం ఒక విశేషమయితే/ ఫస్ట్ డే కవర్ మీద ముద్రించిన తిరుమలకొండ మీద అపూర్వశిలాతోరణం, మధ్యలో ఆకుపచ్చని చెట్లు నిజంగా మనకు తిరుమల (ఆనంద నిలయాన్ని)ని కళ్లముందు నిలుపుతాయి.

## లడ్డు

తిరుమల ప్రసాదాలలో అప్పం, లడ్డు, వడలను భక్తులు కోరడమే కాకుండా ఊర్లలో తమస్నేహితులకు, చుట్టాలకు పంచ డానికి ఇష్టపడతారు. పుణ్యక్షేత్రసందర్శనానంతరం ఊరు చేరుకొని 'సమారాధన' పేరున వంటకాలతో బాటు తీర్థప్రసాదాలు ఇవ్వడం నేటికీ ఆచారం. సంప్రదాయం.

ప్రస్తుతం తిరుమలలో పెద్దలడ్డు, చిన్నలడ్డులు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. తిరుచానూరులోని లడ్డుకు 'అమృతకలశం' అనిపేరు. ఇలాంటి 'లడ్డ' రుచి తిరుమలలోమాత్రం లభ్యం కనుక దీనిని 'తి.తి.దే. హక్కుగా' ప్రభుత్వం గుర్తించింది.




ఆబాలగోపాలానికి ప్రియమైన 'లడ్డును' గుర్తించి తపాలాశాఖ స్టాంపు(3-11-2017న) విడుదల చేశారు. లడ్డు తీపి ఎలాగో ఈ వార్తకూడా 'తీపి'.

## రామానుజాచార్యులు

ఆటంకాలు ఎదురైనా సడలని ధైర్యంతో ముందడుగు వేసిన ధీశాలి; పోరాటాలతో సమరం చేస్తూ పట్టుదలతో పయనం సాగించిన బాటసారి; సామాన్యులుకూడా తరించాలని-ద్వయమంత్రాన్ని, గుడి గోపురమెక్కి చాటిన విశాలహృదయుడు; కడజాతి వారిని తిరుక్కులత్తవర్ అని నామకరణం చేసి, ఆలయ




ప్రవేశానికి తలుపులు బార్లా తెరపించిన ఆప్తబంధువు; శేషాంశసంభూతులని వైష్ణవకోటి విశ్వసించే అవతారపురుషుడు భగవద్రామానుజాచార్యులు. మతప్రచారం చేస్తూ ఆలయపాలనను గాడిలో పెట్టిన సమర్థుడుగా నిరూపించుకొన్న రామానుజులు తిరుపతి, తిరుమలలో కొనసాగించిన సంస్కరణలు అనేకం.

తిరుమల బ్రహ్మోత్సవాలు తిరుమలలోనే జరిగేలా వ్యవస్థ ఏర్పరచడం. మాడవీథుల విస్తరణ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను గౌరవిస్తూ సంస్కరణలు చేబట్టిన సాహసి రామానుజాచార్యులు. ఇతరాలయాలకన్నా తిరుమలకు చేసిన సేవ అనంతం. ప్రశంసార్హం. ఇలాంటి భగవద్రామానుజుల సహస్రఉత్సవాల సందర్భం(01-05-2017)లో తపాలాశాఖ స్టాంపు విడుదల చేసింది. కన్యాకుమారినుండి కాశ్మీరందాకా మతప్రచారం చేసిన రామానుజులపేరుతో ఈ స్టాంపు విడుదల చేయడం అన్నివిధాల యోగ్యం. ప్రశస్తం.

## అన్నమాచార్యులు




తంబూర పట్టుకొని పల్లెపల్లె తిరుగుతూ వాడుకభాషలో గ్రామీణులను ఆకట్టుకుంటూ జానపదరీతులలో వందల కీర్తనలు పాడిన ప్రజాకవి అన్నమయ్య. వైష్ణవాన్ని సకలదేవతామూర్తులలో సందర్శించి, సమైక్యతను చాటిన ఆధ్యాత్మికగురువు. శృంగారసంకీర్తనలు పాడినా అవన్నీ మధురభక్తిప్లావితమే! అన్నమయ్య నందకాంశసంభూతుడు. హరి చెంతనుండే పరమభక్తుడు. తిరుమలకు వెళ్లేమార్గంలో భక్తులకు పరమసత్యాల్ని బోధించేవి- ప్రకటించేవి, తాళ్లపాకవారిసూక్తులే!

ఈ మహనీయుణ్ణి స్మరిస్తూ తపాలాశాఖవారు 18-03-2004 వ తేది రూ.5/-ల విలువలగల స్టాంపును ముద్రించి, స్టాంపుల ప్రపంచానికి అందించి, భారతతపాలాశాఖ ఈ స్టాంపు మీద తంబురాన్ని చేతపట్టుకున్న అన్నమాచార్యులవారి విగ్రహం మనకు కన్పిస్తుంది.

## పురందరదాసు




అన్నమాచార్యులు పదకవితాపితామహుడైతే, పురందరదాసు కర్ణాటకసంగీతపితామహుడు. ఇరువురు విజయనగరసామ్రాజ్య కాలంలో జీవించినవారే. 4 లక్షల పై చిలుకు పదాలు పాడినాడని దాససాహిత్యం చెబుతుంది.

అన్నమయ్య విస్తృత వైష్ణవ దృష్టితో విఠలుని వేంకటేశ్వరునిలో అభిన్నుడైన రూపంగా భావిస్తే, పురందరదాసు పురందరవిఠల అంకితపదంతో పదాలు వ్రాసిన 'దేవరంచరె తిమ్మప్ప' అని శ్రీవేంకటేశ్వరుని సుమారు 60పదాలలో కీర్తించిన వాడు. ఈ వాగ్గేయకారుడి స్టాంపును 14-01-1964న విడుదల చేశారు.

## తరిగొండ వెంగమాంబ




ఒకవక్క సారస్వత సేవను, మరోవంక స్వామి కైంకర్యాలను, ఇంకోవైపు శిష్యులకు, శిష్యురాండ్రకు తత్త్వోపదేశాలను కొనసాగిస్తూ తిరుమలమీద చిరకాలం జీవించిన కవయిత్రి తరిగొండ వెంగమాంబ. తాను పుట్టిన తరిగొండలోని నరసింహస్వామిని, సప్తగిరులమీది శ్రీనివాసుని అభేదంగా భావిస్తూ 18 రచనలు చేసిన తపస్వి.

తరిగొండ వెంగమాంబ అజరామర కీర్తికి తిరుమలలో వినబడే 'తాళ్లపాకవారిలాలి, తరిగొండవారిహారతి' ఒక ప్రబల సాక్ష్యం.

తిరుమలలో భక్తాదులు సంతృప్తిగా అన్నప్రసాదం స్వీకరించే భవనం. **'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఉచిత అన్నప్రసాద కేంద్రం'** సహస్రచంద్రదర్శనం పూర్తిచేసుకొని ఈశ్వరనామసంవత్సరం(1817) శ్రావణమాసంలో తిరుమల శ్రీవేంకటేశునిలో లీనమైన వెంగమాంబ స్మృత్యర్థం తపాలాశాఖవారు 26-04-2017 తేది రూ.5/-ల విలువగల స్టాంపు విడుదల చేయడం కవయిత్రులను గౌరవించినట్లు, భక్తశిరోమణికి నీరాజనమెత్తినట్లు.

# వాహనమూ, కేతనమూ రెండూ ఆయనే!

– శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు,
99896 79681

పరవాసుదేవుని కైంకర్యం సలిపే నిత్యసూరులలో గరుత్మంతుడు ఒకరు. అనంత, గరుడ, విష్వక్సేనులు ముగ్గురూ నిత్యసూరులలో ప్రముఖులు. అనంతుడు శయనంగా/ ఆసనంగా, విష్వక్సేనుడు సేనానిగా, గరుడుడు వాహనంగా నిత్యం పెరుమాళ్ల సన్నిధానంలో ఉంటారు. వైకుంఠంలో విష్ణువుకు– పెరుమాళ్లకు ముందు భాగాన కుడివైపు హస్తాంజలిముద్రతో గరుడు డుంటాడు. దాస, స్నేహ, వాహన, ఆసన, ధ్వజ, మేల్కట్టి, వింజామరలుగా గరుడుడు పెరుమాళ్లకు కైంకర్యం సలుపుతుంటాడు.

ఎల్లవేళల గరుత్మంతుడు వైకుంఠనాథునిముందు జాగ్రదవస్థలో సర్వ సన్నద్ధుడై ఉంటాడు. వేదాంతదేశికులవారు తన 'గరుడ పంచాశత్'లో పెరుమాళ్ల సన్నిధిలో కొలువై ఉన్న గరుడుని 'భగవన్ముఖదర్పణం'గా పేర్కొన్నారు. మానవీయ ప్రపంచంలో పాలకులు విజయయాత్రకు వెళ్లే ముందు తాము దర్పణం ముందుండి అవసరమైనవన్నీ ధరిస్తారు. దర్పణదర్శనం విజయ సూచకమని నమ్మకం. గరుడునిలోనూ కల్యాణగుణగణాలను భగవానుడు దివ్యాత్మస్వరూపంగా దర్శిస్తాడు.



పెరుమాళ్లవలె గరుడుడుకూడా నాలుగువ్యూహాలుగ దర్శనమిస్తాడు. పెరుమాళ్లు నాలుగుయుగాలలో నాలుగువర్ణాలుగ గోచరిస్తాడు. ఆయనశరీరం నాలుగువర్ణాలుగ కనిపిస్తుంది. గరుడుడుకూడా ముఖం నల్లగా, చేతులు కుంకుమవర్ణంగా, రెక్కలు సూర్యునివలె తెల్లగా, పాదాలు పసుపుపచ్చగా సువర్ణ ఛాయగా కనిపిస్తాయి. సత్య, సువర్ణ, గరుడ, తార్క్ష్య, విహగేశ్వర అనే ఐదింటిని గరుడ వ్యూహమూర్తులు అంటారు. పంచవాయువులకు ఈ ఐదు గరుడ మూర్తులు అధిపతులు. 1)సత్యమూర్తి–ప్రాణవాయువు, 2)సువర్ణమూర్తి–అపానవాయువు, 3)గరుడమూర్తి–వ్యానవాయువు, 4)తార్క్ష్యమూర్తి–సమానవాయువు, 5)విహగేశ్వరమూర్తి–ఉదానవాయువు. పంచవాయువులనూ గరుడుడు నియంత్రణ చేస్తుంటాడు. గరుడమంత్రంలోనూ ఐదువర్ణాలుంటాయి. కనుక గరుడ మంత్రాన్ని 'పంచవర్ణి' అంటారు. చతుర్వ్యూహాలు సత్య–సంకర్షణ, సువర్ణ–వాసుదేవ, గరుడ–ప్రద్యుమ్న, తార్క్ష్య–అనిరుద్ధ కాగా ఐదవదైన విహగేశ్వరుడు పరవాసుదేవునివాహనం.

గరుడుడు వేదస్వరూపి. విజయానికి ధర్మం ప్రధానమైంది. జయాలకు గరుడుడు సంకేతం. గరుడుడు జ్ఞాన, బల, మేధా, శక్తులు కలవాడు. పరమపదవాసుదేవుడు చతుర్వ్యూహుడు. ప్రతివ్యూహంకూడా రెండుదివ్యగుణాలు కలిగి ఉంటుంది. ఆ వ్యూహాలలోని సంకర్షణుడు గరుడుడే. సంకర్షణుడు జ్ఞాన, బలగుణాలు కలిగి ఉంటాడు. గరుడుని ప్రతీకాత్మను, జ్ఞానబలగుణాలు సూచిస్తాయి. **వాహనంగా గరుడుడు హరిపదయుగళాన్ని, సంస్కృతద్రావిడవేదాలకి ప్రతీకగా తన కరయుగంతో ధరించి ఉంటాడు.** గరుడుని తిరునామధేయాలు అనేకం. వాటిలో కొన్ని గరుత్మాన్, పక్షిరాజ, వైనతేయ, సుపర్ణ, కాశ్యపేయ, పెరియతిరువడి మొదలైనవి నూటికి పైగా ఉన్నాయి.

**హనుమంతునికి సిరియతిరువడి అనే పేరుండగా గరుత్మంతునికి పెరియతిరువడి** అనే పేరుండడం విశేషం. హనుమంతుడు విష్ణువుకు శ్రీరామావతారంలో మాత్రమే బంటుకాగా గరుత్మంతుడు విష్ణువుకు వాహనంగా ఎల్లవేళల కైంకర్యం సలిపే



**గరుడోపాసన బహుప్రాచీనమైంది. గరుడోపాసన, గరుడ ధ్యానం, గరుడమంత్రం, గరుడగాయత్రి మొదలైనవాటిని గురించి సంహితలలో ఉంది. వశ్యం, ఆకర్షణ, విద్వేషణ, హరణ, ఉచ్చాటన, శోషణ, స్తంభన, ఆవేశ, సర్వాకర్షణ, విషహరణ, సముద్రతరణ, నభోలంఘనం, వాయ్వగ్నిజల భూప్రవేశనం, ఇంద్రజాలం, విజయ, భూతసంవనన, జ్ఞాన, దేవతాసన్నిధాన సందర్భాలలో ఆయా ప్రయోజనాలకోసంకూడా గారుడమంత్రాన్ని ప్రయోగిస్తుంటారు.**

నిత్యసూరి. ఇది గరుత్మంతుని గొప్పతనానికీ, స్థాయికీ నిదర్శనం. గరుత్మంతునికి దక్షిణభారతంలో గొప్ప స్థానం కల్పించబడింది. గరుడమూర్తి అర్ధం పక్షి రూపంగా, అర్ధం మానవాకారంగా దర్శనమిస్తుంది. రెక్కలు, ముక్కు, గోళ్లు గద్దపక్షివలె, మిగిలిన శరీర ఇంద్రియాలు మానవునివలె ఉండేమూర్తి గరుడమూర్తి.

గరుడమూర్తులు సాధారణంగా మూడుతావులలో దర్శనమిస్తాయి. 1)ఆలయ/మంటపాలు, 2)గరుడ స్తంభందగ్గర, 3)విష్ణువు ఉత్సవమూర్తి వాహనస్థానంలో.

మానసారశిల్పశాస్త్రంలో గరుడమూర్తి లక్షణాన్ని తెలియచేసే ప్రత్యేకమైన అధ్యాయం (61) ఉంది. ఆగమసంహితలలో పురాణాలలోని గరుడవర్ణనలను పరిశీలిస్తే ఈ మూర్తిలక్షణం తెలుస్తుంది.

గరుడునిదృష్టి చాలా సూక్ష్మమైంది, సునిశితమైంది. గరుడుని శుభదృష్టిపడిన వ్యక్తిని విజయం వరించినట్లే. రామాయణంలో రామలక్ష్మణులు మాల్యవంతునితో నాగాస్త్రంవల్ల తాత్కాలికంగా బంధితులైనపుడు వారికి గరుడదృష్టి వలననే విమోచనం కలుగుతుంది.

గరుడునిదృష్టి శుభస్కరమైంది, సూక్ష్మమైందేకాక, ప్రయోజనకరమైందికూడ. గరుడునిదృష్టిని ఐదువిభాగాలుగా వింగడించవచ్చు. అవి– కిరం, స్ఫరం, త్రియక్, అర్ధం మరియు ఆతః. కిరం అనే దృష్టి ఫలానుగ్రహకారకమైంది. ఇది గరుడుని కడగంటిచూపునుండి లభిస్తుంది. కనులు బాగా తెరచినప్పటి దృష్టిని **స్ఫరం** అంటారు. ఒక మూలగా చూచే చూపును **త్రియక్** అంటారు. అర్ధనిమీలితనేత్రాలతో చూసే చూపును **అర్ధం** అంటారు. పెరుమాళ్లు తన భుజస్కంధాలమీద ఉన్నప్పుడు చూచే దృష్టిని **ఆతః** అంటారు. కిరం శుభాన్ని అనుగ్రహిస్తుంది. స్ఫరం అశుభాన్ని తెలియచేస్తుంది. త్రియక్ దేశాన్ని సంరక్షిస్తుంది. అర్ధం కీడును అనారోగ్యాన్ని తొలగిస్తుంది. ఆతః ప్రకాశవంతాన్ని కలిగిస్తుంది.

గరుడునివాణి ఆయనదృష్టికన్నకూడా మంగళప్రదమైంది. కర్ణాటకసంగీతంలో 'గరుడవాణి' అనే రాగం ఒకటుంది. గరుడవాణి సామగానం. గరుడవాణిని అన్ని మంగళవాద్యాల ద్వారాకూడా వినవచ్చు. ఆరాధనలో వాయించే గంటపై భాగం గరుడ/సుదర్శనమూర్తితో ఉండటం మనకు తెలుసు. ఆలయాలలో సంప్రోక్షణ చేసే సందర్భాన పెద్దగంటల ద్వారా గరుడవాణి శబ్దాలు వినిపిస్తుంటారు. వివాహాలలో మంగళసూత్రధారణ సందర్భానకూడా గరుడవాణిని శబ్దాలుగా వాయిస్తారు.

గరుడుని అలంకారభూషణాలలో సర్పాలు పేర్కొన దగినవి. ఆయన కంకణంగా **ఆదిశేషుడు,** యజ్ఞోపవీతంగా **వాసుకి,** మొలనూలుగా **దక్షుని,** మాలికగా **కర్కోటకుని,** కుడిచెవికి కుండలంగా **పద్మని,** ఎడమచెవికి కుండలంగా **మహాపద్మని,** కేశాలకు అలంకరణగా **శంఖపాలుని,** కుడిభుజానికి **గుళికుని** అలంకరించుకుని ఉంటాడు. ఇవి గరుడుని అష్టనాగాభరణాలు.


గరుడుని సాధారణంగా ఎర్రనివస్త్రంతో అలంకరిస్తారు. మల్లె, మరికొళుంధు, దవనం, సంపంగులను గరుడుని పూజలో వినియోగిస్తారు.

**గరుడుడు అణిమ, మహిమ, లఘిమ, గరిమ, ఈశిత్వ, వశిత్వ, ప్రాప్తి, ప్రాకామ్య అనే అష్టైశ్వర్యాలను అనుగ్రహించేందుకు కూడా సమర్థుడు. జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజ- అనే షడ్గుణాలు కలిగినవాడు గరుడుడు. ఇవి భగవంతుని లక్షణాలు కూడా కావటం గమనార్హం.**

గరుడుని **'యువతీ జనప్రియాయ నమః'** అని కూడా నమస్కరిస్తుంటారు. స్త్రీలుకూడా గరుడుని అర్చించేందుకు అనుమతించబడ్డారు. యువతులు గరుడునికి కుంకుమార్చన చేస్తారు. తిరుక్కన్నమంగైలో సాయంసమయాన గరుడునికి తొమ్మిదిగజాల వస్త్రాన్ని **వేష్టి** (పంచ)గా సమర్పిస్తుంటారు. ఈ పూజాఫలం మిక్కుటంగా ఉంటుం దని భక్తుల నమ్మకం.

గరుడుని పేర్లలో 'సుపర్ణ' అనేది ఒకటి. విష్ణుసహస్ర నామాలలో 'సుపర్ణ' అనే నామం రెండు పర్యాయాలు వస్తుంది. పెరుమాళ్లకు, పెరియతిరువడికి సుపర్ణ అని ఒకే పేరుండటం విశేషం. భగవద్గీతలో పక్షులందు గరుడుడు నేనే అని భగ వానుడు పల్కటం ఈ సందర్భాన స్మరణీయం.

గరుడధ్యానం సర్పవిషానికి విరుగుడు. భల్లూకదంతంపై గరుడునిచిత్రం వేయించి దాన్ని ధరించినవారికి పాముకాటువల్ల ప్రాణాపాయం ఉండ దని గరుడపురాణం చెప్తోంది. ఎవరయితే సర్పాలవల్ల అపాయం కలుగకుండా రక్షించబడా లని అనుకుంటారో వారు తమ నివాసస్థానంలో గరుడుని చిత్రాన్ని వేయించుకోవాలని కూడా గరుడపురాణం చెప్తోంది. ఆ చిత్రంలోని గరుడునినోటి దగ్గర 'ఓం' కారాన్ని, గొంతుక దగ్గర 'కురు' శబ్దాన్ని తప్పక రాయించవలసి ఉంటుంది. గరుడునికి పాదభూషణంగా కుందపుష్పాలు ఉంచాలి. పాదాలదగ్గర 'స్వాహా' అని రాయించాలి. అలా చేస్తే ఆ ఇంటి సమీపానికి కూడా పాములు రా వని నమ్మకం.



ఔషధసంబంధమైన ధన్వంతరికూడా గరుత్మంతునికి భక్తుడు. వేదాంతదేశికులవారికి హయగ్రీవమంత్రాన్ని గరుడుడు ఉపదేశించినట్లు చెప్తారు. గరుడుడు వేదాంతదేశికులవారికి హయగ్రీవవిగ్రహంకూడా అనుగ్రహించినట్లు చెప్తారు. తమిళ నాడులో దక్షిణ ఆర్కాటు జిల్లాలోని తిరువహీంద్రపురానికి దేశి కులవారు ఒకప్పుడు వెళతారు. ఆయన అక్కడ 'ఔషధగిరి' అనే కొండపై కూర్చొని గరుడమంత్రం జపిస్తూ తపమాచరిస్తారు. అది సిద్ధక్షేత్రం. తిరుకోయిలూలోని దేవనాథసన్నిధికి ముందు ఈ కొండ ఉంది. ఈ కొండపై అళగియసింగ సన్నిధికూడా ఉంది. ఇక్కడ ఒక పిప్పల (రాగి) వృక్షం కింద ఆసీనుడై దేశి


## గరుడుడు - వివిధ విషయాలు

- గరుడునికి సుముఖ, సునామ, సునేత్ర, సువర్చస, సురుచి, సుబల అనే ఆరుగురు పుత్రులున్నారు.
- గరుడముద్రను ఆగమాలు పేర్కొన్నాయి. గరుడముద్ర ప్రదర్శన సమయం, దాని ప్రయోజనం సంహితలలో చెప్పబడింది.
- గరుడవ్యూహం (వైరిసైన్యాలను భేదించే వ్యూహం- మహా భారత భీష్మపర్వం 56-2)
- గరుడాచలం (శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన పర్వతం)
- గరుడపచ్చ (నవరత్నాలలో ఒకటైన మరకతం)
- గరుడవాహనాలు, గరుడసరులు (శాలిధాన్య విశేషాలు)
- గరుడమల్లె (మల్లెజాతి విశేషం)
- గరుడముక్కు (చంచువు)
- గరుడారతి (ఆరాత్రిక విశేషం)
- గారుడం (పురాణ, మంత్ర, తంత్ర, రత్నాదికాలు గరుడసంబంధితాలు).
- గరుడ ఎయిర్‌లైన్స్ (ఇండోనేషియా విమానసంస్థ పేరు)

కులవారు తపమాచరిస్తారు. ఇక్కడ దేశికుల వారికి గరుడసాక్షాత్కారం జరిగిందని చెప్తారు. హయగ్రీవమంత్రోపదేశం దేశికులవారికి ఇక్కడే జరిగింది. హయగ్రీవుని ఆరాధించమని దేశికుల వారిని గరుడుడు ఆదేశించటం జరిగిందంటారు. గరుడుడు హయగ్రీవమంత్రోపదేశం చేశాకనే దేశికులవారికి పెరుమాళ్ల దర్శనమైందని చెప్తారు.

**శ్రీవిల్లిపుత్తూరులోని ఆండాళ్ కోయిల్ గర్భగృహంలో ఒకే సింహపీఠంపై రంగమన్నార్, ఆండాళ్, గరుడాళ్వార్ దర్శన మిస్తారు.** గరుడుడు **చిత్**, రంగమన్నార్ **ఈశ్వరుడు**, ఆండాళ్ **చిత్తు**. పెరుమాళ్లు ఆండాళులతో సమానంగా దర్శనమొసగే స్థాయి ఇక్కడ గరుడునికి లభించింది. ఆండాళ్ వివాహంలో శ్రీరంగనాథులవారిని తోడ్కొని రావడంలో చేసిన కైంకర్యఫలితం అది. ఇలా చెప్పూపోతే గరుడప్రభావం ప్రాచీనకాలంనుంచి అర్వాచీనకాలంవరకు జనజీవనస్రవంతితో కలసిపోయిన ఎన్నో విశేషాలున్నాయి.

విశ్వదాభిరామం　　వేమన పద్యసూక్తి



## సంపదమదం

కనియు గాన లేదు; కదలింప డానోరు;
వినియు వినగ లేదు విస్మయమున;
సంపద గలవానిసన్నిపాతం బది;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** కని= చూచి; విస్మయము= ఆశ్చర్యం; సంపద= ఆస్తి; సన్నిపాతము= మైకం కలిగించే ఒకానొక రోగం.

**భావం:** ఐశ్వర్యం ఉన్నవాడికి మైకం కలిగించేజబ్బు పట్టుకుంటుంది. చూస్తాడు. చూడనట్లుంటాడు. వింటాడు. కాని విననట్లుంటాడు. నోరు మెదపడు. అదే ఆశ్చర్యం!

**వివరణ:** పిసినిగొట్టువాడిని బాధ పెట్టాలంటే ఏమీ కష్టపడ నవసరం లేదు. వాడిని డబ్బులు ఇమ్మని అడిగితే చాలు. ధనం ఇవ్వడానికి ఏమాత్రం ఇష్టపడని వాడికి డబ్బు పోతుందేమో అని చచ్చినంత బాధ కలుగుతుంది. నిజానికి సంపాదించినడబ్బును వృథాగా ఖర్చు చేయకూడదు. కానీ, పిసినారి తనం ఏమాత్రం పనికిరాదు. సంపాదనలో కొంతభాగం దానం చేయడానికి, ధర్మసంస్థలకు వినియోగించాలి. "అటు పెట్టిన, ఇటు పెట్టిన ఇటుపెట్టక ముక్తి రాదు" అన్నారు. నిలువు నామాలు పెట్టినా, అడ్డనామాలు పెట్టినా, ఆపదలో ఉన్నవారికి పెట్టకుండా మోక్షం రాదు అని అర్థం. అటువంటి పిసినారుల మీద వేమన సెలగోల విసరుతున్నాడు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## 69 వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | ■ | 3 | ■ | 4 | ■ | 5 |
| | ■ | ■ | 6 | | | | ■ | |
| 7 | | ■ | ■ | | ■ | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| | ■ | 11 | | ■ | 12 | | | ■ |
| ■ | ■ | | ■ | 13 | ■ | | ■ | ■ |
| 14 | | ■ | 15 | | | ■ | 16 | 17 |
| | ■ | 18 | ■ | | ■ | 19 | ■ | |
| | ■ | | ■ | 20 | | | | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)లక్ష్మి(1); 6)కుశుని నాల్గవకుమారుడు(4); 7)ఇతడు భూలోకంలో శ్రీనివాసుడుగా అవతరించాడు(2); 8)'హారము'(2); 11)ఈ రాక్షసుణ్ణి కృష్ణుడు చంపాడు(2); 12)ఈమె శ్రీనివాసునికి సేవ చేసింది(3); 14)భీష్ముడు అంపశయ్యపై ఉండగా దర్శించిన మహర్షి(2); 15)నారదుని వీణ పేరు(3); 16)దత్తాత్రేయుని పుత్రుడు(2); 20)విష్ణునివాసం, శ్రీనివాసం ఉన్న ఊరు(4)

### నిలువు

1)ముందుగా వీరిని దర్శించిన తర్వాతనే శ్రీవారిని చూడాలి(5); 3)కృతయుగంలో 'వేంకటాచలం' పేరు(4); 4)యముడు(2); 5)ఆకాశరాజు కూతురు(4); 9)విదర్భరాజు కూతురు(3); 10)పద్మావతి ఈ మహర్షి ఆశ్రమంలోనే కొలువైయున్నది(3); 13)దెబ్బతగిలిన శ్రీనివాసునికి ఔషధం ఇచ్చినవాడు(4); 14)దమయంతి సోదరుడు(3); 17)పార్వతీదేవికి సహచరి(2); 18)వేంకటేశ్వరునికి ప్రధానమైన ప్రసాదం(2); 19)మేరువుని కూతురు(2);

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

శ్రీవేంకటేశ్వరలీలలు



# సత్యం ప్రకటించిన దైవం

శ్రీమతి పి.స్వరూప, 63017 50508

అది 2008 సంవత్సరం. ప్రభుత్వ ఉద్యోగంకోసం డి.ఎస్.సి పరీక్ష రాద్దామని దరఖాస్తు చేశాను. ప్రభుత్వోద్యోగం వస్తే తల నీలాలు సమర్పిస్తానని తిరుమల స్వామికి మొక్కుకున్నా. స్వామికి మొక్కుకుంటే కోరికలు నెరవేరతాయి అంటారు కదా! చూద్దాం అనుకున్నా. అది అహంకారమా, పొగరా, తెలియనితనమా... నాకిప్పటికీ అర్థం కాదు. ఎందుకు నాలో అలాంటి భావం వచ్చిందో ఇప్పటికీ అంతుబట్టదు. పరీక్షకు హాజరై ఏదో అలా నాలుగు ముక్కలు రాసి వచ్చేసా. ఫలితాలు వచ్చాయి కానీ ఉద్యోగం రాలేదు. దాంతో మొక్కు కూడా తీర్చలేదు. ప్రభుత్వ ఉద్యోగం వస్తే కదా మొక్కుతీర్చాలి. పెద్ద తర్కపండితురాలిగా నాలో నేను చర్చించుకున్నా. ఉద్యోగం రాలేదు కాబట్టి మొక్కు తీర్చనని నిర్ణయం తీసుకున్నా. 'చూశావా... నేను మొక్కు తీర్చకపోయినా వేంకటేశ్వరస్వామి నన్నేమీ చేయలేదంటూ అందరితో చెప్పి నవ్వుకునేదాన్ని కూడా.' కొన్నాళ్లకు ఆ విషయం కూడా మర్చిపోయాను.


కాలం గడుస్తోంది. మూడేళ్లక్రితం...నాకు తీవ్రమైన జ్వరం. ఇంకా అనేక శారీరకఆరోగ్యసమస్యలు చుట్టుముట్టాయి. ఆస్పత్రులచుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాను. వేలు నుంచి ఖర్చు లక్షలకు చేరుతోంది. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఎందరో డాక్టర్లను మార్చాను. కొంతకాలానికి ఉపశమనం లభించింది. హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నా.

ఇంతలో మా అమ్మ పిడుగులాంటి వార్త చెప్పింది. 'నీ ఆరోగ్యం కుదుటపడితే తిరుపతి వచ్చి స్వామికి నీ తలనీలాలు ఇస్తానని మొక్కుకున్నానే' అంది. ఓ క్షణం పాటు నాకు మాట రాలేదు. నా జుట్టు నువ్వు మొక్కుకోవటం ఏమిటమ్మా అంటూ కాసేపు గొడవ చేశాను. ఏదో అంది కానీ పట్టించుకోవాల్సిన అవసరం లేదని మొక్కు విషయం పక్కకు పెట్టేశాను. కానీ స్వామి మాత్రం నా విషయం పక్కకు పెట్టలేదు. ఇంట్లో పూజ జరుగుతున్నప్పుడు మా అమ్మవంటి మీదకు వచ్చారు. మొక్కు విషయం గుర్తుచేశారు. తప్పయి పోయింది స్వామీ అంటూ లెంపలు వేసుకున్నాక కానీ అమ్మ (స్వామి) శాంతించలేదు.

ఇక ఆలస్యం చేయకుండా కుటుంబం అంతా స్వామి కొండకు చేరుకున్నాం. మొక్కు తీర్చుకుని, దర్శనం చేసుకున్నాం. అలా దర్శనం చేసుకుని బయటకు వచ్చానో లేదో, ఏదో తెలియని ప్రశాంతత ఆవరించింది. అప్పటిదాకా నాలో ఉన్న తెలియని భయంపోయింది. నేనున్నానంటూ ఎవరో భరోసా ఇస్తున్న ధైర్యం కలిగింది. మనసు తేలికపడింది.

ఇదంతా తిరుమలస్వామిమహిమ అని వెంటనే అర్థమైంది. మరోసారి లెంపలు వేసుకుని, స్వామిని ప్రార్థించాను. చుట్టుపక్కల ఉన్న క్షేత్రాలన్నీ చూచుకుని అందరం క్షేమంగా ఇంటికి చేరుకున్నాం.

అప్పటి నుంచి ఏడుకొండల దైవానికి పరమభక్తు రాలిగా మారాను. తిరుమల శ్రీవారు నిజంగా భక్తులను కాపాడ డానికి ఏడుకొండల మీద ఎప్పటికీ ఉంటారు. ఇది నేను అను భవపూర్వకంగా తెలుసుకున్న విషయం. స్వామిమహిమ అంతు లేనిది.




చిత్ర కథ

# గరుడవాహనం

కథ– డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు– తుంబలి శివాజీ




సాహసంతో అమృతం తెచ్చి, కద్రువకి ఇచ్చాడు గరుత్మంతుడు.
మీకు నా దాస్యం నుంచి విముక్తి కలిగింది.
ధన్యులం
అంతలో ఇంద్రుడు వేగంగా వచ్చి అమృతకలశాన్ని కద్రువ దగ్గరనుండి తీసుకొని పారిపోయాడు. విచారంతో కద్రువ...
అయ్యో! నా అమృతం.. నా అమృతం...
విష్ణువు గరుత్మంతుని ఎదుట ప్రత్యక్షమయ్యాడు.
గరుడా! నీ మాతృభక్తికి మెచ్చాను. ఏదైనా వరాన్ని కోరుకో...
స్వామీ! నాగుల్ని నాకు ఆహారంగా అనుగ్రహించు..
మరో వరాన్ని కూడా కోరుకో నాయనా!
నీ వాహనంగా ఉండే వరాన్ని అనుగ్రహించు పరమాత్మా!
తథాస్తు వైనతేయా!
ధన్యుణ్ణి స్వామీ!
ఆనాటి నుండి వాహన రూపంలో విష్ణువుని సేవిస్తున్నాడు గరుత్మంతుడు.
లోకా: సమస్తా: సుఖినో భవంతు!
2

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

**గరుడ వ్యూహ మూర్తులు**

1) సత్య
2) సువర్ణ
3) గరుడ
4) తార్క్ష్య
5) విహగేశ్వర

## పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) పెద్దశేషవాహనం | అ) పగలు ఉత్సవము |
| 2) సింహవాహనం | ఆ) రాత్రి ఉత్సవము |
| 3) హనుమద్వాహనం | ఇ) పగలు ఉత్సవము |
| 4) గరుడవాహనం | ఈ) రాత్రి ఉత్సవము |
| 5) చంద్రప్రభవాహనం | ఉ) రాత్రి ఉత్సవము |

జవాబులు: 1-(ఈ); 2-(అ); 3-(ఇ); 4-(ఆ); 5-(ఉ)

## మీకు తెలుసా?

1) ఆనందనిలయుడు ఎవరు?
2) శ్రీవేంకటేశ్వరుని బంగారుగోపురం పేరు?
3) ఆనందనిలయాన్ని నిర్మించినది?
4) శ్రీవారిబ్రహ్మోత్సవాలలో విశేషమైనది?
5) గరుడమంత్రంలో ఎన్ని వర్ణాలుంటాయి?
6) సిరియతిరువడి అని ఎవరికి పేరు?
7) పెరియతిరువడి అని ఎవరికి పేరు?

**జవాబులు:**
1) శ్రీవేంకటేశ్వరుడు
2) ఆనందనిలయం
3) తొండమాన్ చక్రవర్తి
4) గరుడసేవ
5) ఐదు
6) హనుమంతుడు
7) గరుత్మంతుడు

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

వ నా దే న దై
క ల మ భు మ ము

**జవాబు:** కమలనాభుడే మన దైవము

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., Special Officer (Press & Publications), T.T.D. Press, Tirupati and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Published at Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2021 అక్టోబరు 07 నుండి 15 వరకు





14-10-2021
గురువారం
పగలు: రథోత్సవం

14-10-2021
గురువారం
రాత్రి: అశ్వవాహనం

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-09-2021 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

